www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

నేడు ఈడీ ముందుకు బీఎల్ఎన్ రెడ్డి

ఫార్ములా-ఈ కారు రేసు కేసులో ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్

రేపు అర్వింద్‌కుమార్ విచారణ.. ఈ నెల 7వ తేదీన కేటీఆర్..

12



బీఎల్ఎన్ రెడ్డి

నాది తప్పయితే.. రేవంత్ చేసిందీ

తప్పే

ఫార్ములా-ఈ రేస్‌ను రద్దు చేసినందుకు

ఆయనపై కూడా కేసు పెట్టాలి

ఏసీబీ, ఈడీ కేసులను దీటుగా ఎదుర్కొంటా

సుప్రీంకోర్టు తిట్లు తిన్న ఏకైక సీఎం రేవంత్: కేటీఆర్

గురువారం | 2-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 275 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: తదియ రా. 1.09 తదుపరి చవితి; నక్షత్రం: శ్రవణం రా. 11.10 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: తె.3.02-4.34; దుర్ముహూర్తం: ఉ.10.09-11.13, మ.2.53-3.37; అమృతఘడియలు: మ.1.01-2.35; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.49, సూర్యాస్తమయం: 5.48 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



500 పాయింట్లు ఊదేశారు..

900 కోట్లు తాగేశారు

మద్యం అమ్మకాల్లో కొత్త ఏడాది జోష్ 10

హైదరాబాద్‌లో డ్రంకెన్ డ్రైవ్‌లో బీఏసీ కౌంట్ 500 దాటిన కేసులు 9.. గరిష్ఠంగా 550 కౌంట్

డిసెంబరు చివరి రెండ్రోజుల్లో 900 కోట్ల విక్రయాలు!

తల్లిని, నలుగురు చెల్లెళ్లను చంపేశాడు!

గొంతు, మణికట్టు కోసి హత్యలు

యూపీలోని లఖ్‌నవూలో ఘటన

హత్యల తర్వాత హంతకుడి వీడియో

మా మతస్థులే ఆగ్రాలోని మా ఇంటిని ఆక్రమించుకున్నారు 2

నా చెల్లెళ్లను హైదరాబాద్‌లో అమ్మే కుట్ర

మేం హిందూమతంలోకి మారాలనుకున్నాం

వీడియోలో వ్యాఖ్యలు.. అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు



అర్షద్



ఎడారిలో భారీ సోలార్ వాల్

చైనా మరో అద్భుతం.. 400 కి.మీ. పొడవు, 5 కి.మీ. వెడల్పుతో ప్లాంట్

100 గిగావాట్ల విద్యుత్తు లక్ష్యం 2

ఇప్పటికే 5.42 గిగావాట్ల ఉత్పత్తి

అనంత్ 'టైమ్'.. చాలా కాస్ట్‌లీ బ్రో!

అంబానీ రిస్ట్ వాచ్ ఖరీదు రూ.22 కోట్లు

ప్రపంచంలో ముగ్గురి వద్దే ఆ గడియారం





నేను మారాను..

మీరూ మారండి!

ఇకపై పార్టీ నేతలకు ఎక్కువ సమయమిస్తా.. అందరి రిపోర్టు కార్డు నా దగ్గరుంది



నా గురించి మీరనుకున్నట్లే.. మీ గురించి కింది స్థాయి నేతలు అనుకుంటారు

పని చేయని వారిని ఉపేక్షించేది లేదు

స్థానిక ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేయనున్నాం!

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, కార్పొరేషన్ చైర్మన్లు 4 స్తంభాల్లా నిలబడి పనిచేయాలి

పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డోళ్లకే టికెట్లు

కుదరని చోట నామినేటెడ్ పోస్టుల్లో..

కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 'నేను మారాను.. మీరూ మారాలి' అంటూ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇకపై పార్టీ నాయకులకు ఎక్కువ సమయం కేటాయిస్తానని అన్నారు. నిరుటితో పోలిస్తే కొత్త ఏడాది తనలో మార్పు వచ్చిందన్నారు గత ఏడాదికి భిన్నంగా తాను బుధవారం ఉదయం నుంచి మంత్రులకు, ఇతర నేతలకు ఫోన్లు చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ వస్తున్నానని వెల్లడించారు. పార్టీ ఎమ్మెల్యేలూ కిందిస్థాయి నాయకులకు ఫోన్లు చేసి శుభాకాంక్షలు తెలపాలని, వారి యోగక్షేమాలు ఆరా తీయాలని సూచించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయని గుర్తుచేస్తూ... పార్టీ ఎమ్మెల్యేలు సహా ప్రజాప్రతినిధులందరి పనితీరుకు సంబంధించి రిపోర్టు కార్డు తన దగ్గర ఉందని, ఎవరు ఏ మేరకు పని చేస్తున్నారు.. ఎవరిని గుర్తించి ఏ బాధ్యతలు అప్పగించాలన్నది తనకు తెలుసునన్నారు. పని చేయని వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తన పనితీరుపైనా రిపోర్టు కార్డును తెప్పించుకున్నానని చెప్పారు. "నా గురించి మీరు అనుకుంటున్నట్లే మీ గురించీ కింది స్థాయి నేతలూ అనుకుంటారు అని గుర్తెరగాలి" అని వ్యాఖ్యానించారు. బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని పలువురు మంత్రులు, పార్టీ ప్రజా ప్రతినిధులు ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో రేవంత్ అరగంట పాటు సమావేశమయ్యారు. ఈ భేటీలో మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, పొన్నం, ఎంపీలు మల్లు రవి,

మిగతా 12వ పేజీలో...

చివరి త్రైమాసికంలో..

30 వేల కోట్ల అప్పు

జనవరి, ఫిబ్రవరి, మార్చిల్లో రూ.10 వేల కోట్ల చొప్పున..

ఎఫ్ఆర్‌బీఎం కింద సమీకరించే అవకాశం 12

ఇప్పటికే టీజీఐఐసీ నుంచి రూ.10 వేల కోట్లు జమ

వీటితో 'రైతు భరోసా', 'రైతు కూలీలకు భృతి' అమలు!



మేడ్చల్.. శామీర్‌పేటకు

మెట్రో!

పొడిగింపునకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్.. ఉత్తర ప్రాంతవాసులకు కొత్త సంవత్సర కానుక

- ప్యారడైజ్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్
- మూడు నెలల్లో డీపీఆర్.. హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డికి సీఎం రేవంత్ ఆదేశం
- ఫలించిన మేడ్చల్ మెట్రో సాధన సమితి పోరాటం.. ముఖ్యమంత్రి ప్రకటనపై హర్షం

హైదరాబాద్ సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర ఉత్తర ప్రాంత వాసులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నూతన సంవత్సర కానుక ఇచ్చారు. నార్త్‌సిటీకి త్వరలో మెట్రో రైలు సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు (23 కిలోమీటర్లు), జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు (22 కిలోమీటర్లు) మెట్రోరైలును పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో సమావేశమైన సీఎం.. ఈ మేరకు రెండు కారిడార్లకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఆయా కారిడార్లకు సంబంధించిన డీపీఆర్‌ను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే మెట్రో రెండో దశ విస్తరణకు నిర్ణయించిన ప్రభుత్వం.. పార్ట్-ఎ కింద ఆరు

మిగతా 13వ పేజీలో...

ఆర్ఆర్ఆర్‌పై డంబెల్స్ ఆకృతిలో..

చౌటుప్పల్, సంగారెడ్డి వద్ద 2 భారీ ఇంటర్‌చేంజీల నిర్మాణం

ఆర్ఆర్ఆర్‌పైకి ఇతర మార్గాల నుంచి రాకపోకలకు వీలుగా..

ఒక్కో డంబెల్ 37 హెక్టార్లలో..

హైదరాబాద్-మంచిర్యాలపై క్లోవర్ లీఫ్ ఇంటర్‌చేంజ్ 13



ఆయిల్‌పామ్.. ఆశాకిరణం!

రాష్ట్రంలో పంట సాగుకు రైతుల ఆసక్తి

విత్తనం నుంచి గెలల క్రషింగ్ దాకా కర్మాగారాలదే బాధ్యత

మొక్కలు, ఎరువులు, డ్రిప్ ఏర్పాటుకు ప్రభుత్వ రాయితీలు

సాగు విస్తీర్ణం 25 లక్షల ఎకరాలకు పెంచాలని లక్ష్యం

నూనెల దిగుమతిలో పామాయిల్‌కే సింహభాగం ఖర్చు

కొత్తగూడెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగు ఆశాకిరణంలా మారనుంది. ఆయిల్‌పామ్ సాగుకు రాష్ట్రంలోని వాతావరణం అనుకూలంగా ఉండడం, ప్రభుత్వ ప్రోత్సాహకాల నేపథ్యంలో ఈ పంట వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం దేశంలో వినియోగమయ్యే నూనెల్లో అత్యధిక శాతం విదేశాల నుంచి దిగుమతి అవుతున్నవే ఉన్నాయి. దీంతో ఏటా రూ.80 వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని కేంద్ర ప్రభుత్వం వెచ్చించాల్సి వస్తోంది. దిగుమతి అవుతున్న నూనెల్లో పామాయిల్ కోసమే రూ.11 వేల కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ క్రమంలో నూనె ఉత్పత్తుల్లో లోటును పూడ్చాలంటే ఆయిల్‌పామ్ ద్వారానే అవకాశం

మిగతా 3వ పేజీలో...



ఆయిల్‌పామ్ గెలల ధర పెంపుపై

తుమ్మల హర్షం

రూ.20,506కు టన్ను ధర 3

ఎయిర్ ఇండియా విమానాల్లో

వైఫై సేవలు

దేశీయ సర్వీసుల్లో తొలిసారి

ఇప్పటికే విదేశీ సర్వీసుల్లో..

10 వేల అడుగుల ఎత్తులో ఇంటర్నెట్ కనెక్టివిటీ 2

మాజీ బ్యాంక్ మేనేజర్ ఉరఫ్

లేడీ రౌడీ షీటర్



ప్రభావతి

ఏపీలో హడలెత్తిస్తున్న ప్రభావతి క్రైమ్ హిస్టరీ

బ్యాంకులో పనిచేస్తుండగా బంగారం చోరీ

దీంతో ఉద్యోగం నుంచి ఉద్వాసన


స్వగ్రామం చేరుకుని అరాచకాలు

రౌడీషీట్ తెరిచిన పోలీసులు

తాజాగా జనసేన నేతపై దాడి 14

కుటుంబంతో కలిసి కొట్టిన ప్రభావతి

స్పృహ తప్పిన నేత.. ఆస్పత్రిలో చికిత్స



సినిమా రంగంలో భవిష్యత్తు

అమరావతిదే!

తొలి రోజుల్లో టాలీవుడ్‌కు బెజవాడే కేంద్రంగా ఉండేది 3

ఏపీ సీఎం చంద్రబాబునాయుడు

బాలికల గురుకులాలను మహిళా ఐఏఎస్‌లు

సందర్శించాలి

ఇతర గురుకులాలు, కేజీబీవీలు, హాస్టళ్ల పర్యవేక్షణ అదనపు కలెక్టర్లకు

అక్కడ ఒక రోజైనా బస చేయాలి

పరిశీలించిన అంశాలపై నివేదికలను సమర్పించాలి: ప్రభుత్వ ఉత్తర్వులు 10

రైతులకు కేంద్రం శుభవార్త

పంటల బీమా పథకాలకు కేటాయింపుల పెంపు

పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐ పథకాల కొనసాగింపు

కేంద్ర క్యాబినెట్ ఆమోదం

డీఏపీపై వన్‌టైమ్ స్పెషల్ ప్యాకేజీ పొడిగింపునకు ఓకే

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మోదీ



2



అమెరికాలో 'ఓపీటీ' మంటలు!

ప్రోగ్రాం దుర్వినియోగం అవుతోంది

హెచ్-1బీ వీసాకు సాధనంగా మారింది

స్థానిక యువత ఉద్యోగాలకు దూరం

'మాగా' నేటివిస్టుల ఆరోపణలు

ఓపీటీని రద్దు చేయాలని డిమాండ్

భారతీయ విద్యార్థుల భవితకు ముప్పు



లక్నవరం చెరువులోని రిసార్టు



బ్లాక్‌బెర్రీ ఐలాండ్‌లోని ఓపెన్ రెస్టారెంట్

ములుగు.. పర్యాటక వెలుగు

పర్యాటక స్థలంగా లక్నవరం చెరువులో 12 ఎకరాల దీవి అభివృద్ధి

స్విమ్మింగ్ పూల్స్, వాటర్ గేమ్స్, బోటింగ్

కొద్ది దూరంలో జలగలంచ వద్ద గోవా తీరంలో మాదిరిగా బ్లాక్‌బెర్రీ ఐలాండ్

ఇసుక తిన్నెల్లో 50కిపైగా గుడారాలు, హోటళ్లు

బొగత జలపాతం, మేడారం, మల్లూరు, రామప్ప ప్రాంత అభివృద్ధికి కూడా ప్రణాళిక

ములుగు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఏడాదికోసారైనా అలా ఓ హాలిడే ట్రిప్ వేసి ప్రకృతి ఒడిలో సేదతీరాలని ఎవరికి మాత్రం ఉండదు? దీనికి ఏ విదేశానికో.. బయట రాష్ట్రానికో వెళ్లనవసరం లేకుండా మన తెలంగాణలోనే గొప్ప పర్యాటక అనుభూతి పొందేందుకు గొప్ప అవకాశం! అదే ములుగు అభయారణ్యం! ములుగు జిల్లాలోని గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లోని లక్నవరం చెరువులోని మూడు దీవుల్లో ఒక దీవిని రాష్ట్ర పర్యాటక శాఖ ఓ ప్రైవేటు కంపెనీతో కలిసి అభివృద్ధి చేసింది. దీనికి మూడో దీవి (థర్డ్ ఐలాండ్) అని పేరు. ఈ దీవిని ఐదేళ్ల లీజుకు తీసుకున్న కంపెనీ అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దింది. లేక్‌వ్యూ కాటేజీలు, స్విమ్మింగ్ పూల్స్, వాటర్ గేమ్స్, తీరొక్క బోట్లలో రైడింగ్, కోరుకున్న వంటకాలు, డ్రింక్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. సముద్ర తీర పర్యాటక ప్రాంతాల మాదిరిగానే గొప్ప పర్యాటక స్థలిగా ఈ దీవిని తీర్చిదిద్దారు. లక్షలు వెచ్చించి ఎక్కడికో వెళ్లే బదులు సమీపంలో ఉన్న లక్నవరం వచ్చేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు ఆసక్తి

మిగతా 3వ పేజీలో...

ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ డైరెక్టర్‌గా డాక్టర్ భారతీ కులకర్ణి



హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): భారత వైద్య పరిశోధన మండలి-జాతీయ న్యూట్రిషన్ సంస్థ (ఐసీఎంఆర్-ఎన్ఐఎన్) నూతన డైరెక్టర్‌గా డాక్టర్ భారతీ కులకర్ణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఐసీఎంఆర్-ఎన్ఐఎన్‌లో 20 ఏళ్లపాటు శాస్త్రవేత్తగా పని చేసిన భారతీ కులకర్ణి.. గడచిన మూడేళ్లుగా న్యూఢిల్లీలోని ఐసీఎంఆర్‌లో రీప్రొడక్టివ్, చైల్డ్ హెల్త్-న్యూట్రిషన్ విభాగం అధిపతిగా వ్యవహరిస్తున్నారు. పుణె యూనివర్సిటీలో పీడియాట్రిక్స్ విద్యనభ్యసించిన భారతి.. అమెరికాలోని జాన్ హాప్కిన్స్ బ్లూమ్‌బర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌లో మాస్టర్స్ చేశారు. దీంతోపాటు ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. కాగా, డాక్టర్ భారతి పరిశోధనలు ఎక్కువగా ప్రసూతి, శిశు పోషణ, రక్తహీనత, బాల్యంలో పోషకాహార లోపం, వ్యవసాయం-పోషకాహార సంబంధం తదితర అంశాలపై జరిగాయి. దేశంలో పోషకాహార విధానాలు, కార్యక్రమాల రూపకల్పనలో ఆమె పరిశోధనలు విశేషంగా తోడ్పడ్డాయి. అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రభావవంతమైన పలు జర్నల్స్‌లో డాక్టర్ భారతి 130కి పైగా పరిశోధనా పత్రాలను రాయడంతోపాటు విధాన నిర్ణయ పత్రాల రూపకల్పనలోనూ కీలక పాత్ర పోషించారు. తాను చేసిన సేవలకుగాను పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి పరిశోధన గ్రాంట్లు పొందారు. కాగా, కొత్త సంవత్సరం తనకు కొత్త బాధ్యతలను కూడా వెంటబెట్టుకొని వచ్చిందని, దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన సంస్థకు సారథ్యం వహించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని డాక్టర్ భారతి తన లింక్డిన్ ఖాతాలో పేర్కొన్నారు.

అనంత్ 'టైమ్' చాలా కాస్ట్‌లీ బ్రో!

» అంబానీ రిస్ట్ వాచ్ ఖరీదు 22 కోట్లు



ఇదిగో ఈ ఫొటోలో కనిపిస్తున్న చేతి గడియారాన్ని చూశారా..!! చూడటానికి ఐసు ముక్కలా భలే ఉంది కదా.. మనం కూడా ఒకటి కొనేసుకుందాం అని అనుకుంటుంటే మాత్రం కాస్త ఆగండి. ఎందుకంటే దాని ధర ఎంతో తెలిస్తే మీ గుండెల్లో నిజంగానే ఐసు ముక్క పడుద్ది. అనంత్ అంబానీ ధరించిన ఈ చేతి గడియారం ఖరీదు రూ.22 కోట్ల పైమాటే. రిచర్డ్ మిల్లే కంపెనీకి చెందిన అత్యంత అరుదైన ఈ చేతి గడియారాలు ప్రపంచంలో మూడంటే మూడే ఉన్నాయి. ప్రపంచంలోని అత్యంత ధనవంతుల్లో ఒకరైన ముఖేశ్ అంబానీ కుమారుడైన అనంత్ దగ్గర వాటిల్లో ఒకటి ఉంది. ఇటీవల ఓ కార్యక్రమంలో అనంత్ ఈ గడియారంతో కనిపించాడు. ఓ ఇన్‌స్టాగ్రామ్ పేజీ ఈ చేతి గడియారం వివరాలను పోస్ట్ చేయగా... అనంత్ టైమ్ కూడా చాలా కాస్ట్‌లీ బ్రో అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇదే కాదు.. రూ.కోట్ల విలువ చేసే వేర్వేరు కంపెనీలకు చెందిన మరికొన్ని చేతి గడియారాలు కూడా అనంత్ అంబానీ వద్ద ఉన్నాయి.

లోకం తీరు



హమాస్‌పై ఇజ్రాయెల్ లక్షిత దాడులు

» ఇద్దరు కీలక కమాండర్లు, 14మంది ఫైటర్లు మృతి

టెల్‌అవీవ్, జనవరి 1: గాజాపై ఇజ్రాయెల్ లక్షిత దాడులు ఉధృతమవ్వడంతో.. హమాస్‌కు భారీ దెబ్బ తగిలింది. మంగళవారం దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో జరిపిన ఆపరేషన్‌లో హమాస్ నుఖ్బా ప్లటూన్ కమాండర్ అబేద్ అల్-హాదీ సభా, ఉత్తర గాజాపై నిర్వహించిన దాడుల్లో మరో కమాండర్ మహమ్మద్ సాదీ మాస్రీ మృతిచెందినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) బుధవారం ఎక్స్‌లో వెల్లడించింది. వీరిద్దరూ అక్టోబరు 7 నాటి దాడుల్లో పాల్గొన్నట్లు తెలిపింది. అటు సెంట్రల్ గాజాలో నిర్వహించిన ఆపరేషన్‌లో 14 మంది హమాస్ ఫైటర్లు హతమయ్యారని, వీరిలో ఆరుగురు అక్టోబరు 7 దాడుల్లో పాల్గొన్నట్లు వెల్లడించింది.

1901 తర్వాత అత్యధిక వేడి సంవత్సరం 2024!

న్యూఢిల్లీ, జనవరి 1 : దేశంలో 1901 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 2024 సంవత్సరంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఈమేరకు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) వెల్లడించింది. 1901 నుంచి నమోదైన సగటు కనిష్ఠ ఉష్ణోగ్రతలకంటే 2024లో 0.90 డిగ్రీలు అధికంగా నమోదైనట్లు ప్రకటించింది. అలాగే దేశ వ్యాప్తంగా ఉపరితల గాలి సగటు వార్షిక ఉష్ణోగ్రత కూడా దీర్ఘకాలిక(1991-2020 మధ్య) సగటు కంటే 0.65 డిగ్రీలు అధికంగా నమోదైందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర చెప్పారు. మరోవైపు దేశంలో ఈ జనవరి నెలలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంకంటే అధికంగా ఉంటాయని ఐఎండీ వెల్లడించింది.

శబరిమలలో స్పెషల్ పాస్‌ల రద్దు!

శబరిమల, జనవరి 1: ఎరుమేళి నుంచి అటవీ మార్గంలో అలుదానది, కరిమల కొండ మీదుగా(పెద్దపాదం) శబరిమలకు వచ్చే భక్తులకు ఇస్తున్న స్పెషల్ పాస్‌లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) ప్రకటించింది. గత నెల 30 నుంచి ప్రారంభమైన మకరవిళక్కు సీజన్‌కు అంచనాలకు మించి, ఐదు రెట్లు అధికంగా స్వాములు వస్తున్నారని, దీంతో.. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పాసుల జారీని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

వాళ్లు ఉమ్ములేస్తారు.. మూత్రం పోస్తారు!

» అందుకే హిందూయేతరులకు షాపులు వద్దు

» మహాకుంభమేళాలో దుకాణాల కేటాయింపుపై అఖాడా పరిషత్ చీఫ్ రవీంద్ర వ్యాఖ్యలు

ప్రయాగ్‌రాజ్, జనవరి 1: ఉత్తరప్రదేశ్‌లో ఈ నెల 13 నుంచి ప్రారంభంకానున్న మహాకుంభమేళాలో హిందూయేతరులకు దుకాణాలు కేటాయించవద్దని అఖిల భారతీయ అఖాడా పరిషత్ చీఫ్ మహంత్ రవీంద్ర పురీ డిమాండ్ చేశారు. ఈ మహాక్రతువును పవిత్రంగా, పరిశుభ్రంగా నిర్వహించాలంటే వారికి దుకాణాలు కేటాయించకూడదని ఆయన పట్టుబట్టారు. "వాళ్లు ఎక్కడబడితే అక్కడ ఉమ్ములేస్తారు.. మూత్రం పోస్తారు. పవిత్ర మహాకుంభమేళా అపవిత్రం అయిపోతుంది. అందుకే అలాంటి వారికి దుకాణాలు కేటాయించరాదని మా నాగా సాధువుల తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం" అని రవీంద్ర పురీ వ్యాఖ్యానించారు.

సైబర్ నేరాలకు వేదికగా వాట్సాప్: కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 1: సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు సైబర్ నేరాలకు వేదికలుగా మారాయి. వాట్సాప్ కేంద్రంగా సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్ తర్వాత స్థానంలో టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ ఉన్నాయి. 2023-24 సంవత్సరంలో నమోదైన సైబర్ నేరాల జాబితాను కేంద్ర హోంశాఖ తాజాగా విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం.. గతేడాది మొదటి మూడు నెలల్లో వాట్సాప్ ద్వారా జరిగిన సైబర్ మోసాలపై 43,937 ఫిర్యాదులు రాగా, టెలిగ్రామ్‌లో మోసాలపై 22,680, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా జరుగుతున్న నేరాలపై 19,800 చొప్పున నమోదయ్యాయి. ఈ నేరాలకు పాల్పడేందుకు సైబర్ మోసగాళ్లు గూగుల్ సేవల ప్లాట్‌ఫాంలను ఉపయోగిస్తున్నారు.

ఎడారిలో భారీ సోలార్ వాల్

» మరో అద్భుతాన్ని సృష్టిస్తున్న చైనా

» 400 కి.మీ. పొడవు, 5 కి.మీ వెడల్పుతో ప్లాంట్

బీజింగ్, జనవరి 1: ఇసుక నుంచి కూడా తైలం పిండగల నేర్పు తనకుందని చైనా మరోసారి నిరూపిస్తోంది. ఇప్పటికే 21,196 కిలో మీటర్ల గ్రేట్ వాల్‌తో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న చైనా.. తమ దేశంలోని వాయవ్య ప్రాంతంలో ఉన్న కుబుఖీ ఎడారిలో ఇంకో గ్రేట్ వాల్‌ను నిర్మిస్తూ ఇప్పుడు మరో అద్భుతాన్ని సృష్టిస్తోంది. ఈ కొత్త గోడ సాధారణ ఇటుకలతో నిర్మించేది కాదు. కోట్ల కొద్దీ సౌర పలకలతో నిర్మించే సోలార్ విద్యుత్ ప్లాంట్. 2030 కల్లా పూర్తవుతుందని భావిస్తున్న ఈ ప్లాంట్ పొడవు 400 కిలోమీటర్లు, వెడల్పు 5 కిలోమీటర్లు. దలాద్ బానెర్ ప్రాంతంలోని ఎడారిలో నిర్మించే ఈ సౌర విద్యుత్ గోడతో మొత్తం 100 గిగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనేది చైనా లక్ష్యం. ఇప్పటి వరకు 5.42 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యే సౌర పలకలను అక్కడ అమర్చినట్లు డ్రాగన్ దేశం అధికారిక పత్రిక చైనా డైలీ వెల్లడించింది. ఇది పూర్తయితే ప్రపంచంలోనే అతి పెద్ద సోలార్ ప్లాంట్ అవుతుంది.

వాహనంతో జనం పైకి దూసుకెళ్లి.. ఆపై కాల్పులు

» 10 మంది మృతి.. 30 మందికి గాయాలు

లూసియానా, జనవరి 1: అమెరికాలో నూతన సంవత్సర వేడుకల వేళ ఓ దుండగుడు బీభత్సం సృష్టించాడు. ఓ బార్ వెలుపల జనం గుమిగూడి ఉండగా.. వాహనంతో వారిపైకి దూసుకెళ్లి ఆపై కాల్పులు జరిపాడు. దీంతో 10 మంది మృతి చెందగా.. 30 మంది వరకు గాయపడ్డారు. లూసియానా రాష్ట్రం న్యూ ఆర్లీన్స్‌లోని ఫ్రెంచ్ క్వార్టర్ బోర్బన్ స్ట్రీట్‌లో బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. కొత్త సంవత్సర వేడుకలు కాసేపట్లో ముగుస్తాయనగా.. ఓ బార్ వెలుపల జనాలు గుమిగూడారు. ఓ ఆగంతకుడు ఎస్‌యూవీ పికప్ ట్రక్కుతో వారిపైకి దూసుకెళ్లాడు. అనంతరం తుపాకీ తీసి కాల్పులకు తెగబడ్డాడు. అప్రమత్తమైన అక్కడి పోలీసులు దుండగుడిపై కాల్పులు జరిపి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అప్పటికే పలువురు మృతి చెందగా.. దాదాపు 30 మందికి గాయాలయ్యాయి. 'ఇది తీవ్రవాద దాడి కాదని భావిస్తున్నాం. ఘటనా స్థలంలో పేలుడు పదార్థాలు లభించాయి. వాటిని పరిశీలించాల్సి ఉంది' అని ఎఫ్‌బీఐ వెల్లడించింది.

పీఎం కిసాన్ పెంపుపై బడ్జెట్ నాటికి స్పష్టత

న్యూఢిల్లీ, జనవరి 1: కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' కింద రైతులకు ఇస్తున్న పెట్టుబడి సాయం పెంపుపై బడ్జెట్ నాటికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం రూ.6 వేలుగా ఉన్న ఈ సాయాన్ని రూ.10 వేలకు పెంచాలనే డిమాండ్ అధికార పార్టీ నేతల నుంచి సైతం చాలాకాలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో.. పీఎం కిసాన్ కింద ఇచ్చే మొత్తాన్ని రూ.10వేలకు పెంచుతున్నట్టు మంగళవారం ప్రసారమాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. కానీ.. కేంద్రం దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని, ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే బడ్జెట్‌నాటికి ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

రైతులకు కేంద్రం శుభవార్త

పంటల బీమా పథకాలకు కేటాయింపుల పెంపు.. పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐ పథకాల కొనసాగింపు

» కేంద్ర క్యాబినెట్ ఆమోదం

» డీఏపీపై వన్‌టైమ్ స్పెషల్ ప్యాకేజీ పొడిగింపునకు ఓకే

» కొత్త ఏడాది మా తొలి భేటీ రైతు శ్రేయస్సుకు అంకితం: మోదీ



న్యూఢిల్లీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదిలో రైతులకు కేంద్రప్రభుత్వం శుభవార్త తెలిపింది. పంటల బీమా పథకాలైన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై), పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా(ఆర్‌డబ్ల్యూబీసీఐ) పథకాలను 2025-26 వరకూ కొనసాగించడంతో పాటు వాటి కేటాయింపులను పెంచాలని నిర్ణయించింది. ఈ రెండు పథకాలనూ కొనసాగించే ప్రతిపాదనకు బుధవారం ప్రధాని మోదీ నేతృత్వంలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఈ పథకాలకు 2020-21 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు రూ.66,550 కోట్లు కేటాయించగా.. దాన్ని 2021-22 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరాలకుగాను రూ.69,515.71 కోట్లకు పెంచింది. కేంద్రం నిర్ణయంతో 2026 వరకూ రైతులకు మేలు జరగనుంది. అలాగే, బీమా పథకాల అమలులో భారీ మొత్తంలో సాంకేతికతను వినియోగించేందుకు రూ.824.77 కోట్లతో ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ(ఫియట్) ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ టెక్నాలజీ పంట నష్టం అంచనాలను త్వరితగతిన తెలుసుకోవడంతో పాటు, క్లెయిం సెటిల్‌మెంట్, వివాదాలను తగ్గించేందుకు దోహదపడనుంది. అలాగే.. రైతులకు డై అమ్మోనియం ఫాస్ఫేట్(డీఏపీ)పై సబ్సిడీకి అదనంగా ఇస్తున్న వన్ టైం స్పెషల్ ప్యాకేజీని పొడిగించాలని కూడా కేంద్రం నిర్ణయించింది. డీఏపీ మెట్రిక్ టన్నుకు స్పెషల్ ప్యాకేజీ కింద రూ.3,500 ఇవ్వాలని.. దీన్ని జనవరి ఒకటో తేదీ నుంచి తదుపరి ఉత్తర్వుల వరకూ పొడిగించాలని కేంద్ర ఎరువుల శాఖ చేసిన ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది. రైతులకు డీఏపీని నిరంతరం తక్కువ ధరలో అందుబాటులో ఉంచడానికి మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు 31 వరకు వర్తించేలా.. డీఏపీపై సబ్సిడీకి అదనంగా రూ.2,625 కోట్లతో వన్ టైం స్పెషల్ ప్యాకేజీకి క్యాబినెట్ గత జూలైలో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. కేంద్రం తాజా నిర్ణయంతో 50 కిలోల డీఏపీ బస్తా రూ.1,350కి రైతులకు అందుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ ప్యాకేజీకి రూ.3,850 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: మోదీ

రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. దేశానికి అన్నం పెట్టేందుకు కష్టపడి పనిచేస్తున్న రైతులను చూసి గర్విస్తున్నట్లు తెలిపారు. 2025లో జరిగిన మొదటి క్యాబినెట్ భేటీని రైతుల శ్రేయస్సు కోసం అంకితం చేసినట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ఈ భేటీలో కీలకనిర్ణయాలు తీసుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

2025.. సంస్కరణల సంవత్సరం: రక్షణ శాఖ

నేవీ అమ్ములపొదిలోకి జనవరి 15న రెండు యుద్ధ నౌకలు, ఒక జలాంతర్గామి

న్యూఢిల్లీ, జనవరి 1: రక్షణ శాఖ 2025ను 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించింది. మన సాయుధ దళాలను 'సాంకేతికంగా అభివృద్ధి చెందిన పోరాట సన్నద్ధ శక్తి'గా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. నూతన సంవత్సరం సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం ఆ శాఖ కార్యదర్శులతో సమావేశమై.. పలు పథకాలు, ప్రాజెక్టులు, చేపట్టాల్సిన సంస్కరణలపై సమీక్ష జరిపారు. ప్రస్తుతం అమలవుతున్న, భవిష్యత్తులో అమలు చేయతలపెట్టిన సంస్కరణలకు మరింత ఊతమిచ్చేలా.. 2025ను 'సంస్కరణల సంవత్సరం'గా పాటించాలని ఈ భేటీలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని పెంచడానికి సమీకృత థియేటర్ కమాండ్ల ఏర్పాటుకు నిశ్చయించారు. సాయుధ దళాలకు అవసరమైన ఉత్పత్తుల సేకరణను సులభతరం చేయాలని.. కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్ వంటి అత్యంత అధునాతన టెక్నాలజీలపై దృష్టి సారించాలని నిర్ణయించారు. కాగా.. దేశీయంగా నిర్మించిన రెండు యుద్ధ నౌకలు (ఒకటి గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ సూరత్, రెండోది స్టెల్త్ ఫ్రిగేట్ నీలగిరి), ఒక జలాంతర్గామి (వాఘ్‌షీర్) జనవరి 15న మన నౌకాదళ అమ్ములపొది లోకి చేరనున్నాయి.

ఎయిర్ ఇండియా విమానాల్లో వైఫై సేవలు

దేశీయ సర్వీసుల్లో తొలిసారి ఈ సేవలు



న్యూఢిల్లీ, జనవరి1: దేశంలోనే తొలిసారిగా ఎయిర్ ఇండియా తమ విమాన సర్వీసుల్లో వైఫై సేవలు ప్రారంభించింది. దేశీయంగా ఈ సేవలు ప్రస్తుతానికి ఉచితంగా అందిస్తున్నట్లు ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఎయిర్ ఇండియా ఎయిర్ బస్ ఏ-350, బోయింగ్ 787-9, ఎయిర్ బస్ ఏ321 నియో ఎయిర్ క్రాఫ్టులలో ఈ సేవలు ప్రారంభమయ్యాయి. విమానం పదివేల అడుగులకు చేరాక ప్రయాణికులకు వైఫై సేవలు అందుతాయి. ల్యాప్‌టాప్, టాబ్లెట్, ఐఓఎస్, ఆండ్రాయిడ్ వ్యవస్థలున్న స్మార్ట్ ఫోన్‌లకు వైఫై కనెక్టివిటీ ఉంటుంది. ఇంటర్‌నెట్ అందుబాటులోకి రావడంతో ఇక విమాన ప్రయాణ సమయాల్లోనూ స్నేహితులకు, బంధువులకు ఎప్పటికప్పుడు సందేశాలు పంపవచ్చు. సోషల్ మీడియాలో వెంటనే అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఎయిర్ ఇండియా ఇప్పటికే సింగపూర్, లండన్, పారిస్, న్యూయార్క్‌కు నడిపే అంతర్జాతీయ సర్వీసుల్లో వైఫై సేవలు అందిస్తోంది. ఎయిర్‌బస్ ఏ 350, ఎయిర్‌బస్ ఏ321 నియో, బోయింగ్ బీ787-9 ఎయిర్‌క్రాఫ్టులలో ఈ సేవలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి.



అమెరికాలో 'ఓపీటీ' మంటలు!

» ప్రోగ్రాం దుర్వినియోగం అవుతోంది

» హెచ్-1బీ వీసాకు సాధనంగా మారింది

» స్థానిక యువత ఉద్యోగాలకు దూరం

» 'మాగా' నేటివిస్టుల ఆరోపణలు

» ఓపీటీని రద్దు చేయాలని డిమాండ్

» భారతీయ విద్యార్థుల భవితకు ముప్పు

వాషింగ్టన్, జనవరి 1: అమెరికాలో పని అనుభవాన్ని పొందడానికి విదేశీ విద్యార్థులను అనుమతించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రాంపై వ్యతిరేకత క్రమంగా పెరుగుతోంది. ఈ కార్యక్రమంపై మాగా (మేక్ అమెరికా గ్రేట్ అగైన్) నేటివిస్టులు తీవ్ర నిరసన తెలుపుతున్నారు. ఓపీటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రభావం భారతీయ విద్యార్థులపై ఎక్కువగా పడనుంది. అధికారంలోకి వస్తే హెచ్-1బీ వీసాల జారీ విధానాన్ని సంస్కరిస్తామని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మాగా నేటివిస్టులు ఓపీటీపై దృష్టి సారించారు. ఎఫ్-1 వీసాలపై ఉన్న విదేశీ విద్యార్థులు సాధారణంగా వారి మొదటి విద్యా సంవత్సరం తర్వాత ఓపీటీలో పాల్గొనవచ్చు. స్టెమ్ (ఎస్‌టీఈఎం) గ్రాడ్యుయేట్లు మూడేళ్ల వరకూ అమెరికాలో ఉండి పని అనుభవం పొందే అవకాశం ఉంది. తొలుత స్వల్పకాలిక వర్క్ పర్మిట్ కోసం ఉద్దేశించిన ఈ ఓపీటీ ఇప్పుడు పూర్తిగా దుర్వినియోగమవుతోందని, అమెరికాలో ఉద్యోగంతో పాటు హెచ్-1బీ వీసా పొందడానికి ఒక సాధనంగా మారిపోయిందని మాగా నేటివిస్టులు ఆరోపిస్తున్నారు. పని అనుభవం కోసం ఓపీటీలో చేరడానికి చాలా మంది విదేశీ విద్యార్థులు ప్రత్యేకించి భారత్ నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు అమెరికాలో చదవడానికి వస్తుంటారు. ఈ ప్రోగ్రాం వ్యవధి ముగిసేలోగా హెచ్-1బీ వీసాలకు మారడం ద్వారా అమెరికాలో తొమ్మిదేళ్ల వరకూ నివసించే అవకాశం పొందుతారు. వీరిలో కొందరు గ్రీన్ కార్డులు పొంది చివరకు అమెరికా పౌరులుగా మారుతున్నారు. కాంగ్రెషనల్ రిసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) నివేదిక ప్రకారం 2023 కేలండర్ సంవత్సరంలో అమెరికాలో 14,90,000 మంది ఎఫ్-1, ఎం-1 వీసాలు కలిగిన విద్యార్థులు, గ్రాడ్యుయేట్లు ఉన్నారు. వీరిలో 3,44,686 (23% మంది) ఓపీటీద్వారా పనిచేయడానికి అనుమతి పొందారు. ఈ కారణంగా అమెరికన్ గ్రాడ్యుయేట్లు ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని మాగా నేటివిస్టులు మండిపడుతున్నారు. అయితే ఓపీటీని రద్దు చేస్తే గ్రాడ్యుయేషన్ తర్వాత విదేశీ విద్యార్థులు పని అనుభవం పొందకుండానే దేశాన్ని విడిచి వెళ్లాల్సి వస్తుందని, దీనివల్ల అమెరికాకు వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

తల్లిని, నలుగురు చెల్లెళ్లను చంపేశాడు!

గొంతు, మణికట్టు కోసి దారుణ హత్యలు.. లఖ్‌నవూలోని ఓ హోటల్‌లో ఘటన

లఖ్‌నవూ, జనవరి 1: తల్లిని, నలుగురు చెల్లెళ్లను గొంతు, మణికట్టు కోసి దారుణంగా చంపాడు ఓ ఉన్మాది. ఇదంతా వారిని 'రక్షించేందుకే!' నంటూ ఓ వీడియో కూడా విడుదల చేశాడు. తమ ఇరుగుపొరుగువారు తమ ఇంటిని, స్థలాన్ని ఆక్రమించుకున్నారని, తన చెల్లెళ్ల నలుగురినీ హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి అమ్మేద్దామని చూస్తున్నారని.. దీనిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, అందుకే ఈ హత్యలు చేశానని ఆ వీడియోలో సమర్థించుకున్నాడు. దిగ్భ్రాంతికరమైన ఈ దారుణం ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూలో బుధవారం వెలుగులోకి వచ్చింది. నిందితుడు 24 ఏళ్ల మహమ్మద్ అర్షద్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. జరిగిన ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు. అర్షద్ కుటుంబం యూపీలోని ఆగ్రాలో నివసిస్తోంది. తల్లి అస్మా. నలుగురు చెల్లెళ్లు అల్షియా (19), రహ్మీన్ (18), అక్సా (16), ఆలియా (9). వీరి తండ్రికి సంబంధించిన వివరాలు వెల్లడికాలేదు. ఇటీవల వీరందరూ అజ్మీర్‌కు వెళ్లారు. అక్కడి నుంచి సోమవారం లక్నో చేరుకొని స్థానికంగా ఉన్న షరన్‌జీత్ అనే హోటల్‌లో దిగారు. మంగళవారం రాత్రి అర్షద్ విషం కలిపిన ఆహారం తీసుకొచ్చి తల్లి, చెల్లెళ్లకు అందజేశాడు. వారు అది తిన్న తర్వాత ఒక్కొక్కరిని చంపాడు. కొందరిని చున్నీతో గొంతు నులిమి చంపగా, మరికొందరిని మణికట్టు వద్ద బ్లేడుతో కోసి చంపాడు. చంపేటప్పుడు అరవకుండా నోట్లో గుడ్డలు పెట్టి అదిమాడు. ఈ దారుణ హత్యల అనంతరం తండ్రిని రైల్వేస్టేషన్ వద్దకు తీసుకెళ్లి అక్కడ వదిలేశాడు. తాను పోలీసుల వద్దకు వెళ్లి చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. దీంతో ఈ దారుణం బయటపడింది.

మిస్టరీగా మారిన వీడియో!

తల్లి, చెల్లెళ్లను చంపిన అనంతరం అర్షద్.. హోటల్ గదిలోనే ఓ వీడియో చేసి సోషల్ మీడియాలో విడుదల చేశాడు. వైరల్‌గా మారిన ఆ వీడియోలో.. తమ కుటుంబానికి కొందరు అన్యాయం చేశారని తెలిపాడు. ఆగ్రాలో తాము నివసించే ఇంటిని ఇరుగుపొరుగువాళ్లు బలవంతంగా లాగేసుకున్నారని, పదిరోజులుగా తమ కుటుంబం మొత్తం చలిలో ఫుట్‌పాత్‌పైనే తలదాచుకుంటుందని పేర్కొన్నాడు. రాణు అలియాస్ అఫ్తాబ్, అలీమ్‌ఖాన్, సలీం, అహ్మద్ రాణు, ఆరిఫ్, అజహర్ అనే వ్యక్తులు తమకు అన్యాయం చేశారని, వీరందరూ కలిసి ఓ భూఆక్రమణ మాఫియాను నడుపుతున్నారని, అమ్మాయిల అక్రమ రవాణాకు కూడా వీరు పాల్పడుతుంటారని ఆరోపించాడు. 'అమ్మాయిలను సరఫరా చేసే హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి నా నలుగురు చెల్లెళ్లను అమ్మేద్దామని వీరు కుట్రపన్నారు. నా మీద తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపాలని చూశారు. మా స్వస్థలం యూపీలోని బదౌన్. మమ్మల్ని బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వ్యక్తులుగా ముద్ర వేసి దుష్ప్రచారం చేశారు. వీరి ఆగడాలు భరించలేక మేం హిందూమతంలోకి మారాలనుకున్నాం. మా ఇల్లును ఆక్రమించుకున్నారు. మిగిలిన స్థలంలో ఒక ఆలయాన్ని కట్టి ప్రశాంతంగా బతకాలనుకున్నాం. పూజలు కూడా చేయటం ప్రారంభించాం' అని అర్షద్ వెల్లడించాడు. తమ మీద జరుగుతున్న వేధింపులపైన ఎంతమందికి చెప్పినా కూడా తమకు సహాయం లభించలేదన్నాడు. తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి మరో దారి లేక తాము అందరమూ చనిపోవాలని నిర్ణయించుకున్నామని, తన కుటుంబసభ్యులను మణికట్టు, గొంతు కోసి తానే చంపానని, తాను కూడా ఇంకొద్దిసేపట్లో చనిపోతానని తెలిపాడు. రాత్రి 2 గంటలకు ఈ వీడియో చేస్తున్నానంటూ, దుప్పట్లతో కప్పి ఉన్న తన వారి మృతదేహాలను కూడా ఈ వీడియోలో అర్షద్ రికార్డు చేశాడు. వీడియో చివరలో ప్రధాని మోదీకి, యూపీ సీఎం యోగికి ఓ విజ్ఞప్తి చేశాడు. 'దేశంలోని ముస్లింలందరూ ఒకే రకమైన వాళ్లు కాదు. మేం చనిపోయిన తర్వాతనైనా మాకు న్యాయం చేయండి. యోగీ జీ మీరు గొప్పగా పని చేస్తున్నారు. ఇటువంటి ముస్లింలను వదిలిపెట్టొద్దు. వారు భూఆక్రమణ, నకిలీ కరెన్సీ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు' అని అర్షద్ పేర్కొన్నాడు. ఆక్రమణకు గురైన తమ ఇంటిని ఆలయంగా మార్చాలని, తమకు సంబంధించిన వాటిని, తన చెల్లెళ్లు సేకరించుకున్న వస్తువులను అనాథ శరణాలయానికి అందజేయాలని కోరాడు.

ఎంపీ తేజస్వి సూర్య పెళ్లికొడుకాయెనె..

గాయని, నాట్య కళాకారిణి శివశ్రీ స్కందప్రసాద్‌తో మార్చిలో వివాహం





బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బెంగళూరు దక్షిణ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య ఓ ఇంటివాడు అవుతున్నారు. చెన్నైకి చెందిన గాయని, భరతనాట్య కళాకారిణి శివశ్రీ స్కంద ప్రసాద్‌ను ఆయన పెళ్లి చేసుకోనున్నారు. రెండోసారి ఎంపీగా, భారతీయ జనతా యువమోర్చా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్న తేజస్వి సూర్య వివాహం గురించి ఆరేడేళ్లుగా పలు సభలు, సమావేశాలలో ప్రస్తావనలు వచ్చాయి. ఆయన సున్నితంగా దాటవేస్తూ వచ్చారు. తాజాగా ఆయన వివాహం గురించి రెండు కుటుంబాలవారు నిర్ణయానికి వచ్చారని తెలిసింది. 29 ఏళ్ల శివశ్రీ శస్త్ర యూనివర్సిటీలో బయో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. మద్రాస్ యూనివర్సిటీలో భరతనాట్యంలో ఎంఏ, మద్రాస్ సంస్కృత యూనివర్సిటీలో సంస్కృతంలో ఎంఏ పూర్తి చేశారు. సైక్లింగ్, ట్రెక్కింగ్ అంటేనూ ఆమె ఆసక్తి చూపుతారు. ఆమె యూట్యూబ్ చానెల్‌కు రెండు లక్షలమంది ఫాలోయెర్స్, సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. గత ఏడాది శ్రీరామనవమి సందర్భంగా శివశ్రీ కన్నడలో 'పూజిసలెందె హూగలుతందె' (పూజలు చేయ పూలు తెచ్చాను) అనే పాటను పాడటంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆమెను ప్రశంసించారు. తేజస్విసూర్యకు 34 ఏళ్లు. ఫిట్‌నెస్, వాక్చాతుర్యంతో రాజకీయాలలో పేరు సంపాదించారు. ఆర్ఎస్ఎస్, ఏబీవీపీలో పనిచేశారు. తేజస్వి సూర్య లా పూర్తి చేసి, అడ్వకేట్‌గా వృత్తి ప్రారంభించారు. ఆ తరువాత కొంతకాలానికే రాజకీయాల్లోకి వచ్చారు. మార్చిలో వీరి వివాహం జరుగుతుందని తెలిసింది.

పెంపుడు కుక్క మృతి యజమాని ఆత్మహత్య

» శునకానికి ఉపయోగించిన చైన్‌తోనే ఉరి

బెంగళూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్క మరణాన్ని జీర్ణించుకోలేక బెంగళూరు నగరంలోని హెగ్గడదేవనపురలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజశేఖర్ (33) అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం జర్మన్ షెపర్డ్ జాతికి చెందిన కుక్కను కొనుగోలు చేశారు. దానికి బౌన్సీ అని పేరు పెట్టుకుని పెంచాడు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఉన్న బౌన్సీ మంగళవారం మృతి చెందింది. తన సొంత భూమిలో అదే రోజు సాయంత్రం కుక్కకు అంత్యక్రియలు నిర్వహించిన రాజశేఖర్, ఇంటికి వచ్చాక తన పెంపుడు కుక్క లేకపోవడాన్ని జీర్ణించుకోలేక బౌన్సీకి ఉపయోగించిన చెయిన్‌తో ఉరి వేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి మాదనాయకనహళ్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రాజశేఖర్ మృతదేహాన్ని నెలమంగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



బౌన్సీ, రాజశేఖర్

దేవాలయాలు కిటకిట!

- కొత్త సంవత్సర వేళ తరలివచ్చిన భక్తులు
- గుట్ట నృసింహుడి దర్శనానికి 50 వేల మంది
- వేములవాడకు వేంచేసిన 40 వేల మంది

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద భక్తుల రద్దీ

కొత్త సంవత్సరం సందర్భంగా బుధవారం రాష్ట్రంలోని దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని బిర్లామందిర్, చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి, సనత్‌నగర్‌లోని రేణుక ఎల్లమ్మ, జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి, దిల్‌సుఖ్ నగర్‌లోని సాయిబాబా ఆలయాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. గంటల కొద్దీ క్యూలైన్లలో బారులుతీరి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాదంతా సుఖశాంతులతో ఉండాలని మొక్కుకున్నారు. యదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దివ్యాంగులు, మహిళలు, చంటిపిల్లల తల్లులను తూర్పు రాజగోపురం వద్దకు తరలించేందుకు ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగించారు. 50 వేల మంది భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకోగా, ధర్మ దర్శనానికి రెండు గంటలు, వీఐపీ టికెట్ దర్శనానికి గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. పాతగుట్ట ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామిని 40 వేల మందికిపైగా భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వేములవాడలోని బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికీ భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం రామయ్య సన్నిధి, వరంగల్ నగరంలోని భద్రకాళి, వేయిస్తంభాల దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మేడ్చల్ జిల్లాలోని కీసర శివాలయం, రంగారెడ్డి జిల్లా చిలుకూరులోని బాలాజీ దేవాలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది.


హైదరాబాద్‌లోని బిర్లా మందిర్ వద్ద భక్త జన సందోహం

ములుగు.. పర్యాటక వెలుగు


లక్నవరం చెరువులో వాటర్ గేమ్స్


లక్నవరం చెరువులోని ఉయ్యాల వంతెన

(మొదటి పేజీ తరువాయి)

చూపుతున్నారు. కొత్త ఏడాది వేడుకల కోసం పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వచ్చి సంబరాలు చేసుకున్నారు. లక్నవరానికి 12 కి.మీ దూరంలో తాడ్వాయి మండలంలోనే దట్టమైన అటవీ ప్రాంతంలో మరో పర్యాటక ప్రదేశం సిద్ధమవుతోంది. అదే బ్లాక్‌బెర్రీ ఐలెండ్. జలగలంచ వాగు ఒడ్డున ఉన్న ఇసుక తిన్నెలు, నేరేడు చెట్లు, కంక(వెదురు) వనంతో అందంగా అల్లుకున్న ప్రదేశమిది. పూర్తిగా ఎకో ఫ్రెండ్లీగా ఐదెకరాల విస్తీర్ణంలోని ఈ దీవిని అభివృద్ధి చేశారు. వెదురు కర్రలతో మంచెలు, 50కిపైగా గుడారాలు, ఇసుకలో వాలీబాల్ కోర్టు, ఓపెన్ రెస్టారెంట్‌లు, సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేశారు. గోవా తీరంలో మాదిరిగా లైటింగ్‌తో సుందరంగా అలంకరించారు. అడవి మధ్యలో రాత్రివేళ ఇక్కడ సేదతీరడం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని మిగల్చనుంది. ట్రెకింగ్, బర్డ్‌వాచ్, సఫారీ రైడింగ్ కోసం అటవీ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. పబ్లిక్, ప్రైవేటు సెక్టార్‌లో ఈ రెండు ప్రాజెక్టులు విజయవంతం కావడంతో వాజేడు మండలంలోని బొగత జలపాతం, మేడారం, మల్లూరు, రామప్పలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. 365 రోజులు ఇక్కడికి పర్యాటకులు వచ్చేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికార యంత్రాంగం ఆలోచన చేస్తోంది.


లక్నవరం చెరువులోని రిసార్టు


రామప్ప దేవాలయం

టూరిజానికి కేంద్రం నిధులు

గత మూడేళ్లలో ములుగు జిల్లాకు కోటిన్నర మంది పర్యాకులు వచ్చినట్లు రాష్ట్ర పర్యాటక శాఖ ఇటీవల ప్రకటించింది. రామప్ప, లక్నవరం, మేడారానికి కోట్లలో ఆదాయం సమకూరింది. ఈ నేపథ్యంలో ములుగు జిల్లాలో పర్యాటకాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధికి రామప్ప ప్రాంత పర్యావరణ హిత పర్యాటక కార్యక్రమం కింద రూ.73.74 కోట్ల నిధులను కేటాయించింది. పర్యాటకుల నుంచి మంచి స్పందన లభిస్తుండటంతో పలు కంపెనీలు ములుగు జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి.

ప్రైవేటు రిసార్టులు, లాడ్జిలు


బ్లాక్‌బెర్రీ ఐలాండ్‌లోని ఓపెన్ రెస్టారెంట్

గత ప్రభుత్వం ములుగు, రామప్ప, లక్నవరం, మేడారం, తాడ్వాయి, మల్లూరు, బొగత వద్ద హరిత హోటళ్లను నిర్మించి నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. వీకెండ్‌లు, హాలీడేలలో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండటంతో ఇవి సరిపోవడం లేదు. ప్రైవేటు రిసార్టులు ఏర్పాటు చేసేందుకు పలువురు ముందుకొస్తున్నారు. ఇప్పటికే లక్నవరం, మేడారం వెళ్లేదారిలో రిసార్టులు అందుబాటులోకి రాగా రామప్పలో సిద్ధమవుతున్నాయి. వీటిలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి. మేడారం, బుస్సాపూర్ వద్ద కొందరు విశ్రాంతి గదులను కూడా ఏర్పాటుచేసి కిరాయికి ఇస్తున్నారు. సీజన్‌లతో సంబంధం లేకుండా వీటికి గిరాకీ వస్తోంది. జిల్లా కేంద్రంతోపాటు జాతీయ రహదారిపై ఉన్న మండలకేంద్రాల్లో ఏసీ, నాన్ ఏసీ సదుపాయాలతో లాడ్జిలు కూడా వెలుస్తున్నాయి.


బొగత జలపాతం

ఆయిల్‌పామ్.. ఆశాకిరణం!

(మొదటి పేజీ తరువాయి)

ఉందని ప్రభుత్వాలు గుర్తించాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దేశం మొత్తం మీద ఏపీ, తెలంగాణలోనే అత్యధిక విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగులో ఉంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో 2.23 లక్షల ఎకరాల్లో పామాయిల్ తోటలు ఉన్నాయి. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 60 వేలు, ఖమ్మం జిల్లాలో 28 వేల ఎకరాల్లో ఉన్నాయి. 31 జిల్లాల్లో తోటల విస్తీర్ణాన్ని పెంచేందుకు 14 ప్రైవేటు కంపెనీలకు అవకాశం కల్పించారు. ఆయిల్‌పామ్‌ను 25 లక్షల ఎకరాలకు పెంచాలనే లక్ష్యంతో సర్కారు ముందుకెళ్తోంది.

90 శాతం ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే..

ప్రస్తుతం తెలంగాణలో సుమారు 2 లక్షల టన్నుల గెలలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో 90శాతానికి పైగా ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే వస్తున్నాయి. ఇటీవలే కేంద్రం నూనెలపై దిగుమతి సుంకాన్ని 27.5 శాతానికి పెంచడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ ఓఈఆర్ శాతాన్ని 19.47 శాతానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం కూడా రైతులకు శుభపరిణామమే. భద్రాద్రి జిల్లాలోని అశ్వారావుపేట, అప్పారావుపేటల్లో పామాయిల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. త్వరలో సిద్దిపేట, తొర్రూర్, గద్వాలతో పాటు ఖమ్మం జిల్లాలో మరో ఫ్యాక్టరీ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కర్మాగారాల ఆధ్వర్యంలోనే ఆయిల్‌పామ్ విత్తనాలను తెప్పించి, నర్సరీల్లో మొక్కలను పెంచుతారు. ఒక్కో మొక్క తయారీకి రూ.213 వరకు ఖర్చు అవుతున్నా రాయితీపై రైతులకు రూ.20కే అందజేస్తారు. తోట వేసిన తర్వాత ఉద్యానశాఖ ఎరువులు, ఇతర అవసరాల కోసం రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.4200 చొప్పున నాలుగేళ్లపాటు అందజేస్తుంది. బ్యాంకులు కూడా రైతులకు రుణాలు ఇస్తున్నాయి. ఆయిల్‌పామ్ గెలల కొనుగోళ్ల బాధ్యత పూర్తిగా ఆయిల్‌ఫెడ్ చూసుకుంటుంది. గెలల్ని తరలించే రవాణా చార్జీలను కూడా కర్మాగారమే భరిస్తుంది. అశ్వారావుపేటలో గంటకు 30 టన్నుల గెలల క్రషింగ్ సామర్థ్యంతో కర్మాగారాన్ని నిర్మించారు. అప్పారావుపేటలో 90 టన్నుల సామర్థ్యంతో మరొకటి నిర్మించారు. వీటి ద్వారా ఏడాదికి 52 వేల టన్నుల ముడి చమురు ఉత్పత్తి అవుతోంది. ఆయిల్‌పామ్ గెలలకు ప్రభుత్వమే ధరలు నిర్ణయిస్తుంది. ఉద్యానశాఖ, ఆయిల్‌ఫెడ్, రైతు సంఘాల ప్రతినిధులు ఏటా ధరలు నిర్ణయిస్తారు. ఆయిల్‌పామ్ సగటున ఎకరానికి ఏడాదికి 10-12 టన్నుల దిగుబడి వస్తుంది. టన్ను గెలల ధర జనవరి 1న రూ.20,506గా ఉంది.

ఆయిల్‌పామ్‌కు డిమాండ్

మొక్కల సరఫరాతో పాటు డ్రిప్, ఎరువులను రాయితీలపై ఇవ్వడం, గెలల రవాణా చార్జీల భారాన్నీ కర్మాగారాలే భరిస్తుండడంతో పామాయిల్ సాగువైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. ఎకరానికి ఏటా లక్షన్నరకు పైగా ఆదాయం వస్తుంది. ఒక్కసారి తోట వేస్తే దీర్ఘకాలం దిగుబడులు వస్తూనే ఉంటాయి. తోటవేసిన నాటి నుంచి గెలలు ఫ్యాక్టరీలకు చేరేదాకా అధికారుల పర్యవేక్షణ ఉంటుంది.

- అకుల బాలకృష్ణ, అయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి, అశ్వారావుపేట

రైతు భరోసాలో కోతలు, వడపోతలు

ఇందుకోసమే ఏడాది కాలంగా జాప్యం.. మళ్లీ కొత్తగా దరఖాస్తు చేయించే ప్రయత్నం


- ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా ఊరుకోం
- రెడ్‌జోన్‌కు సమీపంలో తెలంగాణ పోలీస్ వ్యవస్థ
- సీఎం రేవంత్‌రెడ్డే ఇందుకు కారణం: హరీశ్


సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సంగారెడ్డి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసాలో కోతలు, వడపోతలు తప్ప ప్రత్యేకత ఏమీ లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. వ్యవసాయానికి ఇచ్చే పెట్టుబడి సాయంలో అనేక రకాలుగా కోతలు పెట్టడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది కాలంగా కసరత్తు చేస్తున్నారని అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు కింద 11 విడతల్లో రూ.73 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. గడిచిన వానాకాలం, ప్రస్తుత యాసంగికి సంబంధించి ఎకరాకు రూ.15 వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసాకు మళ్లీ కొత్తగా దరఖాస్తులు చేసేలా ప్రయత్నాలు ఆరంభించారని, మరింత జాప్యం చేయడానికే ఈ ఎత్తుగడ అని ఆరోపించారు. రాళ్లు, రప్పలున్న భూములకు రైతు భరోసా డబ్బులు ఇవ్వబోమని అంటే దళిత, గిరిజన రైతులు సాగుచేసే పోడు, ఇతర భూముల్లో రాళ్లు, రప్పలు ఉండవా? అని ప్రశ్నించారు. బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు రూ.వేల కోట్లు మాఫీ చేసి.. రైతులకు మాత్రం పెట్టుబడి సాయంలో కోతలు విధించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇక ఎకరం లోపు ఉన్న వారందరినీ వ్యవసాయ కూలీలుగానే పరిగణించి ఏటా రూ.12 వేల చొప్పున నగదు ఇవ్వాలని అన్నారు. రూ.2 లక్షల పైబడిన రుణం ఉన్న రైతులకు మాఫీ ఎప్పుడు చేస్తారో తేదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రీన్‌జోన్‌లో ఉన్న తెలంగాణ పోలీస్ వ్యవస్థ పనితీరు ప్రస్తుతం ఎల్లోజోన్‌లో ఉందని, రెడ్‌జోన్‌కు చేరువైందని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే నేషనల్ క్రైం బ్యూరోలోని రికార్డులను పరిశీలిస్తారని, కానీ.. గత ఏడాది కాలంలో నేరాల శాతం విపరీతంగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. డయల్-100కు కాల్‌చేస్తే ఆలస్యంగా స్పందిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయని తెలిపారు. తెలంగాణ పోలీసులు ఇలా కావడానికి సీఎం రేవంత్‌రెడ్డే కారణమని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

సినిమా రంగంలో.. భవిష్యత్తు అమరావతిదే

- ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సినిమా రంగంలో భవిష్యత్తులో అమరావతి కూడా ప్రభావం చూపే ప్రాంతం అవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఆయన ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో బుధవారం పిచ్చాపాటిగా మాట్లాడారు. ఆ సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో సినిమా రంగం ప్రస్తావన వచ్చింది. 'మొదట్లో సినిమా రంగానికి బెజవాడ కేంద్ర స్థానంగా ఉండేది. తర్వాత తెలుగు సినిమా పరిశ్రమ హైదరాబాద్‌కు తరలి వచ్చినా ఆదాయపరంగా కోస్తా ప్రాంతమే సినిమా రంగానికి కీలకంగా ఉండేది. కాని కాల ప్రవాహంలో హైదరాబాద్ జనాభా కోటి దాటి పోయి అక్కడ సినిమా రంగానికి ఆదాయం పెరిగింది. దీంతో ఆ రంగంలో హైదరాబాద్ ప్రాముఖ్యం విస్తరించింది. కాని ఇప్పుడు పరిస్థితి ఇంకా మారింది. తెలుగు సినిమాలకు ఇప్పుడు విదేశాల్లో ఎక్కువ ఆదాయం వస్తోంది. విదేశాలను దృష్టిలో పెట్టుకొని సినిమాల తయారీ, పంపిణీ జరుగుతోంది. అయినా ఆదాయపరంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్‌దే ప్రముఖ స్థానం. భవిష్యత్తులో అమరావతి కూడా ప్రభావం చూపించే స్థాయికి రావచ్చు' అని ఆయన పేర్కొన్నారు. బెనిఫిట్ షోలకు తెలంగాణ ప్రభుత్వం అనుమతులు నిలిపివేసినా ఏపీ ప్రభుత్వం అనుమతులు ఇవ్వడానికి సినీ రంగం నుంచి వచ్చిన విజ్ఞప్తులు కారణమా అన్న ప్రశ్నకు సమాధానాన్ని ఆయన దాటవేశారు. 'మనం దృష్టి పెట్టాల్సిన పెద్ద పెద్ద అంశాలు వేరే ఉన్నాయి. వాటిపై పనిచేయడం మాకు ప్రయారిటీ' అని ఆయన వ్యాఖ్యానించారు.

గోదాం వ్యవహారాలన్నీ మేనేజరే చూసుకున్నారు!

- నాకేమీ తెలియదు: పేర్ని నాని భార్య
- బియ్యం మాయం కేసులో పోలీసుల ముందు విచారణకు హాజరు

మచిలీపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదాం వ్యవహారాలన్నీ తమ మేనేజర్ మానస తేజ చూసేవారని మాజీమంత్రి, వైసీపీ నేత పేర్ని నాని భార్య, గోడౌన్‌లో రేషన్ బియ్యం మాయం కేసులో ప్రధాన నిందితురాలు (ఏ-1) జయసుధ తెలిపారు. ఈ వ్యవహారాల గురించి తనకేమీ తెలియదని ఆమె చెప్పినట్లు సమాచారం. బుధవారం ఆమె మచిలీపట్నం తాలూకా పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు న్యాయవాదుల సమక్షంలో విచారణ జరిగింది. రాబర్ట్‌సన్‌పేట సీఐ ఏసుబాబు, మచిలీపట్నం తాలూకా ఎస్ఐ సత్యనారాయణ ఆమెకు పలు ప్రశ్నలు సంధించారు. గోడౌన్ ఎవరి పేరున ఉంది.. గోడౌన్‌లో బియ్యం నిల్వ వ్యవహారాలను మీరే చూశారా.. నగదు లావాదేవీలు ఎవరు చూసేవారు తదితర ప్రశ్నలు అడిగి వివరాలు రాబట్టారు. అనంతరం ఇద్దరు జామీనుదారులతో పోలీసులు సంతకాలు చేయించుకున్నారు. తర్వాత ఆమె స్టేషన్ నుంచి వచ్చారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌కు ప్రభుత్వం కేటాయించిన కారులో జయసుధ స్టేషన్‌కు రావడం వివాదాస్పదమైంది. అక్కడకు పెద్దఎత్తున వైసీపీ కార్యకర్తలు చేరుకుని హడావుడి చేశారు. బియ్యం మాయం కేసులో ఏ-1గా ఉన్న పేర్ని జయసుధకు కృష్ణా జిల్లా కోర్టులో గత నెల 30వ తేదీన ముందస్తు బెయిల్ మంజూరైన సంగతి తెలిసిందే. పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే పోలీసులు బుధవారం విచారణకు రావాలని నోటీసులివ్వడంతో ఆమె స్టేషన్‌కు వచ్చారు.

పామాయిల్ ధర పెంపుపై తుమ్మల హర్షం

అశ్వారావుపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పామాయిల్ గెలల ధర పెంపుపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. నూతన సంవత్సరంలో పామాయిల్ రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పిందని పేర్కొన్నారు. డిసెంబరులో రూ.20,413గా ఉన్న టన్ను పామాయిల్ గెలల ధరను మరో రూ.83 పెంచి రూ.20,506 చేశారు. ఈ ధర తక్షణమే అమలులోకి వస్తుందని ఆయిల్‌ఫెడ్ అధికారులు తెలిపారు. ఏడు నెలలుగా పామాయిల్ గెలల ధర పెరుగుతూనే ఉంది. ఏడు నెలల్లోనే టన్నుకు రూ.8వేలకు పైగా ధర పెరిగింది. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచడం, ఓఈఆర్ శాతం పెంచేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలు వంటివి ఇందుకు కారణం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బీరేన్ పశ్చాత్తాపం!

మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌కు సంవత్సరాంతమున జ్ఞానోదయం కలిగింది. ఏడాదిన్నరగా ఇల్లు తగలబడటానికి కారకుడు తానేనని ఆయన ఒప్పుకున్నారు. 2023మే 3నుంచి 2024డిసెంబరు 31వరకూ జరిగినదంతా మణిపూర్ ప్రజలు తమ మనస్సుల్లోంచి చెరిపేసి, తనను క్షమించేయాలని కోరుతూ తీవ్ర పశ్చాత్తాపాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో జరిగినదానికి ఎంతో చింతిస్తున్నాను, ఎంతోమంది మరణించారు, ఎంతోమంది తమ ఆత్మీయులను కోల్పోయారు, ఇళ్ళూవాకిళ్ళూ వదిలేశారు అంటూ, ఇదంతా తన కారణంగానే జరిగిందని బాధపడ్డారు. తనవల్ల కష్టపడ్డవారు, నష్టపోయినవారు నిండుమనసుతో తనను క్షమించేసి, అన్ని జాతులవారూ, తెగలవారూ చేయీచేయీ కలిపి కొత్తసంవత్సరంలో ఆనందంగా కలిసిసాగాలన్నది ఆ ప్రకటన సారాంశం.

పశ్చాత్తాపాన్ని ప్రకటించడం, క్షమాపణలు చెప్పడం మెచ్చదగ్గ లక్షణాలు. ఎదుటివారు ఎంత కఠినాత్ములైనా, ఇటువంటి చర్యలకు కాస్తంతైనా మనసు కరగకుండా ఉండదు. బీరేన్ ప్రకటన మండుతున్న గుండెలను ఓదార్చి, శాంతిస్థాపనకు ఏమాత్రం దోహదపడినా సంతోషించాల్సిందే. కానీ, జరిగిందేదో జరిగిపోయిందనీ, గతాన్ని మరిచిపోవాలనీ చెప్పడానికి బీరేన్‌సింగ్ అర్హుడా అన్నది అతి ముఖ్యమైన ప్రశ్న. ఇప్పటివరకూ ఆయన ఘోరాన్ని ఒప్పుకోలేదని, ఇప్పుడు ఒప్పుకున్నారని, సమస్య తీవ్రతను గుర్తించడం, పరస్పరం కలహించుకుంటున్నవారు ఏకం కావాలని ఆశించడం మంచిదేనన్న విశ్లేషణలు సరైనవే. కానీ, ఆయన క్షమాపణల వెనుక కూడా ఏవో కొత్త కుట్రలున్నాయేమోనని, మరింత అణచివేతకు ఆయన మార్గాన్ని సుగమం చేసుకుంటున్నారని మీతీయేతర జాతులవారు అనుమానపడుతున్నారట.

కొత్తసంవత్సరంలో అంతా మంచి జరగాలని కోరుకోవడంలో తప్పేమీ లేదు. కానీ, తగిన ప్రాతిపదికలు, పునాదులు లేకుండా అది తనకు తానుగా జరిగిపోదని ఆయనకూ తెలుసు. ఏడాదిన్నరకాలంలో సయోధ్యకు వీలైన వాతావరణాన్ని ఆయన సృష్టించిందేమీ లేదు. హైకోర్టు తన పరిధిని అతిక్రమించి మీతీలకు ఎస్టీ రిజర్వేషన్ కట్టబెట్టే చర్యలకు తెరదీయడం వెనుక బీరేన్ కుట్ర ఉన్నదని ఆదివాసీ తెగలు అనుమానించడంతో ఈ అగ్గిరేగిన విషయం తెలిసిందే. అప్పటికే వారికి వ్యతిరేకంగా బీరేన్ ప్రభుత్వం పలు నిర్ణయాలు చేయడం, వారిని మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులుగా చిత్రీకరించడం వంటివి నిప్పు సులువుగా అంటుకోవడానికి దోహదం చేశాయి. ఈ మొత్తం హింసాకాండలో బీరేన్ పూర్తిగా మీతీలపక్షాన వ్యవహరించారు. చివరకు పోలీసు స్టేషన్లనుంచి దోచుకున్న ఆయుధాలు కూడా వారి చేతుల్లోకే పోయాయి. మీతీ మిలిటెంట్‌గ్రూపులు రెచ్చిపోగలిగాయి. మీతీ బీరేన్ తమపక్షాన లేరని ఆదివాసీ తెగలు అనతికాలంలోనే నిర్ధారణకు వచ్చాయి. ఉన్నతస్థానంలో ఉంటూ సమన్యాయం చేయవలసిన నాయకుడు తమకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, తమకు చెందాల్సిన ఉద్యోగాలనూ, ప్రకృతివనరులను తనవారికి కట్టబెట్టదల్చుకున్నాడని వారికి అనిపించింది. నాయకుడిపైన ఉన్న ఈ విశ్వాసరాహిత్యమే అక్కడ అగ్గి ఆరనివ్వకుండా చేస్తోంది. దశాబ్దాలుగా పరస్పరం ఘర్షణపడుతున్న ఆదివాసీ తెగలన్నీ ఏకతాటిమీదకు వచ్చాయి. సమాజం నిలువునా చీలిపోయి, పరస్పర అవిశ్వాసం నిండిన ఈ వాతావరణం మిలిటెంట్ గ్రూపులకు సరికొత్త ఆక్సిజన్ అందించింది. ఇప్పుడు హింస ఎవరో ఇద్దరి మధ్య అని కాక, మొత్తం సమాజాన్ని కమ్మేసివుంది. ఏడాదిన్నరకాలంగా ఒక రాష్ట్రం ఇలా మండుతూంటే, కేంద్రం ఊరుకోవడం, ముఖ్యమంత్రిని సమర్థించుకురావడం మణిపూర్ విషయంలోనే జరిగింది. అదే ఓ విపక్షపాలిత రాష్ట్రమైవుంటే అగ్గిరాజుకున్న అనతికాలంలోనే అది కేంద్రం చేతుల్లోకి పోయివుండేది. ఇంతజరిగినా అక్కడకు మోదీ వెళ్ళకుండా, జరుగుతున్నదేమిటో దేశప్రజలకు తెలియనివ్వకుండా, పార్లమెంట్‌లో సైతం అసత్యాలతో కాలాన్ని నెట్టుకొచ్చేశారు. వేలాది సైనికులను మోహరించడం తప్ప, బీరేన్‌ను తప్పించాలన్న డిమాండ్‌కు ఢిల్లీపాలకులు లొంగనే లేదు.

నాలుగు మంచిమాటలు చెప్పి, క్షమించమని అడిగినంతనే సులభంగా వదిలేయగలిగేంత చిన్న పొరపాటు కాదిది. మణిపూర్ పాలకులు ఉద్దేశపూర్వకంగా రేపిన కార్చిచ్చు అది. తమ ప్రయోజనాలకు అనుగుణంగా దానిని రగిలిస్తూవచ్చిన వారు ఇప్పుడు హఠాత్తుగా గతాన్ని మరిచిపోమంటున్నారు. ఆదివాసీ తెగల్లో తన పట్ల ఆగ్రహానికీ, అవిశ్వాసానికి ఏయే చర్యలు దోహదం చేశాయో బీరేన్‌కు తెలుసు. ఈ సందర్భంగా వారికి కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చివున్నా ఆయన పట్ల నమ్మకం పెరిగేది, ఈ పశ్చాత్తాపానికి కాస్తంత విలువ ఉండేది.

సామాజిక వైవిధ్యంలో జీవన సౌందర్యం

తబలా మే□జాకిర్ హుస్సేన్ ఇటీవల మరణించిన తరువాత ఆయనకు సంబంధించిన ఒక పాత విడియో క్లిప్ సామాజిక మాధ్యమాలలో మళ్లీ కనిపిస్తోంది. అందులో ఆయన తన తండ్రి, సుప్రసిద్ధ హిందుస్థానీ సంగీతకారుడు అల్లా రఖా చెప్పిన కొన్ని మాటలను గుర్తు చేసుకున్నారు: 'నేను చదువుల తల్లి సరస్వతిని, ప్రథమ పూజ్యుడు వినాయకుడిని ఆరాధిస్తుంటాను. వారు నా ఉపాధ్యాయులు'. విశేషంగా ఆకట్టుకునే, అంతకంటే ఆసక్తికరమైన ఈ విలువైన వాక్కులు మతనిష్ఠాపరుడు, దైవ భీతుడు అయిన ఒక ముస్లిం మతస్తుడివి. మన భారతావనిలో శతాబ్దాలుగా హిందువులు, ముస్లింల మధ్య సమున్నత సాంస్కృతిక సమ్మేళనాన్ని సూచిస్తున్న మాటలు అవి. అంతేకాదు, ఒక స్పష్టమైన మనోవైఖరిని అవి వ్యక్తం చేస్తున్నాయి. 'గంగా–జమున' తెహ్‌జీబ్ (సంప్రదాయం)గా ఆ విశిష్ట మనోవైఖరి మన ప్రజల జీవన రీతుల్లో ప్రతిబింబిస్తోంది.

గంగా–జమున సంప్రదాయం ఒక సంయుక్త లేదా ఉమ్మడి సంస్కృతిని పరివేష్టించి ఉన్న సంప్రదాయమే 'గంగా–జమున'. మతసహిష్ణుత, ఒక సాంస్కృతిక వారసత్వ భాగస్వామ్యానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సంకీర్ణ సంస్కృతి అది. మన సంగీతం, లలితకళలు, వాస్తురీతులు, వంటకాలలో అది నిండుగా కనిపిస్తుంది. అయితే దేశ విభజన బీభత్సాలు, వాటి చేదు జ్ఞాపకాలు, ఇటీవలి కాలంలో సంకుచితమైపోయిన సామాజిక దృక్పథాల నేపథ్యంలో 'గంగా–జమున' సంప్రదాయం గత కాలం గురించి ఒక జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోతోంది! వివిధ చింతనా ధోరణుల సమన్వయాన్ని, మన సంప్రదాయ సహనం, సమైక్యతా స్ఫూర్తిని మనం ఉద్దేశపూర్వకంగానే తిరస్కరిస్తున్నామా? అదే నిజమైన పక్షంలో మన సామాజిక జీవన రీతులలో సువ్యక్తమవుతున్న సంక్లిష్ట మత, సాంస్కృతిక, భాషా పరమైన వైవిధ్యాలను ఎలా సమన్వయం చేసుకోగలుగుతాం?

క్రీ.శ. 712లో సింధ్ ప్రాంతంపై అరబ్‌ల దండయాత్రతో ఇస్లాం భారతావనిలోకి ప్రవేశించింది. మొగల్ చక్రవర్తుల కాలంలో ఆ కొత్త మతం మన దేశంలో విస్తృతంగా వ్యాపించింది. ఇస్లాంను స్వీకరించిన వారిలో అత్యధికులు కుల వ్యవస్థ అన్యాయాలు, దురాగతాలను తప్పించుకునేందుకై బలవంతంగానో లేదా స్వచ్ఛందంగానో ఆ మతంలో చేరినవారే. క్రైస్తవ భారతీయులు తమ చరిత్ర సెయింట్ థామస్ కేరళలో అడుగిడిన నాటి నుంచి ప్రారంభమవుతుందని విశ్వసిస్తారు క్రీ.శ 52లో సెయింట్ థామస్ మలబారు ప్రాంతంలోని యూదులను క్రైస్తవంలో చేరేలా ప్రేరేపించి మన దేశంలో క్రైస్తవం నెలకొనేందుకు, వర్ధిల్లేందుకు దోహదం చేశారని భావిస్తారు. చరిత్ర పరిణామ క్రమంలోని వేర్వేరు దశలలో యూదు, పార్శీ, బహాయీ మతస్తులు మన దేశానికి శరణార్థులుగా వచ్చి, ఆ తరువాత స్వేచ్ఛగా తమ మతాలను విస్తరింపజేసుకుని వర్ధిల్లుతున్నారు.

మన తీరాలకు క్రైస్తవం, ఇస్లాం వచ్చిన శతాబ్దాల తరువాత భారతదేశ జనాభా మతాల వారీగా ఇలా ఉంది: హిందువులు 79.8 శాతం; ముస్లింలు 14.2 శాతం,



> 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచం ఒకే కుటుంబం) అన్న మన ప్రాచీన భావన హిందూ సంస్కృతిలో ప్రగాఢంగా వేళ్లూనుకుని ఉన్నది. ఈ సమున్నత దార్శనిక చింతనే భారత్ ఒక 'విశ్వగురు' అన్న మన వాదనకు విశ్వసనీయతను కల్పిస్తున్నది.. బహుళ మతాలు వర్థిల్లుతున్న భారతీయ సమాజంలో, ఐశ్వర్యాభివృద్ధికి, జీవన భద్రతకు సామాజిక సమైక్యత ఒక ముఖ్యమైన ప్రాతిపదిక.

క్రైస్తవులు 2.3 శాతం. ఇప్పుడు అన్ని మతాల వారిలోను సంతానోత్పత్తి రేట్లు పడిపోతున్నాయి. వాస్తవ పరిస్థితి ఇదయితే కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించుతున్న కారణంగా హిందూ జనాభా తగ్గిపోతోందని, అదే సమయంలో ఆ పద్ధతులను పాటించని కొన్ని ఇతర మతాల వారి సంఖ్య గణనీయంగా ఎదుగుతుందని, ఇది ఇలాగే కొనసాగిన పక్షంలో హిందువులు తమ జన్మ భూమిలోనే మైనారిటీలు అయిపోతారనే వాదన ఒకటి గట్టిగా విన్పిస్తోంది. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించడమే. అంతేకాదు చాలా ప్రమాదకరమైన భయాందోళనలను రగుల్కొల్పే వాదన.


1996లో అమెరికా సామాజిక శాస్త్రవేత్త శామ్యూల్ హంటింగ్టన్ 'నాగరికతల సంఘర్షణ' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ప్రపంచం భవిష్యత్తులో నాగరికత ప్రాతిపదికన విభజితమైపోతుందని, భావజాలాల మధ్య కాకుండా, మౌలికంగా విభిన్నమైన మతాలు, సంస్కృతుల మధ్య సంఘర్షణలు ప్రజ్వరిల్లుతాయనేది ఆ సిద్ధాంత సారం మరి బహుళ సంస్కృతులు, మతాలు ఉన్న భారతదేశమే హంటింగ్టన్ ప్రమాదకర జోస్యం నిజమయ్యేందుకు అత్యధిక అవకాశమున్న నెలవుగా కనిపిస్తోంది.

వైవిధ్యాన్ని ఆదరిస్తూ సహన భావాన్ని పెంపొందించడంలోను, ఆర్థికంగా, సాంస్కృతికంగా పరస్పర సంబంధాలను ప్రోత్సహించడంలోనూ భారత ప్రజాస్వామ్యం ఇంతవరకూ సత్ఫలితాలను సాధించింది. సమస్త భారత పౌరులకూ సాపేక్షంగా శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు అవి విశేషంగా దోహదం చేశాయి. మరి హంటింగ్టన్ ప్రతిపాదన ప్రకారం అనివార్యమైన హిందూ, ఇస్లామిక్ నాగరికతల సంఘర్షణను భారత్ అధిగమించగలదా? కాలమే నిర్ణయిస్తుంది. అయితే కొన్ని వాస్తవాలను నిశితంగా పరిశీలిద్దాం.

గత ప్రభుత్వాలు స్వార్థ ప్రయోజనాల కోసం మైనారిటీ మతస్తులను బుజ్జగించాయి. తద్వారా ఎన్నికలలో ప్రయోజనం పొందాయి. అయితే ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. పూర్తిగా విరుద్ధమైన పరిస్థితులు ఉన్నాయి. బుజ్జగింపులు ఏ మాత్రం లేకపోగా మైనారిటీ మతాలవారు తీవ్ర వివక్షకు, బెదిరింపులకు గురవుతున్నారు. వారి ఆరాధనా మందిరాలపై దాడులు జరుగుతున్నాయి. నివాస గృహాలు కూల్చివేయబడుతున్నాయి. అంతే కాకుండా మైనారిటీ వర్గాలవారు ఆర్థికంగా, సామాజికంగా వెలివేతకు గురవుతున్నారు. హంతక ముఠాలు చెలరేగిపోతున్నాయి. ఇవి, మైనారిటీ మతస్తులు నేడు ఎదుర్కొంటున్న కష్టనష్టాల్లో కొన్ని మాత్రమే. కొంతమంది మతాచార్యులు, పాలక వర్గాల పెద్దలు ముస్లింలు, క్రైస్తవుల పట్ల విద్వేషాన్ని పనిగట్టుకుని రెచ్చగొడుతున్నారు. ప్రభుత్వాలు ఉపేక్ష వహిస్తున్నాయి, మీడియా మౌనం పాటిస్తోంది. ఇది చోటుచేసుకుంటున్న విపత్కర పరిణామాలకు మౌన అంగీకారమా?

కుల మతాల ప్రాతిపదికన ప్రజలను విభజించే కుటిల రాజకీయాలు పెచ్చరిల్లుతున్నాయని మన ఎన్నికల చరిత్ర స్పష్టం చేస్తోంది. మరి మతపరమైన విభజనలు మన జాతీయ భద్రతను పటిష్ఠం చేస్తాయా లేక బలహీనపరుస్తాయా? జాతీయ ప్రయోజనాల కంటే ఎన్నికలలో గెలుపే ప్రాధాన్యం పొందనున్నదా? రాజకీయ అధికారం కోసం ఆచరిస్తున్న ఈ నీతిబాహ్య రాజకీయాలు అంతిమంగా మన సామాజిక ఐక్యతను తీవ్రంగా దెబ్బతీసే వినాశనకరమైన ఉద్రిక్తతలు, హింసాకాండకు దారితీసే అవకాశం ఎంతైనా ఉన్నది. అటువంటి పరిస్థితి వాటిల్లితే అది జాతి భద్రతపై తప్పక ప్రతికూల ప్రభావం చూపగలదు. దేశ భద్రతకు 'రెండున్నర ఫ్రంట్‌'ల్లో యుద్ధం చేయవలసివచ్చే అగత్యమేర్పడనున్నదని మన సైనికాధికారులు సూచించడం గమనార్హం. 'రెండు ఫ్రంట్‌'లు మన ఇరుగుపొరుగున ఉన్న శత్రువుల నుంచి యుద్ధ ముప్పు నెదుర్కోవడానికి సంబంధించినవన్నది స్పష్టం. నిర్దిష్టంగా తెలియని 'సగం ఫ్రంట్' సామాజిక సమైక్యత విచ్ఛిన్నమవడం వల్ల వాటిల్లే ముప్పు. ఇది కూడా సరిహద్దుల్లో యుద్ధం వలే ప్రమాదకరమైనది. మత దురభిమానాల కారణంగా తలెత్తే జగడాలు ఇప్పటికే తీవ్రంగా ఉన్న నక్సల్స్ తిరుగుబాటు, కశ్మీర్‌లో ఉగ్రవాదం, మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండకు తోడైతే జనితమయ్యే మొత్తం ముప్పుతో మన జాతీయ భద్రతకు మున్నెన్నడూ లేని సవాళ్లు ఎదురవుతాయి. చారిత్రకంగా మన దేశం తరచు విదేశీ దురాక్రమణలకు గురికావడానికి ప్రధాన కారణం మన సమాజంలో అంతర్గత ఐక్యత లోపించడమే కాదూ? దీనికి తోడు మన పాలకులు సంకుచిత ప్రయోజనాలను విడనాడి సమైక్యంగా ఆక్రమణకు వచ్చిన పరాయి సైన్యాలను ఎదుర్కోవడంలో విఫలమయ్యారు ప్రపంచంలోని ఇతర దేశాలలో గారిబాల్డి, బిస్మార్క్‌ల నుంచి టిటో, మండేలా దాకా జాతి నిర్మాతలుగా గౌరవాదరాలు పొందుతున్నారు. భిన్న తెగలు, మతాలకు చెందిన ప్రజలను సమైక్యపరిచి వారిని ఒక జాతిగా రూపొందించినందునే ఆ మహానాయకులు ఆ సమున్నత గుర్తింపునకు అర్హులయ్యారు. మన వర్తమాన రాజకీయ నాయకులకు విశేష ప్రజాదరణ ఉన్నది. ఎన్నికలలో తమకు అను కూలంగా తిరుగులేని ప్రజా తీర్పులు పొందుతున్నారు. 'చారిత్రక దురాగతాల'పై ప్రతీకారం తీర్చుకోవాలన్న అహేతుక వాదనలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని మలిచే శక్తి సామర్థ్యాలు నేటి రాజకీయ నాయకులకు ఉన్నాయి.

'వసుధైవ కుటుంబకం' (ప్రపంచం ఒకే కుటుంబం) అన్న మన ప్రాచీన భావన హిందూ సంస్కృతిలో ప్రగాఢంగా వేళ్లూనుకుని ఉన్నది. ఈ సమున్నత దార్శనిక చింతనే భారత్ ఒక 'విశ్వగురు' అన్న మన వాదనకు విశ్వసనీయతను కల్పిస్తున్నది. బహుళ మతాలు వర్థిల్లుతున్న భారతీయ సమాజంలో, ఐశ్వర్యాభివృద్ధికి, జీవన భద్రతకు సామాజిక సమైక్యత అత్యంత ముఖ్యమైన ప్రాతిపదిక. జూన్ 2022లో నాగపూర్‌లో ఒక సమావేశంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ మాట్లాడుతూ ఒక ఉపయుక్త ప్రశ్న వేశారు: 'ప్రతి మసీదు లోను ఒక శివలింగం కోసం ఎందుకు అన్వేషిస్తున్నారు?' ఈ ప్రశ్నకు ఆయనే ఇలా సమాధానమిచ్చారు: 'మనకు ప్రతి ఒక్కరి పట్ల గౌరవం ఉన్నది. అన్ని విశ్వాసాలను మనం ఆదరిస్తాం'. డిసెంబర్ 19, 2024న ఆయన ఇలా అన్నారు: 'మనం సుదీర్ఘకాలంగా శాంతి సామరస్యాలతో సహ జీవనం చేస్తున్నాం. ఈ సయోధ్యను ప్రపంచమంతటికీ సమకూర్చాలంటే, ఆ ఐక్యతకు ఒక ఆదర్శాన్ని సృష్టించాల్సిన అవసరమున్నది'. ఈ విజ్ఞుని మాటలను మనం అవశ్యంగా లక్ష్య పెట్టాలి.



◆ అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్
భారత నావికాదళం మాజీ ప్రధానాధికారి
(ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యం)

వీధి నాటకానికి మూలస్తంభం

ఆ రోజు 1989 జనవరి 1. ప్రజలు నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నారు. ఢిల్లీ సమీపంలోని, జండాపూర్, షాహిబాబాద్ ప్రాంతంలో నాలుగురోడ్ల కూడలిలో ఒక కళాకారుడు తన కళాకారుల బృందంతో ఒక నాటకాన్ని వేయిస్తూ పర్యవేక్షిస్తున్నాడు. అయనే ఆ నాటక రచయిత, దర్శకుడు. అంతలోనే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక నాయకుడు కొంతమంది అనుచరులతో వచ్చి ప్రదర్శనకారులను చుట్టుముట్టి వారిపై దాడికి పూనుకున్నాడు. ఆ కళాకారుడు తన బృందాన్ని వెళ్లిపొమ్మని తాను మాత్రం అక్కడే ఉండి గూండాలను ఎదిరించాడు. గూండాలు ఆయన్ని తీవ్రంగా గాయపరిచి పారిపోయారు. ఆ కళాకారుడు ఢిల్లీలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండవ రోజు మరణించాడు.

ఆ కళాకారుడే సఫ్దర్ హష్మి. ఆయన బృందం ప్రదర్శించిన నాటకం 'హల్లాబోల్' ("నినదించు"). అప్పటికి కొద్ది రోజులుగా జరుగుతున్న కార్మికుల సమ్మెకు మద్దతుగా, వారిని ప్రోత్సాహపరుస్తూ జరిగిన ప్రదర్శన అది. ఆ ప్రాంతంలోని కార్మికులు, ఇతరులు చుట్టూ గుమిగూడి నాటకాన్ని చూస్తున్నారు. ఇంతలోనే పై సంఘటన జరిగింది. అప్పటికి కొద్దిరోజుల క్రితమే ఆ బృందం చేతనే 'చక్కా జాం' నాటకం ప్రదర్శితమైంది. 'చక్కా జాం' అంటే "ఆగిన చక్రాలు". దానికి కొనసాగింపే ఈ 'హల్లా బోల్'. సఫ్దర్ హష్మీ తన జీవితాన్ని వీధి నాటక ప్రక్రియకి అంకితం చేసిన కళాకారుడు. దోపిడీ రాజకీయ వికృత రూపాన్ని, జన జీవన స్థితిగతులను ప్రతిబింబించే నాటకాల ద్వారా ప్రజలను జాగరూకులను చేస్తున్న అయనను స్వార్థ రాజకీయ శక్తులు కత్తిగట్టి తుదముట్టించాయి.



> సఫ్దర్ హష్మీ తన జీవితాన్ని వీధి నాటక ప్రక్రియకి అంకితం చేసిన కళాకారుడు. దోపిడీ రాజకీయ వికృత రూపాన్ని, జన జీవన స్థితిగతులను ప్రతిబింబించే నాటకాల ద్వారా ప్రజలను జాగరూకులను చేస్తున్న అయనను స్వార్థ రాజకీయ శక్తులు కత్తిగట్టి తుదముట్టించాయి.

12 ఏప్రిల్ 1954లో జన్మించిన ఆయన విద్యాభ్యాసం ఢిల్లీలో సాగింది. తరువాత ఆయన స్టీఫెన్స్ కాలేజీ నుండి ఇంగ్లీష్ లిటరేచర్‌లో బీఏ, ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి ఎమ్‌ఏ ఇంగ్లీష్ చేసాడు. ఈ కాలంలోనే ఎసఎఫఐ, సాంస్కృతిక శాఖతో సంబంధాలు ఏర్పడ్డాయి. అప్పుడే అతనికి 'ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్' (ఇప్టా)తో కూడా సంబంధాలు ఏర్పడి అందులో క్రియాశీలక పాత్ర పోషించాడు. ఇప్టా కోసం కొన్ని నాటకాలు కూడా రాసాడు.

ఎమర్జెన్సీ కాలంలో హష్మీ ఢిల్లీ, కశ్మీర్ విశ్వవిద్యాలయాలలో ఇంగ్లీష్ లెక్చరరుగా ఉద్యోగం చేసాడు. కొంతకాలం ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాకి, ది ఎకనామిక్ టైమ్స్‌కి జర్నలిస్టుగానూ పని చేసాడు. కొంతకాలం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి ఢిల్లీలో, ప్రెస్ ఇన్ఫర్మేషన్ అధికారిగా కూడా పనిచేసాడు. నాటక రచనలతో పాటు పిల్లల కోసం పాటలు, కథలు రాసాడు. దూరదర్శన్ కోసం కొన్ని డాక్యుమెంటరీలు నిర్మించాడు. 1979లో ఆయన మలయశ్రీని వివాహమాడాడు. భార్యతో కలిసి చాలా ప్రదర్శనలు ఇచ్చారు.

1973లో ఆయన 'జన నాట్య మంచ్' (జనమ్) అనే నాటక సంస్థను ఏర్పాటు చేశాడు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎన్నికలను రిగ్గింగ్ చేయిస్తే అయన 'కుర్సీ, కుర్సీ, కుర్సీ' అనే వ్యంగ్య నాటకాన్ని రాసి ప్రదర్శింపచేసాడు. 1975లో ప్రతిపక్షాలపై నిర్బంధం ఉన్న ఎమర్జెన్సీ సమయంలో ఆయన జనమ్ సంస్థ ద్వారా వీధుల్లోను, మురికి, కార్మిక వాడల్లోను నాలుగువేల పైచిలుకు వీధి నాటక ప్రదర్శనలు ఇచ్చాడు. హంగూ ఆర్భాటం లేకుండా ఉన్నది ఉన్నట్లు ప్రజల్లోకి వెళ్ళడానికి ఏకైక సాధనం వీధి నాటిక అని ఆయన నమ్మకం.

నిజానికి హష్మి మరణంతోనే అయన సృష్టించిన వీధి నాటకం అంతమైపోతుందని అనుకున్నారు. కానీ అందుకు భిన్నంగా జరిగింది. జనమ్, ప్రజానాట్యమండలి లాంటి సంస్థల కార్యకర్తలు వీధి నాటక ప్రక్రియను మరింత సుసంపన్నం, బలోపేతం చేసాయి. హష్మీ హత్య గావింపబడ్డ రెండవ రోజే అయన భార్య మలయశ్రీతో సహా జనమ్ కళాకారులు అదే చోట అదే నాటకాన్ని తిరిగి ప్రదర్శించారు. ఆనాటి ఆ ప్రదర్శనని సుమారు 500 మంది కవులు, కళాకారులూ, రచయితలు, మేధావులు తిలకించారనీ, విధ్వంసం జరిగిన వీధుల్లో మౌన ప్రదర్శన జరిపారని ఆనాటి పత్రికలు రాశాయి. నేడు హష్మీ లేడు, కానీ ఆయన స్థాపించిన 'జనమ్' ఉంది. 2023లో 'జనమ్' అర్ధ శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంది. వీధి నాటకాన్ని ప్రజల చెంతకు తీసుకు వెళ్లాలనే ఆశయంతో 'జనమ్' సంచార నాటకశాలను సమకూర్చుకుని, కొన్ని వేల ప్రదర్శనలు ఇచ్చింది. 'జనమ్' 2007లో అమెరికాలోనూ, 2013లో యూకేలోనూ తన ప్రదర్శనలు ఇచ్చింది. నేడు సఫ్దర్ పేరు వీధి నాటకానికి, అభ్యుదయ కళలకి మారు పేరైంది.

ఆయన మరణం తరువాత సఫ్దర్ హష్మీ మెమోరియల్ ట్రస్ట్ (సహ్మత్) ఏర్పడి వివిధ కల్చరల్ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఆయన హత్యకు గురైన చౌరస్తాలో ప్రతి ఏటా ఆయన వర్ధంతిని జనమ్, వామపక్ష సంస్థలు కలిసి నిర్వహిస్తాయి. ఈనాడు ఆ ప్రజా కళాకారుడు భౌతికంగా కనుమరుగైనా అయన సృష్టించిన వీధి నాటకం సజీవంగా మన మధ్యనే ఉంది.

• పి. అరవింద కుమారి
(నేడు హష్మి 35వ వర్ధంతి)

రైతాంగానికి భూభారతి భరోసా

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రైతన్న సమస్యలను అర్థం చేసుకొని, తప్పుల తడకగా ఉన్న ధరణిని రద్దు చేస్తామని ప్రకటించింది. తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా దాన్ని పొందుపరిచి ప్రజల సమక్షంలో ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామని కాంగ్రెస్ పెద్దలు మాట్లాడినప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఫలితంగా ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరింది. ప్రజలకు ఇచ్చిన ఒక్కొక్క వాగ్దానం నెరవేర్చే క్రమంలో భాగంగా డిసెంబర్ 18న అసెంబ్లీలో ధరణిని రద్దుచేస్తూ, దాని స్థానంలో నూతన ఆర్ఓఆర్–2024 భూమాత బిల్లును తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రవేశపెట్టారు. అసెంబ్లీలో దీని విధి విధానాలపై చర్చ జరిగింది. ధరణి కన్నా భూమాత మరింత మెరుగైనదని వివరించిన తర్వాత ఈ బిల్లు ఆమోదం పొందింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ మొత్తానికి భూసర్వే చేయించాలనే అంశం చాలా ఆలోచింపజేసింది.

తెలంగాణ విస్తీర్ణం 1,12,000 చదరపు కిలోమీటర్లు... అంటే దాదాపు 2 కోట్ల 75 లక్షల ఎకరాల భూమి. దీనిలో కోటీ 60 లక్షల ఎకరాలు వ్యవసాయ భూమి, 66 లక్షల ఎకరాలు అటవీ భూమి, మిగిలినవి గ్రామకంఠాలు, పట్టణాలు, దేవాలయ మాన్యాలు, వక్ఫ్, ఇనాం, శిఖం కింద ఉన్నాయి. ఈ లెక్కలన్నీ కూడా ఉజ్జాయింపు లెక్కలే కానీ, వాస్తవమైన రుజువులు చేయగలిగే స్పష్టమైన లెక్కలు లేవు. దీని కోసం ఎంత కష్టమైనా పొజిషన్ ప్రకారం సమగ్ర భూసర్వే చేసి తీరతాం, అనేక సమస్యలు పరిష్కారిస్తామన్న మంత్రి మాటలు భవిష్యత్తుపై నమ్మకం కలిగించాయి. అన్యాక్రాంతం, కబ్జా అయిన ప్రభుత్వ భూముల రక్షణ కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, దాని కోసం సీసీఎల్ఏను పటిష్ఠంగా ఏర్పాటుచేస్తున్నామని చెప్పి మంత్రి మరింత విశ్వాసాన్ని పెంచారు.

గత ధరణి పోర్టల్‌లో రహస్యానికి చోటు ఉండేది. నిజానికి తెలంగాణ భూ సమాచారం విషయంలో దాపరికాలు చారిత్రకంగా ఏమీ ఉండవు. ఏ ఊరిలోకి వెళ్లినా, ఈ భూమి ఎవరిది అని అడిగినా... పూర్తి సమాచారాన్ని ప్రజలు నోటితో చెప్పేస్తారు. అటువంటి తెలంగాణలో భూ విషయంలో రహస్యం చేయడం వెనక ఉన్న మతలబు ఎవరికీ అర్థం కాలేదు. నేడు భూమాతలో ప్రతి విషయాన్ని నిర్భయంగా, నిర్దిష్టంగా తెలుసుకునే అవకాశం కల్పించారు. రానున్న మూడు నెలల్లో మరిన్ని అంశాలను పొందుపరుస్తూ, నిపుణుల నుండి మరికొన్ని సూచనలు, సలహాలు తీసుకొని తెలంగాణ రైతాంగ సమస్యలను తీర్చేందుకు, సులువైన మార్గాలను పొందుపరిచేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించి, ప్రజల ఆశలను చిగురింపజేశారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా భూమాత పనిచేస్తే రైతులకు గొప్ప భరోసా కల్పించినట్లే అవుతుంది.

నేడు రైతు భరోసా సాయం మీద కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం పాస్ పుస్తకం ఉన్న ప్రతి మనిషికి రైతుబంధు ఇచ్చింది. కొండలు, గుట్టలు, ఫామ్‌హౌస్‌లు, కంచెలకు కూడా డబ్బులిచ్చింది. నేటి ప్రజాప్రభుత్వం కేవలం వ్యవసాయానికి మాత్రమే సాయం అందించాలనే దృఢమైన లక్ష్యంతో ఉన్నది. ప్రతి గ్రామంలోని విలేజ్ అగ్రికల్చరల్ ఆఫీసర్, శాటిలైట్ సహాయంతో పంట పొలాలను గుర్తించి నిజమైన రైతులకు సాయం అందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎకరానికి 7500 చొప్పున సంవత్సరానికి రెండుసార్లు ఈ సాయం అందించనున్నారు. ఇకపోతే 13 శాతం మంది రైతులు 10 ఎకరాలకు మించిన భూమున్నవారు ఉన్నారు. వారి విషయంలో కూడా ప్రభుత్వం సద్భావంతో ఉన్నది. ఇలా స్పష్టమైన, పటిష్ఠమైన అవగాహనతో పునర్నిర్మాణం అవుతున్న తెలంగాణ గ్రామీణ వ్యవసాయ రంగం, స్వర్ణయుగం వైపు ప్రయాణాన్ని కొనసాగిస్తుంది.

వారి వాదన న్యాయసమ్మతం కాదు

ఆంధ్రజ్యోతి దినపత్రికలో డిసెంబర్ 17న 30 మంది మాల మేధావులు కలిసి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై రాసిన వ్యాసం ప్రచురితమైంది. ఈ మేధావులు వర్గీకరణ కోసం ఏర్పడిన ఏకసభ్య కమిషన్‌కు సమర్పించిన నివేదిక సంక్షిప్త పాఠంగా ఈ వ్యాసాన్ని పేర్కొన్నారు. వర్గీకరణ మీద ఇప్పటికైనా మౌనం వీడినందుకు మాల మేధావులను అభినందించకుండా ఉండలేకపోతున్నాం. మౌనం కంటే అభ్యంతరకరమైన వ్యక్తీకరణే మేలని పెద్దలు అంటారు. కానీ, అంతకు మించిన అన్యాయాన్ని వీరు ఆశ్రయించారు.

1. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ మౌలిక స్వభావానికి విరుద్ధమని 341 ఆర్టికల్ స్ఫూర్తికి భిన్నంగా ఉందని మాల మేధావులు రాసారు. షెడ్యూల్డ్ కులాలకి సంబంధించిన మార్పులు పార్లమెంట్ వేదికగా జరగాలని అంబేడ్కర్ అన్నట్లు చెప్పారు. కానీ, అంబేడ్కర్ చాలా సందర్భాలలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఫలాలను పొందటం ప్రాథమిక హక్కుని వివరించారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటిన సుప్రీం కోర్టు రాజ్యాంగ మౌలిక స్వభావమైన రాజ్యాంగ పీఠికను ప్రస్తావిస్తూ ఆర్టికల్ 14, 15, 16లను దృష్టిలో ఉంచుకొని ఈ తీర్పును వెలువరించింది. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తిని మరింతగా పెంచుతుందనీ, సామాజిక న్యాయ భావనకు ఆలంబనగా ఉంటుందనీ న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 341 షెడ్యూల్ కులాల జాబితాలో ఒక కొత్త కులాన్ని చేర్చాలన్నా, అప్పటికే ఉన్న ఒక కులాన్ని తొలగించాలన్నా జరగవలసిన పార్లమెంటరీ విధివిధానాల గురించి మాట్లాడిందే తప్ప, వర్గీకరణ అంశాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. లేని విషయాన్ని మాల మేధావులు ఉన్నట్లుగా మాట్లాడుతూ, రాస్తూ సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. కనుక వర్గీకరణ అనే విషయం 341 ఆర్టికల్ స్ఫూర్తికి భిన్నంగా కాకుండా, ప్రజాస్వామికంగా ఉందని ఈ మేధావులు గుర్తించాలి.

2. మాల మేధావులు ఎస్సీ కులాలకు సంబంధించిన రిజర్వేషన్లను 'ఈక్విటీ' తాత్వికత పునాదిగా వర్గీకరణ చేయాలని పేర్కొన్నారు. సమాజాన్ని సరైన మార్గంలో నడిపించాల్సిన మేధావులు ఇంత గందరగోళంలో ఉండటం ఒక సామాజిక సమూహానికే నష్టం చేస్తుందని వారు గుర్తిస్తే బాగుంటుంది. మొదటి అభిప్రాయంలో వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని చెబుతూ, రెండో అభిప్రాయానికి వచ్చేసరికి వర్గీకరణ జరగాలని రాయటం... రెండు వైరుధ్యాంశాల చుట్టూ వారి గందరగోళ ఆలోచన కేంద్రీకృతమైందని తెలుపుతోంది.

3. వర్గీకరణను సూత్ర రీత్యా అంగీకరించని మాల మేధావులు, వర్గీకరణ చేయడానికి కావలసిన సూచనలను ప్రభుత్వానికి ఇస్తున్నట్లు పేర్కొనటం హాస్యాస్పదంగా ఉంది. సుప్రీంకోర్టే స్వయంగా 'ఎంపిరికల్' డేటా ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్‌ను వర్గీకరించుకోవచ్చని స్పష్టంగా తీర్పును ఇచ్చింది. కానీ, ఈ మేధావులు ఏదో కొత్త విషయాన్ని చెబుతున్నట్లుగా, ఆయా సామాజిక వర్గాల పురోగతి, వెనుకబాటు తనాన్ని అంచనా వేయాలని తమ వ్యాసంలో ప్రస్తావించారు.

4. గడిచిన 75 సంవత్సరాలలో రాజ్యాంగ ఫలాలను ఏయే కులాలు

> ఎస్సీ కులాలకు సంబంధించిన రిజర్వేషన్లను 'ఈక్విటీ' తాత్వికత పునాదిగా వర్గీకరణ చేయాలని మాల మేధావులు ప్రతిపాదించారు. అసలు వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని చెబుతూనే ఫలానా రీతిలో వర్గీకరణ చేయాలనడం సబబేనా?



ఎంత మేరకు పొందాయో గుర్తించాలని ఈ మాల మేధావులు రాసారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాలలోని నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్‌ను వర్గీకరించుకోవచ్చని సూచించింది. రాష్ట్ర స్థాయిలో జరగాల్సిన ఈ ప్రాసెస్‌కు లేని అడ్డంకులు సృష్టించి, వర్గీకరణ జరగకుండా చూడాలనే దురుద్దేశంతో దేశవ్యాప్త గణన జరగాలని తమ వ్యాసంలో రాసారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా కులాలను రాజ్యాంగబద్ధంగా అభివృద్ధిపరిచే విధివిధానాలను రూపొందించుకోవచ్చని రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తి పేర్కొంటుంది. దీనికి అనుగుణంగానే వర్గీకరణ అంశంపై రాష్ట్రాల నిర్ణయాధికారానికి సుప్రీంకోర్టు అవకాశం కల్పించింది.

5. మాల మేధావులు వర్గీకరణ కోసం చేసిన మరో ప్రతిపాదనను చూస్తే వారి స్వార్థపూరిత ఆలోచనా విధానం స్పష్టమవుతుంది. మాల, మాదిగ ఉప కులాలను A గ్రూప్‌లో పెట్టి మాల, మాదిగలను B గ్రూప్‌లో ఉంచాలని ప్రతిపాదించారు. గత 30 ఏళ్లుగా వర్గీకరణ ఉద్యమం నడుస్తున్నది మెజారిటీ జనాభా కలిగిన మాదిగలకు విద్య ఉపాధి, రాజకీయ అవకాశాల్లో అన్యాయం జరిగిందనే. రిజర్వేషన్లు కల్పించిన అవకాశాలలో 75 ఏళ్లలో మాలలు 70 శాతం ఉపయోగించుకున్నారని రామచంద్రరాజు, ఉషామెహ్రా కమిషన్ల నివేదికలు స్పష్టం చేసాయి. ఈ వాస్తవాన్ని పక్కన పెట్టి దోపిడి చేసినవారే మరింత దోపిడి చేయడానికి మాదిగలని తమతో పాటు ఉంచుకోవాలని కుట్ర పూరిత ఆలోచనలను చేస్తున్నారు. మాల, మాదిగలను ఒకే గ్రూప్‌లో పెట్టడం వల్ల తిరిగి మాలలే ఎక్కువ అవకాశాలను పొందడానికి ప్రాతిపాదికను సిద్ధం చేసుకున్నట్లు అవుతుంది. మాల, మాదిగల ఉపకులాలను మరో గ్రూప్‌లో పెట్టడం వల్ల ఇప్పటికే ఎదిగిన మాల ఉపకులాలు, మాదిగ ఉపకులాల అవకాశాలను కొల్లగొట్టే అవకాశం ఉంది. కనుక ఈ ప్రతిపాదన అశాస్త్రీయమైనది.

ఇన్ని భిన్నమైన వైరుధ్యాల నడుమ దళితుల మధ్య ఐక్యత సాధించాలంటే ఉన్న అవకాశాలను సమానంగా పంచుకోవటం ద్వారానే సాధ్యమవుతుంది. ఒకటి రెండు కులాలు, ఉన్న అవకాశాలను ఎప్పటికీ పొందుతూ పోతుంటే, విస్మరణకు గురైన కులాలలో అసంతృప్తి పెరుగుతుంది. ఈ అసంతృప్తే ఐక్యతకు అడ్డుగోడగా నిలబడింది. వర్గీకరణకు 30 ఏళ్లుగా కొందరు స్వార్థపర మాలలు అడ్డుపడటం వల్ల తెలుగు నేలమీద ఉజ్వలమైన పోరాటాలు చేసిన మాల, మాదిగల మధ్య మానసిక దూరం పెరిగింది. ఇప్పటికైనా వర్గీకరణను సూత్రప్రాయంగా అంగీకరిస్తూ కారంచేడు, చుండూరు లాంటి ఐక్య ఉద్యమాలను నిర్మాణం చేయాలని కాలం కోరుతోంది. దళితులకు భూమి, సంపద మీద హక్కు, రాజ్యాధికారం ఇప్పటికీ కలగానే మిగిలిపోయాయి. వీటిని సాధించాలంటే మన మధ్య ఉన్న అడ్డుగోడలను కూల్చవలసిన చారిత్రక సందర్భం ఇది.

– ప్రొఫెసర్లు ఇటిక్యాల పురుషోత్తం, కె.కుమార్, గోవర్ధన్, కాశీం, ముత్తయ్య, డప్పు కనకయ్య, కృష్ణ, మల్లేశం, డైసీ, సూరేపల్లి సుజాత, విద్యాసాగర్; డా. ఆరెపల్లి రాజేందర్, డా. మధు, డా. రాజ్‌కుమార్, డా. సబిత, డా. పసునూరి రవీందర్, డా. చీమ శ్రీనివాస్, డా. పరంజ్యోతి, డా. తిప్పర్తి యాదయ్య, డా. సిద్దెంకి యాదగిరి, డా. జిలుకర శ్రీనివాస్, డా. గోగు శ్యామల, డా. కదిరే కృష్ణ, డా. బాబురావు, డా. ప్రతాప్, డా. మేడి శ్రీనివాస్, డా. కొరెముల శ్రీనివాస్; బొజ్జ భిక్షమయ్య, పల్లెర్ల వీరస్వామి, జూపాక సుభద్ర, గుడిపల్లి నిరంజన్, కృపాకర్ మాదిగ, జాజుల గౌరి, మేరీ మాదిగ, దేవేందర్ ప్రసాద్, మేడి రమేశ్, డప్పోళ్ల రమేశ్ తదితరులు.

నయా 2025 జోష్

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు


రుద్రేశ్వరుడికి పెరుగుతో అభిషేకం చేస్తున్న అర్చకుడు


ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు


మధ్యకోటలోని శిల్పాల ఆవరణలో పర్యాటకులు


లక్నవరం ద్వీపంలోని కాటేజీలో పర్యాటకుల సందడి



- అర్ధరాత్రి నుంచే మిన్నంటిన సంబరాలు
- బేకరీలు, స్వీట్ షాపుల్లో జోరుగా అమ్మకాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ముంగిళ్లలో న్యూ ఇయర్ ముగ్గులు



భద్రకాళి ఆలయంలో భక్తుల సందడి

నూతన సంవత్సర వేడుకలను నగర ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే కేకులు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మహిళలు ఇళ్ల ముంగిట ముగ్గులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. బుధవారం ఉదయం నుంచే ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. నగరంలోని ప్రసిద్ధ భద్రకాళి, వేయిస్తంభాల ఆలయాలకు ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరంలో అందరూ బాగుండాలని, అంతా మంచే జరగాలని ప్రకృతి వైపరీత్యాలనుంచి తమను కాపాడాలని మొక్కుకున్నారు. మిఠాయిలు పంచుకొని పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

7

- హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్

ఫుల్ కిక్కు



రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు

- ఒక్కరోజే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 38 కోట్ల వ్యాపారం
- గ్రేటర్ వరంగల్‌లోనే రూ.14 కోట్ల మద్యం దిగుమతి
- కల్చరల్ ఈవెంట్స్‌తో మరింత పెరిగిన ఆదాయం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

వరంగల్ కమిషనరేట్	567
ములుగు	29
భూపాలపల్లి	26
మహబూబాబాద్	52

వరంగల్ క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా మద్యం ప్రియులు జోష్‌లో మునిగితేలారు. అర్ధరాత్రి ఒంటిగంట వరకు మద్యంషాపుల్లో విక్రయాలు జరిపేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో మద్యం ప్రియులకు సాధారణ రోజులకన్న న్యూ ఇయర్ కిక్కెక్కించింది. వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్‌లు, ఇళ్లలోనే కాకుండా ఆనందాలు పంచేందుకు గ్రేటర్ వరంగల్‌లో ఏర్పాటు చేసిన కల్చరల్ ఈవెంట్స్‌లలోనూ మద్యం విక్రయాలు భారీగానే జరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాధారణ రోజుల్లో సగటున రూ.9 కోట్ల నుంచి 10 కోట్ల మద్యం సేల్ అయ్యేది. కాగా, డిసెంబరు 31 ఒక్క రోజునే సుమారు రూ. 38 కోట్ల మద్యం అమ్మకాలు జరిపినట్లు అబ్కారీ అధికారులు వెల్లడించారు. ఈ నెల 30, 31 రెండు రోజుల్లో సుమారు రూ.70 కోట్ల మద్యం సేల్ అయినట్లుగా సమాచారం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరిగిన రూ. 38 కోట్ల సేల్స్‌లో ఒక్క గ్రేటర్ పరిధిలోని వైన్స్, బార్ షాపుల నిర్వహకులు రూ. 14 కోట్ల మద్యాన్ని దిగుమతి చేసుకున్నట్లుగా అబ్కారీ రికార్డులు చెప్తున్నాయి.

జోరుగా కల్చరల్ ఈవెంట్స్...

న్యూఇయర్ వేడుకలను పురస్కరించుకొని గ్రేటర్ వరంగల్‌లో ఏర్పాటు చేసిన కల్చరల్ ఈవెంట్స్‌లోనూ మద్యం ఏర్పాటు చేయడంతో

మిగతా 7వ పేజీలో...

బల్దియాలో జవాన్ల బదిలీలు

- 197 మందికి స్థానచలనం
- ఉత్తర్వులు జారీ చేసిన డిప్యూటీ కమిషనర్ జోనా

6

పులులను సందర్శకులకు చూపించరా..!

- జూపార్కుకు వచ్చి నేటికి నెల
- నిరాశతో వెనుదిరుగుతున్న సందర్శకులు

6


మగ పులి శంకర్, ఆడ పులి కరీనా

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలి


పల్లార్‌గూడలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద

- గ్రామాల్లో సిబ్బందిని అదనంగా నియమించండి
- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

సంగెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద చెప్పారు. బుధవారం సంగెం మండలంలోని పల్లార్‌గూడలో నిర్వహి స్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ ప్రభుత్వం ఇళ్లులేని వారందరికి గృహ వసతి కలిపించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో దరఖాస్తులను ఆహ్వానించి దరఖాస్తులను పరిశీలన చేయాలని ఆదేశాలు జారీచేయడంతో సర్వేను చేపట్టినట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్లో కొన్ని కుటుంబాలు జీవనోపాధికోసం ఇ తర ప్రాంతాల్లో నివాసం ఉండడం వలన సర్వేలో కొంత వెనకబడి ఉన్నామని, వారి వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. అలాంటి వారికి సమాచారం అందించి సర్వేకు సహకా రం అందించే విధంగా ఇందిరమ్మ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. గ్రా మాల్లో చేపట్టిన సర్వేను వేగవంతం చేయాలని, అవసరమైతే మరింత మంది సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో 50 శాంత కంటే తక్కువగా నమోదు అయిన గ్రామాలను జిల్లా స్థాయి అధికారులు సందర్శించి సర్వేను వేగవంతమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అక్కడే ఉన్న సీఈవో రాంరెడ్డిని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సర్వే పనులు చేయని వారిపై శాఖ పరమైన చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఈవో రాంరెడ్డి, సంగెం ఎంపిడివో కాసర్ల రవీందర్, సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్, పంచాయతి కార్యదర్శి అజయ్‌లు పాల్గొన్నారు.

నూతన సంవత్సరం రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినప్పటికీ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సిబ్బంది చేపట్టారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు సర్వేను సిబ్బంది కొనసాగించారు.

గవిచర్లను సందర్శించిన డీఎల్‌పీవో

మండలంలోని గవిచర్ల గ్రామాన్ని డీఎల్ పీవో వేదవతి బుధవారం సందర్శించి గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. గ్రామంలో ఇప్పటి వరకు అతి తక్కువ స్థాయిలో సర్వే పూర్తయిందని చెప్పారు. సర్వేను ఆమె దగ్గరుండి కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శరత్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'టెట్'

20 వరకు నిర్వహణ.. 9 ఆన్‌లైన్ కేంద్రాల్లో పరీక్ష

హాజరుకానున్న 22,615 మంది అభ్యర్థులు



వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) గురువారం నుంచి ప్రారంభం కానుంది. జనవరి 2 నుంచి 20వ తేదీ వరకు టెట్ పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ)ని ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. రెండు సెషన్లలో నిర్వహించే టెట్‌కు జిల్లాలో 22,615 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లా కేంద్రాలతో పాటు నర్సంపేటలో ఏర్పాటు చేసిన 9 ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 10రోజుల పాటు రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్ నిర్వహిస్తుండగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండవ సెషన్ జరుగనుంది. కాగా, ఉదయం 7.30 గంటల నుంచి, మధ్యాహ్నం సెషన్‌కు మధ్యాహ్నం 12.30 గంటల నుంచే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. జయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మోక్షిత్ కంప్యూటర్స్, అయాన్ డిజిటల్ జోన్, నోబెల్ టెక్నాలజీస్, బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, జయముఖి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్, తాళ్ళ పద్మావతి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, వశిష్ట టెక్నాలజీస్ తదితర కేంద్రాల్లో ఆన్‌లైన్ పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి

- భగ్గుమంటున్న ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులు
- సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటంతో నిరసన
- 26 రోజులుగా కొనసాగుతున్న దీక్షలు

6







క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ కడియం కావ్య

యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంపీ కావ్య

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీ కడియం కావ్య ఆవిష్కరించారు. బుధవారం హను మకొండలోని ఎంపీ నివాసంలో ఆమె నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధా నకార్యదర్శులు టి. కుమార్, సుజన్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం.దామోదర్, కోశాధికారి ఎంఏ. రవూఫ్, కార్యదర్శులు బి. వెంకటేశ్వర్‌రావు, ఎన్.శ్రీనివాస్, కె.రమేష్, జి. కరుణాకర్, నాయకులు టివి. సత్య నారాయణ, వి. నర్సింహరావు, డి. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

4న జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్టేట్ సోషల్ ఫోరమ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 4న జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు డీఈవో డెడ్రే వాసంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ నెల 21న నిర్వహించే రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌కు పంపిస్తామని ఆమె తెలిపారు.

ఒక్క పేజీ క్యాలెండ్‌ను రూపొందించిన విద్యార్థిని





ఒక్క పేజీ క్యాలెండర్, కూరపాటి లాస్య సత్యప్రకాశ్

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ నయీంనగర్ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూరపాటి సత్యప్రకాశ్‌రావు కూతరు కూరపాటి లాస్య సాయిప్రకాశ్ ఒక్క పేజీ క్యాలెండ్‌ను రూపొందించింది. 2025 సంవత్సరపు క్యాలెండర్‌ను ఆమె తన తండ్రి నుంచి నేర్చుకున్నానని తెలిపింది. కాగా, లాస్య నగరంలోని ఓ ప్రైవేటు స్కూల్లో ఏడవ తరగతి చువుకుంటుంది.

కోళ్ల పందెం స్థావరంపై పోలీసుల దాడి

తొమ్మిది మందిపై కేసు

ఖానాపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కోళ్ల పందెం స్థావరంపై మంగళవారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై రఘుపతి బుధవారం తెలిపారు. మండల కేంద్రం శివారులోని మల్లన్న బోడు సమీపంలో నిర్వహిస్తున్న కోళ్ల పందెం స్థావరంపై దాడి చేసి ఏడు పదెం కోళ్లు, పది సెల్ ఫోన్లు, మూడు కార్లు, మూడు బైక్‌లు, రూ.58,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అదేవిధంగా కోళ్ల పందెం నిర్వహిస్తున్న ఖానాపురం, బుధరావుపేట, మల్లంపల్లి, నర్సంపేటకు చెందిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

హ్యాండ్‌బాల్ ఇండియా జట్టు కోచ్‌గా విష్ణువర్ధన్



విష్ణువర్ధన్

వరంగల్ స్పోర్ట్స్, జనవరి1 (ఆంధ్రజ్యోతి) : లక్నోలో ఈ నెల 3నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే పురుషుల జట్టుకు ఇండియ కోచ్‌గా హనుమకొండ డీఎస్ఏ హ్యాండ్ బాల్ కోచ్ బొడ్డు విష్ణువర్ధన్ నియామితులయ్యారు. ఈ మేరకు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఇండియా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తేజ రాజ్‌సింగ్ బుధవారం నియామక ఉత్తర్వులను జారీ చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఖిలా వరంగల్‌కు చెందిన విష్ణువర్ధన్ ప్రస్తుతం హనుమకొండ జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జేఎన్ క్రీడా మైదానంలో హ్యాండ్‌బాల్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన నియామకానికి సహకరించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆనంద్ ఈశ్వర్‌పాండే, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ. జగన్‌మోహన్‌రావు, శాట్ సీఎండీ సోనీ బాలదేవి, శాట్ డిప్యూటీ డైరెక్టర్ జి. రవీందర్, హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్‌తో పాటు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ బాధ్యులకు, వివిధ క్రీడా సంఘాల ప్రతి నిధులకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

బల్దియాలో భారీగా జవాన్ల బదిలీలు

- 197 మంది జవాన్లకు స్థానచలనం
- ఉత్తర్వులు జారీ చేసిన డిప్యూటీ కమిషనర్ జోనా



వరంగల్ కార్పొరేషన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ శాని టేషన్ విభాగంలో చాలా కాలంగా పాతుకు పోయిన ప్రభుత్వ, ఔట్‌సోర్సింగ్, జవాన్‌ల బదిలీలు మూకుమ్మడిగా పెద్ద ఎత్తున జరిగాయి. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో జవాన్ల.. జులుం వారి అక్రమాలు, ఒకే చోట్ల తిష్ట వేసి ఉన్నారని వరుస కథనాలు ప్రచురితం కావడంతో అధికారులలో చలనం వచ్చింది. దీంతో డిసెంబరు 28న జాబితా సిద్ధం చేసి అధికారులు ఆమోద ముద్ర వేసినా జనవరి 1న బదిలీల లిస్ట్‌ను బయటకు విడుదల చేశారు. 197 మందిని స్థానచలనం కల్పించారు. 37 మంది ప్రభుత్వ జవాన్లు, 80 మంది ఔట్‌సోర్సింగ్ (ఒరిజినల్) జవాన్లు, 80 మంది ఔట్‌సోర్సింగ్ (వైట్‌కాలర్) జవాన్లను బదిలీ చేశారు. ఒక డివిజన్‌లో పని చేసినా వారిని మరో డివిజన్‌కు మెయిన్ రోడ్డు, డే, నైట్ డ్యూటీలు చేస్తున్న వారికి ప్రాంతాలు మార్చి బదిలీ ప్రక్రియ చేశారు. నెల రోజులుగా ఊగిసలాట మధ్య సాగుతున్న జవాన్ల బదిలీ కొత్త సంవత్సరంలో అధికారులు కొత్త నిర్ణయం తీసుకోక తప్పలేదు. గ్రేటర్ పరిధిలో 66 డివిజన్‌లలో వివిధ కాలనీలలో సుదీర్ఘ కాలం పాటు ఒకే చోట పని చేస్తున్న జవాన్లను బదిలీ చేస్తూ బుధవారం బల్దియా అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త జవాన్లు చాలా రోజులుగా ఒకే చోట పని చేస్తుండగా మరి కొందరిపై అవినీతి ఆరోపణలు రావడంతో బదిలి జరిగినట్టు తెలుస్తోంది.

అధికారులు వద్దకు పరుగులు..

చాలా సంవత్సరాల తర్వాత బదిలీలు జరగడంతో కొందరు ప్రభుత్వ, వైట్‌కాలర్ జవాన్లు బుధవారం బల్దియా అధికారులు వద్దకు పరుగులు పెట్టారు. కొందరువారి గాడ్‌ఫాదర్‌లైన ప్రజాప్రతినిధులు, మరి కొందరు బల్దియా అధికారులు వద్దకు వెళ్లి వారు మొర పెట్టుకున్నారు. మరో మూడు మాసాల తర్వాత డిప్యూటేషన్‌పై తీసుకుంటామని అంత వరకు గప్‌చుప్‌గా ఉండాలని అధికారులు చెప్పినట్టు కొందరు బదిలీ ఐన జవాన్లు చెప్పుకొస్తున్నారు. ఏదీ ఏమైన బల్దియాలో జవాన్ల బదిలీలు చర్చనీయాంశంగా మారింది.

వైట్‌కాలర్‌లకు డిప్యూటేటెడ్‌గా..

ప్రస్తుతం బల్దియా పరిధిలో సుమారు 200కు పైగా పీహెచ్ వర్కర్లు (పబ్లిక్ హెల్త్) వైట్ కాలర్ జవాన్లుగా వివిధ డివిజన్‌లలో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం 80 మందికి అధికారికంగా బదిలీ జరిగాయి. ఇంకా చాలా మందిని గుర్తించాల్సి ఉంది. ఈ క్రమంలో నగరంలో ని ఆయా ప్రాంతాల కార్పొరేటర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్‌లకు అనుకూలంగా ఉంటూ వైట్‌కాలర్‌లుగా చలా 'మణి' అవుతున్నారు. కాగా, వీరిని బదిలీ చేయాలంటే చాలా రోజులుగా అధికారులు తలలు పట్టుకున్నారు. పీహెచ్ వర్కర్లను వైట్‌కాలర్ చేశాము ఇప్పుడు జవాన్లుగా బదిలీలు చేస్తే పెద్ద సమస్య వచ్చి పడుతుందని కొద్ది రోజులుగా అధికారులు హైరానా పడ్డారు. దీంతో వైట్ కాలర్‌లకు కొత్త పోస్ట్ సృష్టించి ప్రస్తుతం జరిగిన బదిలీలలో డిప్యూటేటెడ్ ఔట్‌సోర్సింగ్ జవాన్ అని ప్రస్తావిస్తూ బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఐతే తమను అధికారులు జవాన్లుగా గుర్తించారు కాబట్టి కోర్టును ఆశ్రయించి పర్మినెంట్ జవాన్ కోసం సిద్ధం అవుతున్నట్టు సమాచారం.

పులులను సందర్శకులకు చూపించరా..!

జూపార్కుకు వచ్చి నేటికి నెల.. నిరాశతో వెనుదిరుగుతున్న సందర్శకులు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ హంటర్‌రోడులో ఉన్న కాకతీయ జులాజికల్‌పార్కు(జూపార్కుకు)కు డిసెంబరు 2న జిల్లా అటవీశాఖ అధికారులు రెండు పులులు.. మగ పులి శంకర్, ఆడ పులి కరీనాను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే జూపా ర్కుకు పులులు వచ్చి నేటికి(గురువారం) నెల రోజులు అవుతున్నప్పటికీ సందర్శకులకు జిల్లా అటవీశాఖ అధికారులు చూడడానికి అనుమతి ఇవ్వడం లేదు. పార్కుకు పులులు వచ్చాయని, ఇక దగ్గర నుంచి పులులను చూడొచ్చని భావించిన జిల్లా ప్రజలు పార్కుకు వస్తున్నారు. అయితే పార్కు కు రాగానే పులులు కనిపించకపోవడంతో వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. పులులు పార్కు కు వచ్చాయని తెలుసుకున్న ప్రజలు నెల రోజుల నుండి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. అయితే పులులను చూడకుండానే తిరిగి ఇంటికి వెళతున్నారు. ఇప్పటికైనా వెంటనే పులులను పార్కులో సందర్శకులు చూడటానికి అనుమతి ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

ఆర్చరీలో జిల్లాకు మూడు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

కాశిబుగ్గ, జనవరి1(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు వేట కొనసాగిస్తున్నారు. తాజాగా ఆర్చరీ పోటీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించి భేష్ అనిపించుకున్నారు. ఇప్పటికే వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జూడో, స్వర్ణంతో పాటు మరో మూడు పతకాలు సొంతం చేసుకున్నారు. ఖమ్మంలో జరిగిన ఆర్చరీ పోటీల్లో జిల్లాకు చెందిన రఫికా స్వర్ణ పతకాన్ని, అచ్యుత్ రజత, మన్సురా కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. రఫికా, మన్సురా దేశాయిపేటలోని ఏవీఆర్ అర్చరీ అకాడమి క్రీడాకారులు కాగా, అచ్యుత్ కల్లెడలోని ఆర్‌డీఎఫ్ ఆర్చరీ అకాడమి క్రీడాకారుడు. వీరిని డీవైఎస్‌వో సత్యవాణి, వివిధ క్రీడాసంఘాల ప్రతినిధులు అభినందించారు.



కుటుంబ సభ్యులతో మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న సీపీ

మల్లన్న సన్నిధిలో సీపీ అంబర్ కిషోర్ ఝా

కుటుంబ సమేతంగా స్వామి వారి దర్శనం

ఐనవోలు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జున స్వామిని బుధవారం రాత్రి వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సీపీ జన్మదినం సందర్భంగా ఆలయానికి చేరుకుని స్వామి వారికి అభిషేకం చేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం అర్చకులు సీపీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు సీపీ, కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనాలు చేసి లడ్డు, ప్రసాదం అందజేసి పట్టు వస్త్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మామునూరి ఏపీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై పస్తం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి



సాంబయ్య (ఫైల్)

వరంగల్‌సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల సుందరయ్యనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ లాసాని సాంబయ్య (41) మంగళవారం రాత్రి హనుమకొండ భీమారం ఎస్‌వీఎస్ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి సాంబయ్య భీమారం కిరాయికి వెళ్లగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం బలంగా ఢీకొనడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి 10.30 గంటల సమయంలో మృతిచెందారు. ఆయనకు భార్య అనిత, కుమారుడు సాయికిరణ్, కుమార్తె శ్రావణి ఉన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

- బైపాస్ రోడ్డులో భూమి పోతోందని మనస్తాపం
- కుటుంబసభ్యుల ఆరోపణ



రాజబీరయ్య (ఫైల్)

పోచమ్మమైదాన్, జనవరి1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ ఆరెపల్లికి చెందిన రైతు దయ్యాల రాజబీరయ్య (62) గుండె పోటుతో మృతి చెందాడు. రెండు రోజుల క్రితం ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా గుండె నొప్పి రావడంతో బుధవారం మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ వరంగల్ 'కుడా' అధికారులు ఇటీవల ప్రతిపాదించిన ఐఆర్‌ఆర్ బైపాస్ రోడ్డులో తన జీవనాధారమైన ఎకరం 20 గుంటల పంట భూమి పోతోందని, దాన్ని మార్చాలని కొన్ని రోజులుగా అందరితో కలిసి ఆయన అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, ఈ క్రమంలో తనకు గుండెపోటు వచ్చిందని, అధికారుల తీరు ఒక ప్రాణం తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

రేపు కేయూలో సావిత్రిబాయి పూలే జయంతి

కేయూ క్యాంపస్ జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేయూ దూరవిద్య కేంద్రం పూలే దంపతుల విగ్రహాల వద్ద జనవరి 3న సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిమల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొనాలని సూచించారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి

భగ్గుమంటున్న ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులు



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటంతో నిరసన దీక్షలు చేస్తున్న ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

హన్మకొండటౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేవరకు సమ్మె విరమించేది లేదని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు భీష్మించారు. 26 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు మండిపడుతున్నారు. బుధవారం ఏకశిలా పార్కు వద్ద చిరుధాన్యాలతో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటంతో దీక్షలు నిర్వహించారు. విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులైజ్ చేయాలని వేడుకున్నారు. దీక్షలను ఉద్దేశించి జాక్ నాయకులు మాట్లాడారు. ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులు చేస్తున్న దీక్షలకు అన్ని ఉపాధ్యాయ సంఘాలు, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలతో పాటు అధికార పక్షం ప్రజాప్రతినిధులు మద్దతు తెలు పుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించటంలో ఆంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. గత సంవత్సరం పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్‌రెడ్డి ఏకశిలాపార్కు వద్ద తమ దీక్షలను సందర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని చెప్పి ఇపుడు పట్టించుకోకపోవటం అన్యాయం అన్నారు. ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని చెప్పిన సీఎం సమస్యల పరిష్కారంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 19335 మంది ఎస్ఎస్‌లో 9 విభాగాలలో పనిచేస్తూ వెట్టిచాకిరికి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.3లక్షల రాష్ట్ర బడ్జెట్‌లో విద్యాశాఖ అభ్యున్నతికి కృషిచేస్తున్న ఎస్ఎస్ ఉద్యోగులకు కనీస బడ్జెట్ కేటాయించటం లేదని విచారం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ ప్రభు త్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని రెగ్యులైజ్ చేస్తామని ఆనాడు కేసీఆర్ మో సం చేశారని, ఇపుడు అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తమను మోసం చేస్తుందని మండిపడ్డారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకైనా మినిమం టైం స్కేల్ ఇవ్వకుండా తమతో ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయిస్తున్నాయన్నారు. కాగా, గురువారం అమరవీరుల స్థూపం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దొనికెల శ్రీధర్‌గౌడ్, షఫీ, కుమార్, రమేష్, ఎస్‌వోలు , పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, సీఆ ర్పీలు, ఐఈఆర్పీలు, డీఎల్ఎంటీలు, ఎంఐఎస్‌లు, డాటా ఎంట్రీ ఆపరేటర్, పీటీఐలు పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

అమీనాబాద్‌లో కేంద్రీయ విద్యాలయం కోసం స్థల పరిశీలన

చెన్నారావుపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమీనాబాద్‌లో ఇంటిగ్రేటెడ్, కేంద్రీయ విద్యాలయం పాఠశాలల నిర్మాణం కోపం బుధవారం స్థల పరిశీలనను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టడంపై ఉన్నతాధికారులకు నివేదికను అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఈడబ్ల్యూఎస్ ఈఈ నరేందర్‌రెడ్డి, డీఈ రవీందర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వీరారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, యూత్ అధ్యక్షుడు బండి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అమీనాబాద్‌లో పత్తినాయక్‌తండాను కలపాలి

పత్తినాయక్ తండాను అమీనాబాద్ గ్రామంలోనే వీలినం చేయాలని పత్తినాయక్ తండాకు చెందిన తండవాసులు బుధవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ పత్తినాయక్‌తండాలోని కొందరు వ్యక్తులు తమ కుటుంబ పాలన, వారసత్వపు రాజకీయాల కోసమే జీపీగా ఉండాలని అంటున్నారన్నారు. తండా వాసులు అందరు ఉమ్మడి అమీనాబాద్‌లో కలపాలని కోరుతున్నారన్నారు. తండాను జీపీగా మార్చడంతో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. పత్తినాయక్‌తండాను గతంలో మాదిరిగానే పరిపాలన అందించి అభివృద్ధి చేయాలన్నారు. తండావాసుల అభివృద్ధి కోసం తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కాక్యక్రమంలో దరావత్ రాములు రఘు, రవి, భీమా, నరేష్, రమేష్, స్వామి, విజయ్, గణేష్, శంకర్, గోపి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయకుండా ప్రకటనలు సిగ్గుచేటు

- ఎమ్మెల్యే కడియంను ప్రజలు ఛీదరించుకుంటున్నారు
- ఉప ఎన్నిక వస్తే ఓడించడానికి సిద్ధంగా ఉన్నారు..
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఏడాది పాలనలో ఏ ఒక్క అభివృద్ధి పనిచేయని ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెయ్యి కోట్ల అభివృద్ధి పనుల అని రోడ్లపై ప్రకటన బోర్డులు పెట్టుకోవడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజయ్య మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెబుతున్న కడియం అభివృద్ధి ప్రకటనలు చేశారు తప్పా ఏ ఒక్కటీ ప్రారంభించి, పూర్తిచేయలేదని ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో ఘన్‌పూర్‌ను మున్సి పాలిటీగా మారుస్తూ ప్రకటన వచ్చే క్రమంలో కడియం అడ్డుపడ్డాడని తెలిపారు. 100 పడకల ఆస్పత్రికి జీవో విడుదలైనప్పటికీ దానికి అడ్డుపడి తానేదో తెస్తున్నట్లు మాట్లాడడం విడ్డురంగా ఉందన్నారు. శ్రీహరికి చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామాచేసి కాంగ్రెస్‌పార్టీ నుంచి గెలుపొందాలన్నారు. ఇప్పటికే ఆయనను నియో జకవర్గంలో ప్రజలు ఛీదరించుకుంటున్నారని, ఉప ఎన్నిక వస్తే ఓడించాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు.

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతి రేకత వచ్చిందని సీఎంగా ఆయన అట్టర్‌ప్లాఫ్ అయ్యారన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు కనకం గణేష్, తాటికొండ సురేష్, బాబు, చింత శ్రీని వాస్, ఆకుల నర్సింహులు, గుండె మల్లేషం, అకారపు అశోక్, గుర్రం శంకర్, ఏసుబాబు, దేవయ్య, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి 6నుంచి 9వ తరగతి వరకు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని గాంధీనగర్ గిరిజన సంక్షేమ గురుకులపాఠశాల ప్రిన్సిపాల్ టి.కల్పన బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 ఆగస్టు 31 తేదీ వరకు 5వ తరగతి విద్యార్థులు 13 సంవత్సరాలు, 6వ తరగతికి 14 ఏళ్లు, 7వ తరగతికి 15 ఏళ్లు, 8వ తరగతికి 16 ఏళ్లు, 9వ తరగతికి 17 సంవత్సరాలు వయస్సు ఉండాలన్నారు. 'ఆన్‌లైన్'లో ఫిబ్రవరి 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉరి వేసుకుని ఒకరి బలవన్మరణం



కృష్ణ (ఫైల్)

గణపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చిలుమోజు కృష్ణ(26) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో బుధవారం ఇంటి వద్దే ఉన్నాడు. సాయంత్రం 7గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 ద్వారా భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలోనే కృష్ణ మృతి చెందాడు. మృతుడికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.



నయా జోష్


వేయిస్తంభాల ఆలయంలో బారులుదీరిన భక్తులు

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

- అర్ధరాత్రి నుంచే విఎన్నంటిన సంబరాలు
- బేకరీలు, స్వీట్ షాపుల్లో జోరుగా అమ్మకాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ముంగిళ్లలో న్యూ ఇయర్ ముగ్గులు

వరంగల్ కల్చరల్/హనుమకొండ కల్చరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): హ్యాపీ న్యూ ఇయర్ అంటూ యువత, చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా డిసెంబరు 31 అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆనందోత్సవాలతో ఆంగ్ల సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలు దాటగానే సెల్‌ఫోన్లలో మెస్సేజ్‌లు, ఫోన్లు చేసి శుభాకాంక్షలు తెలుపుకొని నూతన సంవత్సర వేడుకలను ప్రారంభించారు. కాలనీలు, అపార్ట్‌మెంట్స్‌ల్లో యువత కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. స్పీకర్లు ఏర్పాటు చేసుకొని డీజే పాటలతో అదరగొట్టారు. హ్యాపీ న్యూ ఇయర్ సంబరాలు నిర్వహించుకున్నారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఇళ్ల ముంగిట హ్యాపీ న్యూ ఇయర్ ముగ్గులు వేశారు. రంగురంగుల ఆకృతులతో ముగ్గులతో ముంగిళ్లు సందడిగా కనిపించాయి. తెల్లవారు జాము నుంచే యువతులు ఇళ్ల ముంగిట వివిధ రకాల ముగ్గులను ఆకర్షణీయంగా వేశారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే బేకరీలలో, స్వీట్ షాపుల్లో పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగాయి. బుధవారం ఉదయం నుంచి స్వీట్ షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

వేయి స్తంభాల ఆలయంలో...

నగరంలోని ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయం, భద్రకాళి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడి వేచి చూస్తే తప్పా దర్శనభాగ్యం కలగలేదు. వేయిస్తంభాల ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఉత్తిష్ట గణపతికి హరిద్రా కుంకుమ, విలేపనంతో 51 కిలోల పెరుగుతో అభిషేకం నిర్వహించారు. పాశుపద మూలమంత్ర యుక్తంగా రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయానికి తరలివచ్చిన భక్తుల క్యూలైన్లు కిలోమీటర్ పొడవు మెయిన్‌రోడ్డుకు తాకడం విశేషం. ఆలయానికి తరలివచ్చిన భక్తులకు మంచినీటి వసతితోపాటు క్యూలైన్‌లో ఇబ్బంది పడకుండా ఈవో వెంకటయ్య పర్యవేక్షించారు. గంగు ఉపేంద్రశర్మతోపాటు మణికంఠశర్మ, ప్రణవ్‌లు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. నగర సమీపంలోని ఎస్ఆర్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రంగనాయక స్వామి దేవాలయం కూడా భక్తులతో కిటకిటలాడింది. ఈ క్రమంలో బుధవారం వరంగల్ నగర వైష్ణవ మహిళా సేవా సమితి కృష్ణమీనన్ ఆధ్వర్యంలో గోదాదేవి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. నగర పరిసరాల్లోని న్యూశాయంపేట దోసె గుట్ట లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయాన్ని కూడా పెద్ద సంఖ్యలో భక్తులు సందర్శించారు. హనుమకొండ నక్కలగుట్టలోని వికాస తరంగిణి కార్యాలయంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని కీర్తిస్తూ మంగళహారతులతో స్వాగతించారు. అదే విధంగా హనుమకొండ బ్రాహ్మణవాడలోని దొప్ప లక్ష్మీనర్సిం హాస్వామి ఆలయం, శ్రీ హనుమద్‌గిరి సమేత రంగనాయక ఆలయం, చిన్నకోవెల, ఎక్సైజ్ కాలనీలోని వెంకటేశ్వర ఆలయం, రెవెన్యూ రామాలయం, కాజీపేటలోని శ్వేతార్క గణపతి ఆలయాలను కూడా భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.


భద్రకాళి ఆలయంలో భక్తులు

పూజలు చేసిన ఎమ్మెల్యే నాయిని..

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఈవో శేష భారతి, అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు గోపాల్ నవీన్‌రాజ్ కార్యకర్తలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, పలువురు వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కేక్‌లు, స్వీటు షాపులు కిటికిట

హనుమకొండ : పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే క్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాలో పలు రకాల వ్యాపారాలు జోరుగా సాగాయి. మాంసం, స్వీట్లు, కేక్‌లు, అలంకరణ వస్తువులు, వస్త్రాలు, రంగులు, బాణాసంచా, హోటళ్లు, ఇలా అన్ని రకాల వ్యాపార కూడళ్లు జన సందోహంతో నిండిపోయాయి. కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా కేక్‌లు, స్వీట్లు, కూల్ డ్రింకులు పెద్ద ఎత్తున అమ్మకమయ్యాయి. వీటి మీదనే రెండు జిల్లాల్లో రూ. 3 కోట్ల వరకు వ్యాపారం జరిగి ఉండవచ్చునని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. నూతన సంవత్సర వేడుకల్లో మద్యం తర్వాత ప్రధాన పాత్ర పోషించేది కేకులు, స్వీట్లు, శీతల పానీయాలే. కేకుల కోసం వారం రోజుల ముందు నుంచే అన్ని బేకరీ షాపులకు పెద్ద ఎత్తున ఆర్డర్లు వెల్లువెత్తాయి. కొత్త సంవత్సరం రోజు భారీ మొత్తంలో రకరకాల కేకులు అమ్మకమయ్యాయి. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని బేకరీ నిర్వాహకులు కొనుగోలుదారుల అభిరుచులకు తగ్గట్టు రకరకాల కేకులను తయారు చేసి అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. ఉదయం నుంచే కేకులు హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి. స్వీట్ల వ్యాపారం కూడా జోరుగా సాగింది. రెండు జిల్లాలో సుమారు రూ. 4 కోట్ల వరకు ప్రజలు ఖర్చుపెట్టి ఉంటారని భావిస్తున్నారు. కూల్ డ్రింక్‌లు కూడా పెద్ద ఎత్తున అమ్మకమయ్యాయి. కొత్త సంవత్సరం రోజు అలంకరణ వస్తువులు, ఇళ్ళ ముందు ముగ్గులు వేయడానికి రంగులు, గిఫ్టులు, కొత్త దుస్తులు, ఇతర వస్తువుల కొనుగోళ్ల వ్యాపారం కూడా రూ. 4 కోట్ల వరకు జరిగి ఉంటుందని లెక్కలు వేస్తున్నారు.

అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


భద్రకాళి ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు

ఓరుగల్లు ప్రజల ఆరాధ్య దేవత భద్రకాళి అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక రుసుముతో వీఐపీ దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. సర్వదర్శనం లైన్ మొదటి గేటు వరకు నిలిచింది. వాహనాలతో ప్రధాన రహదారి కిక్కిరిసి పోవడంతో చివరికి బైక్‌లను సైతం నిలిపివేశారు.


మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

కళకళలాడిన పర్యాటకం

- లక్నవరం, రామప్పకు టూరిస్టుల తాకిడి
- నెలరోజుల ముందే రిసార్టుల బుకింగ్.. కాటేజీలన్నీ ఫుల్
- మేడారంలోనూ భక్తుల కోలాహలం


లక్నవరం మూడో ద్వీపంలోని కాటేజీలో పర్యాటకుల సందడి

ములుగు/వెంకటాపూర్/మేడారం, జనవరి 1(ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలతో ములుగు జిల్లాలోని పర్యాటక కేంద్రాలు కళకళలాడాయి. వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయం, తాడ్వాయి మండలంలోని మేడారం, గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు వద్ద సందడి నెలకొంది. రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. లక్నవరంలో నెలరోజుల ముందే రిసార్టులు, కాటేజీలను బుక్ చేసుకున్నారు. ఇక్కడి లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్‌లలో విడిది చేసి ఎంజాయ్ చేశారు. ప్రత్యేక ఈవెంట్లేవీ నిర్వహించనప్పటికీ ప్రకృతి ఒడిలో సేదతీరారు. క్యాంప్ ఫైర్ వేసుకొని అర్ధరాత్రి వరకు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. తీరొక్క వంటకాలు, లిక్కర్‌తో ఛిల్ అయ్యారు. క్రిస్మస్ నుంచి వరుసగా సెలవులు రావడం మధ్యలో న్యూ ఇయర్ వేడుకలతో రిసార్టుల నిర్వాహకులకు బాగానే గిట్టుబాటైంది. మరో వారం రోజుల్లో సంక్రాంతి సెలవులు కూడా ఉండటంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చిన్నచిన్న హోటళ్లు, చిరు వ్యాపారాలు కూడా బాగా నడిచాయి.

పుణ్యక్షేత్రాల వద్ద సందడి

ప్రభుత్వం బుధవారం సెలవు ఇవ్వడంతో జిల్లాలోని రామప్ప, మేడారం, మల్లూరు క్షేత్రాలను భక్తులు దర్శించుకున్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా పెద్దసంఖ్యలో సందర్శించారు. నూతన సంవత్సర మొదటిరోజును పురస్కరించుకుని భక్తులు రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈఏడాది అంతా మంచి జరగాలని వేడుకున్నారు. అనంతరం ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని వీక్షించి ఆలయ చరిత్ర, విశిష్ట గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను తిలకించి ఆనందంగా గడిపారు. నూతన సంవత్సరం సందర్భంగా మేడారంలో భక్తుల సందడి నెలకొంది. వనదేవతల ప్రీతి రోజైన బుధవారం కావడం, న్యూ ఇయర్ సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో చేరుకుని తల్లుల దర్శించుకున్నారు

కాళేశ్వరంలో భక్తుల సందడి


క్యూలైన్‌లో నిలుచున్న భక్తులు

మహదేవపూర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని ఆంగ్లనూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భక్తులు బుధవారం భారీ సంఖ్యలో సందర్శించారు. ఉదయం నుంచే గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారి సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి మహన్యాసక రుద్రాభిషేకం, శుభానందదేవికి కుంకుమ పూజలు, సరస్వతిదేవికి పలు ప్రత్యేక పూజలు చేశారు. నూతన సంవత్సరం సెలవుదినం కావడంతో తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలు తరలివచ్చారు. ఈ సంవత్సరం మంచి జరగాలని నవగ్రహ, కాలసర్ప పూజలు నిర్వహించారు.

ఫుల్ కిక్కు...

5వ పేజీ తరువాయి

మద్యం ప్రియులు ఫుల్ ఎంజాయ్ చేశారు. ఈవెంట్స్ నిర్వహకులు ఏర్పాటు చేసిన వినోదాలను వీక్షించుతూ కుటుంబసభ్యుల మధ్య కిక్కును ఆస్వాదించారు. నక్కలగుట్ట హరిత హోటల్, సుబేదారిలోని ఆఫీసర్ క్లబ్, హంటర్ రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈవెంట్స్‌లలో మద్యం అందుబాటులో పెట్టడంతో మద్యం ప్రియులు కుటుంబసభ్యుల కేరింతల మధ్య ఈవెంట్స్ నిర్వహకులు వేసే పాటలకు స్టెప్పులు వేస్తూ మద్యం మత్తులో మునిగితేలారు. కుటుంబసభ్యులు సైతం కొత్త అనుభూతిని పొందుతూ మద్యం ప్రియులు వేసే నృత్యాలకు ఫిదా అయిపోయారు. ఇళ్లలో అయితే మద్యం కిక్కు చెప్పనక్కర్లేదు బ్యాచ్‌లర్ రూమ్స్‌లతో పాటు లాడ్జిలు, బాయ్స్ హాస్టల్స్‌లో మద్యం ప్రియులు ఎంజాయ్ చేశారు.

అడుగడుగునా తనిఖీలు

న్యూఇయర్ వేడుకల సందర్భంగా ఏలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు. గత ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధితో పాటు మిగతా జిల్లాలైన భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ ఏరియాల్లో పోలీసులు 9 గంటల కే రోడ్లెక్కి భద్రత కట్టుదిట్టం చేశారు. ప్రధాన కూడళ్లు, గల్లీలు, మండలాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి ఏలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేసి వాహనాలతో రోడ్డుపైకి వచ్చిన వాహనదారులకు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. కమిషనరేట్ పరిధిలో సుమారుగా 300 వాహనాలను సీజ్ చేశారు. వరంగల్ ట్రైసిటీలో ట్రాఫిక్ పోలీసులు 325 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా, మూడు జోన్‌లలో లా అండ్ ఆర్డర్ పోలీసులు 242 కేసులు నమోదు చేశారు. గతంలో ఉమ్మడి జిల్లాలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు ముందస్తుగా పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడంతో మందుబాబులు ఎవరు వాహనాలపై రోడ్డులపైకి రావడానికి ధైర్యం చేయలేదు. న్యూ ఇయర్ సందర్భంగా ఏలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 674 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి.


ప్రథమ స్థానంలో నిలిచిన హైదరాబాద్ జట్టు

ముగిసిన ఖోఖో పోటీలు

పురుషుల విభాగంలో హైదరాబాద్ జట్టు విజేత

కాశిబుగ్గ, జనవరి1 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. ఓ సిటీ స్టేడియంలో జరిగిన ఈ పోటీలు డిసెంబరు 30న ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన జట్లు తలపడ్డాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 64మంది రెఫరీలు పోటీలను నడిపించారు. చివరి రోజు బుధవారం రాత్రి వరకు పురుష, మహిళల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. పురుషుల ఫైనల్ మ్యాచ్ హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్ల మధ్య జరిగింది. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు విజేతగా నిలిచింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు ద్వితీయ స్థానానికి పరిమితమైంది. మూడు, నాలుగో స్థానాల్లో అదిలాబాద్, నిర్మల్ జట్లు నిలిచాయి. మహిళల విభాగంలో ఫైనల్ మ్యాచ్ కొమురంభీం అసిఫాబాద్, నల్గొండ జట్లు తలపడగా, అసిఫాబాద్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. నల్గొండ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల జట్లు మూడో, నాలుగో స్థానాలకు పరిమితమయ్యాయి. ఫైనల్ మ్యాచ్‌లు విద్యుత్ వెలుగుల మధ్య రాత్రి వరకు కొనసాగాయి.

శ్రీవారికి అక్షర నీరాజనం

416 కీర్తనలను ఆంగ్లంలోకి అనువాదం చేసిన రాజగోపాలాచారి

వేంకటేశ్వరుడి కీర్తనలతో పాటు ఇతర గ్రంథాల ట్రాన్స్‌లేషన్

సప్తగిరి సంపాదక బోర్డులో సభ్యుడిగా సేవలు



టీటీడీ ప్రచురించిన వల్లభాచార్య గ్రంథం ఆంగ్లానువాదం

హనుమకొండ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 'బ్రహ్మమొక్కటే.. పర బ్రహ్మమొక్కటే.. తందనాన భళా తందనానా..' వంటి అనేక కీర్తనలను తేట తెలుగులో అలతి పదాలతో అద్భుతంగా రాసి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని అన్నమయ్య అర్చించగా... ఆ కీర్తనలను విశ్వవ్యాప్తం చేసే కృషిలో భాగంగా వాటిని ఆంగ్లంలోకి అనువదించడం ద్వారా ఆచార్య మాడభూషణం రాజగోపాలాచారి శ్రీవారికి అనువాద నీరాజనం అర్పిస్తున్నారు. ఇప్పటికే 416 అన్నమయ్య కీర్తనలను ఆంగ్లంలోకి అనువదించిన రాజగోపాలాచారి స్వామి వారికి సంబంధించిన పలు గ్రంథాలను సైతం ఆంగ్లానువాదం చేస్తూ సాహితీ సేవలో తరిస్తున్నారు. అన్నమయ్య కీర్తనలపై లోతుగా పరిశోధన చేసిన ఆయన అనువాద ప్రక్రియలో తనదైన ముద్ర వేశారు. అన్నమయ్య కీర్తనలపై గతంలో వచ్చిన అనువాదాల్లో లోపించిన మన సంస్కృతి, సాంప్రదాయాల ఆత్మకు అద్దం పట్టిన రాజగోపాలాచారి ఆంగ్లానువాద ప్రస్థానం సుదీర్ఘం.



రాజగోపాలాచారి అన్నమయ్య కీర్తనల అనువాద పుస్తకం

సప్తగిరి సంపాదక బోర్డులో సభ్యుడిగా..

2012 నుంచి 2023 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం వివిధ భాషల్లో ప్రచురించే సప్తగిరి మాస పత్రిక సంపాదక బోర్డులో ఆంగ్ల సంచిక సంపాదక సభ్యుడిగా పనిచేశారు. 2018 నుంచి ఇప్పటి వరకు దాదాపు నిరంతరాయంగా శ్రీవారి వైభవాన్ని తెలిపే వివిధ వ్యాసాలు, అనువాదాలు ఆంగ్లంలో సుమారు 75 వరకు ప్రచురించారు. వీటిలో శ్రీవారి ఉత్సవాల గురించి, అన్నమయ్య సంకీర్తనలలో నాటి వైభవాన్ని, పద్మ సరోవరంలో అలమేలు మంగ ఆవిర్భవించే శోభను వర్ణించే వ్యాసాలు, యువతలో చైతన్యం నింపి వ్యక్తిత్వ వికాసం, సామాజిక స్పృహ గూర్చి తెలిపిన అన్నమయ్య సంకీర్తనలు కొన్నింటిని సీరియల్ రూపంలో విస్డెంట్ ఆఫ్ విజిడమ్ శీర్షికతో ప్రచురించారు. శ్రీవారి సేవకే అంకితమైన మరొక వాగ్గేయకారిణి తరిగొండ వెంగమాంబ రచించిన శ్రీ వేంకటాచల మహత్యం కావ్యం ఆంధ్రానువాదానికి ఆంగ్లానువాదం సీరియల్‌గా ప్రస్తుతం ప్రతీ నెల ప్రచురితమవుతున్నది.


పరిశోధన

కాకతీయ విశ్వవిద్యాలయంలో 38 సంవత్సరాలు పనిచేసి 2013లో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ పొందిన రాజగోపాలాచారి ఆంగ్ల సాహిత్యంలో ఎన్నో పరిశోధనా వ్యాసాలు, విమర్శనా గ్రంథాలు రాశారు. అలాగే తెలుగులో నుంచి ఆంగ్లంలోకి, ఆంగ్లం నుంచి తెలుగులోకి ఎన్నో అనువాదాలు చేశారు. ముఖ్యంగా ఉద్యోగ విరమణ తర్వాత భక్తిసాహిత్యం, అన్నమయ్య పదాలు, తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సంబంధించిన వ్యాసాలు, గ్రంథాలను సైతం అనువాదం చేశారు. 2015లో యూజీసీ ఎమిరేటస్ ప్రొఫెసర్‌గా ఎంపికై రెండు సంవత్సరాల ప్రాజెక్టులో భక్తిసాహిత్యంలో సమతావాదం, అన్నమయ్య సంకీర్తనల ప్రత్యేక పరిశీలన అన్న అంశంపై విస్తృత పరిశోధన చేశారు. అందులో భాగంగానే పలు అన్నమయ్య సంకీర్తనలను ఆంగ్లంలోకి అనువదించారు. 2020లో ఆథర్స్ ప్రెస్, న్యూఢిల్లీ ప్రచురించిన హై ఇన్ ది స్కై ఎట్ విష్ణుపదలో 208 సంకీర్తనల ఆంగ్లానువాదంతో పాటు వ్యాఖ్యానం కూడా జతపరిచారు. ఇటీవలే పూర్తిచేసిన మరో పుస్తకం సంకీర్తన ఆజ్ వర్షిప్‌లో మరో 208 సంకీర్తనల ఆంగ్లానువాదం, వ్యాఖ్యానాలతో పాటు తెలుగులో ఆ కీర్తనలు, క్లిష్టపదాల అర్థాలు జోడించడం విశేషం. మరికొన్ని సంకీర్తనల అనువాదాలు సేతు ఆన్‌లైన్ ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ పిట్స్ బర్గ్‌లో, మ్యూజిక్ ఇండి యా ఆన్‌లైన్ జర్నల్‌లో, సారస పత్రికలలో ప్రచురితమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ విభాగం 2015లో రాగోపాలాచారి అనువాదం చేసిన వల్లభాచార్యులు, ఉత్సవ్ ఆఫ్ లార్డ్ వేంకటేశ్వర అనే పుస్తకాలను ప్రచురించింది. ఇటీవల శ్రీవారి బ్రహోత్సవాలలో జీటి సూరి తెలుగులో రచించిన తిరుమల తిరుపతి క్షేత్ర వైభవం అనే గ్రంథానికి ఆంగ్లానువాదం ఎటర్నల్ గ్లోరీ ఆఫ్ తిరుమల తిరుపతి ష్రయిన్ పుస్తకాన్ని టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్యామలరావు ఆవిష్కరించారు.

సంక్లిష్టతలను అధిగమించి..

అన్నమయ్య రచనల్లో శాస్త్ర పరిజ్ఞానం, సంగీతం, వేదాంతం, పండుగలు, జానపదాలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు తొంగిచూస్తాయి. అనువాదకులకు వాటి పరిచయం అవసరం. తన అనువాదంలో వేంకటేశ్వర స్వామి అలమేలు మంగ వంటి పేర్లను, కేశవ నామాలను అలాగే తీసుకున్న రాజగోపాలాచారి వనజ నాభుడు, లక్ష్మీ కాంతుడు, ఆది దేవుడు వంటి వాటి అర్థాన్ని దృష్టిలో ఉంచుకొని అనువదించారు. అన్నమయ్య పదాల సంక్లిష్టతను వివరిస్తూ వడ్డికాసుల వాడే అన్న పదానికి కుబేరుడి అప్పు తీర్చడానికి భక్తుల నుంచి వడ్డీ రూపంలో కాసులను వసూలు చేసే స్వామి అని అర్థం స్ఫురించేట్టు అనువదించాల్సి వచ్చింది.

అన్నమయ్య ఆత్మావిష్కరణ




తిరుమల తిరుపతి క్షేత్రంపై ప్రచురించిన ఆంగ్లానువాదం

చూడడానికి ఎంతో సులభంగా కనిపించినా 15వ శతాబ్ది రాయలసీమ పలుకుబడి తెలిస్తే కానీ అన్నమయ్య ఉపయోగించిన భాషా ప్రయోగాలు పూర్తిగా అర్థంకావు. తెలుగులో ఎన్నో వ్యాఖ్యానాలు ఉన్నా ఆంగ్లంలో అన్నమయ్య అనువాదాలు కానీ, వ్యాఖ్యానాలు కానీ చాలా తక్కువగా ఉన్నాయని అంటారు రాజగోపాలాచార్య. ఇందులో విలియం జేజాక్సన్ ఏసాంగ్స్ ఆఫ్ త్రి సౌత్ ఇండియన్ సేంట్స్ వెల్చేరు నారాయణ రావు డేవిడ్ షుల్మన్‌ల్ గాడ్ ఆన్ ద హిల్, ఏకె రామానుజన్ వంటి అనువాద రచనలు ఆంగ్ల రచనల వలే కనిపిస్తాయి. కానీ, మన సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రతిబింబించవు. ఇవికాక ఎఎస్ మూర్తి, అడపా రామక్రిష్ణారావు, పప్పు వేణు గోపాలరావు, అంబికా అనంత్‌ల అనువాదాల్లో కొన్ని మన సంస్కృతిని ప్రతిబింబించినా ఆంగ్లానువాదం అంత రక్తికట్టవు. కొన్నేమో మూలాన్ని సరిగా అర్థం చేసుకోవు. అనువాదాలు చేయాల్సినవి చాలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మన సంస్కృతి, సంప్రదాయాల ఆత్మను ప్రతిబింబిస్తూ ఆచార్య రాజగోపాలచారి చేసిన అన్నమయ్య ఆంగ్లానువాదాలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ఐదు విభాగాలుగా...

అన్నమయ్య కీర్తనలను ఇంత వరకు శృంగార, ఆధ్యాత్మిక విభాగాలుగానే చూశారు. కానీ, రాజగోపాలాచారి వీటిని ఐదు విభాగాలుగా విభజించడం విశేషం. ఒకటవ విభాగంలో శ్రీ వేంకటేశ్వర వైభవం అన్న తరగతిలో స్వామి వారి పవిత్ర క్షేత్రాన్ని అర్చా రూప సౌందర్యాన్ని, నామ సంకీర్తనను, ఉత్సవాలను గూర్చి చెప్పి కీర్తనలను వివరించారు. రెండో దానిలో అలమేలు మంగ వైభవం గురించిన కీర్తనలలో ఆమె అతిలోక సౌందర్యాన్ని వివరించే కీర్తనలను, దేవీ దేవేరుల సంభోగ, వియోగ వర్ణన చేసే కీర్తనలను చేర్చారు. మూడో దానిలో శ్రీ రాముడు, కృష్ణుడు, నరసింహ స్వామి వంటి స్వామి వారి దశావతారాలను వర్ణించే కీర్తనలను చేర్చారు. నాలుగవ దానిలో విశిష్టాద్వైత విభాగంలో శరణాగతి, నైచ్యానుసంధానం, పరమాత్మ, జీవాత్మ, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రతిపాదనలు, ఆచారాలకు సంబంధించిన కీర్తనలను జోడించారు. చివరిదైన ఐదవ విభాగంలో అస్తిత్వ ఆధ్యాత్మిక దృష్టిలో జీవన అధ్యయనంలో జీవన స్వభావం, వ్యక్తిత్వ వికాసం, సామాజిక స్పృహ, సమతావాదంకు సంబంధించిన కీర్తనలు వివరించారు. వ్యక్తిత్వ వికాసాన్ని గూర్చిన అంశాలు త్రికరణ శుద్ధిగా చేసిన పనులను దేవుడు మెచ్చును.. వంటి కీర్తనల్లో కనిపిస్తాయి అంటారు.


మాడభూషణం రాజగోపాలాచారి

ఎమ్మెల్యే నాయినికి సన్మానం



ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న 57వ డివిజన్ గాంధీనగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు

హనుమకొండ సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని హనుమకొండ 57వ డివిజన్ గాంధీనగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్ కార్యాలయంలో కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యేను సన్మానించిన సభ్యులు ఆయనకు నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి సట్ల సత్తయ్య, ఉపాధ్యక్షుడు కమలాకర్‌రావు, సంయుక్త కార్యదర్శి ఆకుల శ్యాంప్రసాద్, డైరెక్టర్స్ అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామక్రిష్ణ, వెంకటరమణ, యాదగిరి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రైల్వే అధికారులు

కాజీపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో బుధవారం రైల్వే కాంట్రాక్టర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పి.సురేశ్ బాబు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. రైల్వే ఏఈ కృష్ణంరాజు, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ బిజయ్ శంకర్, సత్యారావు చేతులమీదుగా 100 మందికి దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా నిర్వాహకులు ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. యువత ప్రజాసేవ చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేశ్, ధనం, పాలడుగుల శివ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కిసాన్ సమ్మాన్ యోజన'తో రైతులకు మేలు

▸▸ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్

హసన్‌పర్తి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కిసాన్ సమ్మాన్ యోజన పథకంతో రైతులకు మేలని 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. బుధవారం గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి బస్టాండ్‌లో కార్పొరేటర్ చేతుల మీదుగా ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కిసాన్ సమ్మాన్ యోజన పథకం ద్వారా రైతులకు పంట పెట్టుబడి కింద రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, బీజేపీ రైల్వే బోర్డు మెంబర్లు మేకల హరిశంకర్, దాసరి రాజు, డివిజన్ అధ్యక్షుడు మారం తిరుపతి, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి పెద్దమ్మ నాగరాజు, ప్రధాన కార్యదర్శి మట్టెడ సుమన్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్యాంసుందర్, యువ మోర్చా అధ్యక్షుడు కె.సాయికిరణ్, నాయకులు రాజేశ్వర్‌రావు, కందుకూరి శ్రీకాంత్, పెద్దమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా పోరాటాల పార్టీ సీపీఐ


▸▸ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి



సీపీఐ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పోరాటాల ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించేది సీపీఐ పార్టీ మాత్రమేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో హనుమాన్ నగర్‌కు చెందిన పలువురు ఎంసీపీఐ పార్టీ నాయకులు సీపీఐలో చేరగా వారికి చాడా వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చాడా వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రావులు మాట్లాడుతూ సీపీఐ పార్టీ స్థాపించి 100సంవత్సరాలు పూర్తి కావస్తున్న నేపథ్యంలో గ్రామగ్రామాన ఎర్రజెండా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నేతలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ డి.విజయభాను

హనుమకొండ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రమాదరహిత డ్రైవింగ్ లక్ష్యంగా ఆర్టీసీ డ్రైవర్లు పనిచేయాలని వరంగల్ రీజినల్ మేనేజర్ డి. విజయభాను పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని వరంగల్ -1 డిపో, హనుమకొండ డిపోలో జాతీయ భద్రత మాసోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్ఎం విజయభాను మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సెల్‌ఫోన్ మాట్లాడకుండా డ్రైవింగ్ చేసి ప్రమాదాలను నివారించాలన్నారు. ప్రమాదాలను నివారించడానికి డ్రైవర్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ రోడ్డు ప్రమాదాల వల్ల 2024లో రూ.48 కోట్లు నష్టపరిహారం చెల్లించినట్లు తెలిపారు. డీఎంలు వి.మోహన్‌రావు, బి.ధరమ్‌సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

▸▸ కేక్‌లు కట్ చేసి పంపిణీ



వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న టీచర్స్‌కాలనీ ప్రతినిధులు



వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో కేక్ కట్ చేస్తున్న నవ తెలంగాణ వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.అజీమ్

వడ్డెపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వివిధ డివిజన్లలో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కేక్‌లు కట్ చేసి స్నేహితులు, కుటుంబ సభ్యులు, కాలనీ వాసులకు పంపిణీ చేసుకున్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్‌లోని ప్రగతిమిత్ర టీచర్స్ కాలనీ ఫేస్- 1 లో గల కమ్యూనిటీ హాల్‌లో న్యూ ఇయర్ వేడుకల్లో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పింగిళి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కనకదుర్గా కాలనీలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి పుష్పగుచ్ఛాలను ఇచ్చి శుభాకాంక్షలను తెలిపారు. టీచర్స్ కాలనీ అభివృద్ధికి ఎంపీ కోటా నుంచి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. వారి వెంట కాలనీ ప్రతినిధులు డాక్టర్ ఇమ్మడి పుల్లయ్య, డోలి రాజలింగం, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, వీరారెడ్డి, చిర్ర రఘుపతిరెడ్డి, మధూకర్, స్వరూప, భానుమతి, శ్రీనివాస్ ఉన్నారు.

- హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో నూతన సంవత్సర వేడుకలను ప్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ కేక్ కట్ చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్ సభ్యులకు స్వీట్ బాక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు గోకారపు శ్యామ్, బొడిగె శ్రీను, కే దుర్గాప్రసాద్‌రావు, యంసాని శ్రీనివాస్, సంపెట సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, వలిశెట్టి సుధాకర్, పొడిశెట్టి విష్ణువర్ధన్, నయీంపాషా, మంచాల రాజు, కమటం వేణుగోపాల్‌తో పాటు వివిధ యూనియన్ల నేతలు, డెస్క్, ఫొటో, వీడియో జర్నలిస్టులు పాల్గొన్నారు.

- గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్ కుమార్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మందోటి మహేందర్ పటేల్, బీజేపీ డివిజన్ ఇన్‌చార్జి బండి హరీష్ ముదిరాజ్, కుడా మాజీ డైరెక్టర్ భూక్య శంకర్ తదితరులు న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకొని వేర్వేరుగా కేక్‌లను కట్ చేసి పంపిణీ చేశారు.

- కాజీపేట : కాజీపేట అల్ఫా ఓమెగా చర్చిలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికి మంచి జరగాలని క్రీస్తును ప్రార్థించినట్లు చెప్పారు. అనంతరం బిషప్ జి.జాన్ మార్కండేయ, బ్రదర్ నిఖిల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు విజయ శ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్, నాయకులు ఎంపీ రాజు, సమత, అంకూస్, పులి అనిల్, నాయకులు పాల్గొన్నారు.

- హసన్‌పర్తి : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని బుధవారం పలువురు కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర నరేందర్‌గౌడ్, ఎర్రగట్టు దేవస్థానం కమిటీ మాజీ చైర్మన్ బూర సురేందర్ గౌడ్, డీఆర్‌డీఏ మాజీ డైరెక్టర్ గజాల గోవర్ధన్, మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ తంగెళ్లపల్లి తిరుపతి, మాజీ మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, ఆరెల్లి వెంకటస్వామి, పెద్దమ్మ నర్సింహరాములు, గొర్రె కిరణ్, సాయిని రామరాజు, పెద్దమ్మ సురేష్, మూల తిరుపతిగౌడ్, జన్ను రవీందర్, వింజమూరి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

- హనుమకొండ కలెక్టరేట్ : బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావులు కేక్‌కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని టీఎన్‌జీవోస్ యూనియన్ నాయకులు బుధవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీఎన్‌జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కేంద్ర సంఘం కార్యదర్శి రామునాయక్, కార్యవర్గ సభ్యులు మోయిజ్‌తో పాటు అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

- వరంగల్ మెడికల్ : ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో నవ తెలంగాణ వికలాంగుల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.అజీమ్ మాట్లాడుతూ దివ్యాంగులకు ఏ సమస్య వచ్చినా రాష్ట్ర కమిటీ తరుపున వారికి అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల ఫోరం నాయకులు మండల వేణుగోపాల్, బండి చక్రపాణి, గ్రై సతీష్, బత్తిని రాజు, రచ్చ శ్రీధర్, నీలం రాజు, ఎండి.సాధిక్, చెన్నూరి మహేశ్, దీకొండ సాయిరాం, పోరండ్ల సంపత్, ఆడెపు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్‌కు మాతృవియోగం

కేయూ క్యాంపస్ జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డైరెక్టర్, సీడీసీ అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంకు మాతృవియోగం జరిగింది. రామచంద్రం మాతృమూర్తి వల్లూరి పోచమ్మ (95) బుధవారం ఉదయం 7.45 గంటలకు కన్నుమూశారు. కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలు ఎదుర్కొంటున్న పోచమ్మ చికిత్స పొందుతూ మృతి చెందారు. పోచమ్మకు ప్రొఫెసర్ రామచంద్రంతో పాటు తమ్ముడు, మరో ముగ్గురు అక్కా చెల్లెల్లు ఉన్నారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం సాల్వపూర్ గ్రామంలో బుధవారం సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి.

పోచమ్మ మృతిపై కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, వర్సిటీ అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రెటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, ఎస్డీఎల్‌సీఈ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ వెంకట గోపీనాథ్, డాక్టర్ వి. జగన్, డాక్టర్ పూజారి సుభాష్, సూపరింటెండెంట్ పోలేపాక ప్రతాప్ పాషా, డాక్టర్ అకునూరి సుదయ్య, డాక్టర్ గజ్జెల మల్లేశ్, డాక్టర్ వంగాల సుధాకర్, డాక్టర్ పులి కోటేశ్వర్‌రావు, డాక్టర్ మెత్కూరి అంజయ్య తదితరులు అంత్యక్రియలకు హాజరైయ్యారు.

అవయవ దానానికి శ్రీనివాస్ దంపతుల అంగీకారం



అంగీకార పత్రాలను చూపుతున్న ప్రొఫెసర్ శ్రీనివాస్ దంపతులు

వరంగల్ మెడికల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో మైక్రో బయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న హనుమకొండ గోపాల్‌పూర్ అరుణోదయ కాలనీకి చెందిన డాక్టర్ ముంజం శ్రీనివాస్, ప్రియాంక దపంతులు మరణానంతరం తమ పార్థీవ దేహాలను మెడికల్ విద్యార్థుల వైద్య విద్య కోసం కేఎంసీ అందిస్తామని అంగీకారం తెలిపారు. బుధవారం తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ప్రతినిధులకు సమాచారం అందించగా ఆదర్శ దంపతుల నుంచి అంగీకార పత్రాలను వైద్య కళాశాలకు అందించి, ప్రశంసాపత్రాన్ని ప్రొఫెసర్ శ్రీనివాస్ దంపతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నేత్ర, శరీర అవయవ దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొన్రెడ్డి మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పెల్లి ఉపేందర్‌రెడ్డి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి, అరుణోదయ కాలనీ అధ్యక్షుడు డాక్టర్ బొట్ల ఆంజనేయులు, మునిగాల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 68 మందిపై కేసు

మట్టెవాడ జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కాశిబుగ్గ సెంటర్, తిలక్‌రోడ్డు, ఓసిటీ కాలనీ రోడ్డు, వెంకట్రామ జంక్షన్, హెడ్ పోస్టాఫీస్ జంక్షన్, ఎంజీఎం జంక్షన్‌లలో వరంగల్ ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 68 మందిని పట్టుకొని వాహనాలను స్వాధీనం చేసుకున్నామని వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.

- వరంగల్ చౌరస్తా: ఇంతేజార్ గంజ్ సీఐ షుకూర్ ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తా, హెడ్‌పోస్టాఫీస్, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ జంక్షన్, వెంకట్రామ జంక్షన్, మండిబజార్‌రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 10మందిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులునమోదు చేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాంపు కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



న్యూశాయంపేటలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

వడ్డెపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ సదాశివ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హనుమకొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో 56వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంక హరిబాబు, డివిజన్ నాయకులు చింత రమేష్ గౌడ్, భూక్య విజయ్, నిమ్మాని శేఖర్‌రావు తదితరులు ఉన్నారు. 57వ డివిజన్‌లోని గాంధీనగర్‌లో న్యూ ఇయర్‌ను పురస్కరించుకొని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సట్ల సత్తయ్యలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కాలనీ ప్రతినిధులు కమలాకర్‌రావు, శ్యామ్ ప్రసాద్, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, వెంకటరమణ, యాదగిరి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- హసన్‌పర్తి: మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోడ యుగేంధర్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ బుధవారం క్యాలెండర్‌ను ఆవిష్కరించి పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యాలయంలో బీఆర్ఎస్ 66వ డివిజన్ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్, పార్టీసీనియర్ నాయకులు గిన్నారపు రవీందర్, మేకల యుగేంధర్, డివిజన్ యూత్ అధ్యక్షుడు వల్లాల శ్రీకాంత్ గౌడ్, పుల్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

- న్యూశాయంపేట: పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ న్యూశాయంపేట 2025 నూతన క్యాలెండర్‌ను బుధవారం న్యూశాయంపేటలో ఆవిష్కరించారు.క్యాలెండర్ ఆవిష్కరణలో పద్మశాలీ సంఘం నాయకులు కోడం సంపత్, మురళీకృష్ణ, జానకిరాములు, సదానందం, నాగరాజు, రమేష్, రాజు, కోడం సతీష్, వెల్లండి రమేష్, కనుకుంట్ల కృష్ణ, ఆకుబత్తిని నర్సయ్య తోపాటు పద్మశాలీ కులస్థులు పాల్గొన్నారు.

- హనుమకొండ కల్చరల్: నూతన సంవత్సరం సందర్భంగా హనుమకొండలోని సాయిబాబామందిరంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజారులు కిశోర్ శర్మ, మణిశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించారు. అనంతరం మందిర ప్యాకెట్ క్యాలెండర్ ఎమ్మెల్యే ఆవిష్కరించి భక్తులకు అందించారు. కార్యక్రమంలో చైర్మన్ మతుకుపల్లిల హరిగోపాల్, ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, వెయ్యిగండ్ల రమేశ్, సురేశ్‌కుమార్, సాయిరాజు పాల్గొన్నారు.

రాఘవేంద్రనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఉపేందర్‌రెడ్డి



వడ్డెపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్‌లోని రాఘవేంద్ర నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా పబ్బతి ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కోటగిరి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ముచ్చర్ల నాగేశ్వర్‌రావు, సహ కార్యదర్శిగా మహ్మద్ అరిఫ్, కోశాధికారిగా దాసరి ఇంద్రసేనారెడ్డిను ఎన్నుకున్నారు.

న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా జనక్‌రాజ్




రెడ్డికాలనీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్ 2025 నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన బండి జనక్‌రాజ్ ఎన్నికయ్యారు. 1998లో స్థాపితమైన ఈ అసోసియేషన్ 27 సంవత్సరాలుగా తెలుగు ప్రజల సంస్కృతి, వారసత్వాన్ని రక్షించడంలో ముఖ్య భూమిక పోషిస్తుంది. బండి జనక్ రాజ్ నియామకపై రెడ్డికాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా న్యూ ఇయర్ వేడుకలు

▸▸ సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో పికెటింగ్

హనుమకొండ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగ కుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు బుధవారం సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సుబేదారి పోలీసు స్టేషన్‌పరిధిలోని న్యూ శాయంపేట, అదాలత్, కాళోజీ జంక్షన్, అంబేద్కర్ సెంటర్, వడ్డెపల్లి, ప్రధాన కూడళ్లల్లో పోలీసు పికేటింగ్ ఏర్పాటు చేసినట్లుతెలిపారు. స్టేషన్ పరిధిలోని నలుగురు ఎస్సైలతో పెట్రోలింగ్ నిర్వహించి భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని ప్రమాదాల భారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టి న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

కోలాహలంగా రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడలు



పరుగు పందెంలో పాల్గొన్న అథ్లెట్లు

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ అథ్లెటిక్స్, రెజ్లింగ్ క్రీడా పోటీలు క్రీడాకారుల మధ్య కోలాహలంగా కొనసాగుతున్నాయి. బుధవారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని బాస్కెట్‌బాల్ కోర్టులో ఏర్పాటు చేసిన రెజ్లింగ్ పోటీలను ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలనుప్రారంభించారు. అతిథ్య హనుమకొండ జేఎన్ఎస్‌లోని స్పోర్ట్స్ హాస్టల్‌కు చెందిన గణేష్ రెజ్లింగ్ 60కేజీల బరువు విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకంతో మెరిశాడు. ఈ సందర్భంగా అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ...రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు పతకాలు అందించాలని సూచించారు.

జిల్లా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్ కుమార్ మాట్లాడుతూ... రెండు రోజులుగా జరుగుతున్న అథ్లెటిక్స్, రెజ్లింగ్ పోటీలను వీక్షించేందుకు నగర వాసులు పెద్ద ఎత్తున స్టేడియానికి బారులు తీరుతున్నారన్నారు. రెజ్లింగ్‌లో కొన్ని విభాగాల్లో సెమీ ఫైనల్స్ పూర్తి చేసుకొని ఫైనల్స్‌కు చేరుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా అథ్లెటిక్స్ కొన్ని ఈవెంట్లు పూర్తి చేయడం జరిగిం దన్నారు. మైదానంలో క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా పర్యావేక్షిస్తున్నామన్నారు. అథ్లెటిక్స్‌లో రన్స్, జంప్స్, త్రోస్ విభాగాల్లో క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ పతకాల పంట పండించేందుకు కసరత్తులు చేస్తున్నారు. ఈ కార్యక్రంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి, అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, డీఎస్ కోచ్‌లు, పీడీలు, పీఈటీలు, టెక్నికల్ అఫీషియల్స్, సీనియర్ క్రీడాకారులు వివిధ జిల్లాలకు చెందిన అసోసియేషన్ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



లాంగ్ జంప్‌లో పాల్గొన్న క్రీడాకారులు

సెప్టిక్ ట్యాంకులో పడి ఒకరి మృతి

మడికొండ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సెప్టిక్ ట్యాంకులో పడి ఒకరు మృతి చెందిన ఘటన కాజీపేట మండలం భట్టుపల్లి శివారులో చోటు చేసుకుంది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన ప్రకారం.. ములుగు జిల్లా, మండలం పెద్దకోడెపాక గ్రామానికి చెందిన కేతిరి ఎల్లయ్య(54) భార్య 7 సంవత్సరాల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి హనుమకొండ జిల్లా అడ్వకేట్స్ కాలనీలో నివాసం ఉంటూ కూలీపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా కాజీపేట మండలం భట్టుపల్లి శివారులో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో మూత్ర విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంకులో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు కాగా ఒకరికి వివాహం చేశాడు. పెద్ద కుమార్తె పాలకుర్తి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ముత్యాల ముగ్గు

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు,
ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్,
జూబ్లీ హిల్స్,
హైదరాబాద్-500033.

ఈ-మెయిల్:
features@andhrajyothy.com



7 చుక్కలు
4 వచ్చేవరకు
సందుచుక్కలు



కె. రాములమ్మ, ఆత్మకూరు

కుండీలో కలబంద ఇలా...

కలబంద పలు అనారోగ్య సమస్యలకు ఔషధంలా పనిచేస్తుంది. సౌందర్య సాధనంగా కూడా కలబంద గుజ్జును వాడుతుంటాం. చర్మ వ్యాధులకు, కాలిన గాయాలకు, చుండ్రు నివారణకు, శిరోజాల పెరుగుదలకు, బరువు తగ్గడానికి ఈ మొక్కనే ఆశ్రయిస్తాం. ఇలా మనకు ఎన్నో రకాలుగా ఉపయోగపడే కలబంద మొక్కను ఇంట్లోనే సులభంగా పెంచుకోవచ్చు.



- కుండీలో మట్టి మరీ మెత్తగా కాకుండా మిశ్రమంగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే వేర్లు లోపలికి చొచ్చుకొని పోవడానికి వీలుగా ఉంటుంది. తోటమట్టిలో కొబ్బరి పీచు పొడి. తేలికపాటి సేంద్రీయ ఎరువు కలిపితే చాలు. ఈ రకం మట్టిలో కలబంద మొక్క తొందరగా నాటుకుంటుంది. అరటి పండు తొక్కను చిన్న ముక్కలు లేదంటే గుజ్జుగా చేసి మొక్క మొదట్లో వేస్తే పొటాషియం తదితర పోషకాలు అంది ఆకులు ఏపుగా పెరుగుతాయి. మట్టి కూడా సారవంతమవుతుంది. వెడల్పాటి కుండీలు మొక్క పెరుగుదలకు అనువుగా ఉంటాయి.
- కలబంద మొక్కకు ఎండ తగిలితే వేగంగా పెరుగుతుంది. కుండీలను బాల్కనీలో లేదంటే కిటికీ దగ్గర ఏర్పాటు చేసుకుంటే మొక్క గుబురుగా తయారవుతుంది. స్టడీ రూమ్ లేదా లివింగ్ రూమ్‌లో కుండీని ఉంచితే అహ్లాదకరంగా కనిపిస్తుంది. కానీ అంత వేగంగా మొక్క పెరగదు. ఎక్కువ కాలం జీవించి ఉంటుంది.
- కలబంద మొక్కకు పక్క నుంచి పిలకలు వస్తుంటాయి. వీటిని వేరు చేసి వేరే కుండీల్లో నాటుకుంటే మొక్కలు బాగా పెరుగుతాయి.
- దీనికి ఎక్కువ నీరు అవసరం ఉండదు. కుండీలో నీళ్లు నిల్వ ఉండకుండా అడుగు భాగంలో రంధ్రం చేయండి. లేదంటే మొక్క చనిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ మొక్కకు నీళ్లు ఎక్కువగా పోస్తే ఆకులు పసుపు రంగులోకి మారతాయి. వాటిపై మచ్చలు కూడా వస్తాయి. మొక్క వాలిపోతుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే కుండీని ఎండలో ఉంచండి. కొన్ని రోజులు నీళ్లు పోయకండి. ఆకులు ముదురు గోధుమ రంగులోకి మారితే మాత్రం మొక్కకు నీళ్లు అవసరమని గుర్తుంచుకోండి.
- మందంగా ముదురు ఆకుపచ్చ రంగులో ఉన్న ఆకులను మాత్రమే అవసరానికి కోసుకోండి. లేతగా ఉన్న ఆకులను కోస్తే మొక్క పెరుగుదల ఆగిపోతుంది.

తాటిబెల్లం తింటే...

తాటిచెట్టు నుంచి లభించే నీరాను ఉడికించి తాటి బెల్లాన్ని తయారు చేస్తారు. ఇది తేనె రంగులో లేదా నల్లగా ఉంటుంది. మనం రోజూ ఉపయోగించే బెల్లం, పంచదారల్లో కంటే తాటి బెల్లంలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. దీనిలో కొవ్వులు, ప్రొటీన్లు అత్యల్పంగాను తేమ, సుక్రోజ్, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, పాస్పరస్, జింక్ లాంటివి అత్యధికంగాను ఉంటాయి. చలికాలంలో ప్రతిరోజూ ఒక చెంచా తాటిబెల్లం తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

శీతాకాల సమస్యలకు



- తాటిబెల్లం తిన్న వెంటనే శరీరంలో వేడి పెరుగుతుంది. దీనివల్ల చలికాలంలో వచ్చే కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. జలుబు, దగ్గు, ఆస్తమా, మైగ్రేన్ సమస్యలకు మంచి ఔషధంలా పనిచేస్తుంది. ఒక కప్పు గోరువెచ్చని పాలలో ఒక చెంచా తాటి బెల్లం పొడి, పావు చెంచా మిరియాల పొడి కలుపుకొని తాగితే ముక్కులోని శ్లేష్మం తొలగిపోతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఊపరితిత్తుల పనితీరు మెరుగవుతుంది. తాటిబెల్లంలోని కాల్షియం, పొటాషియం, భాస్వరం ఎముకలను బలోపేతం చేస్తాయి.
- మహిళలు నెలసరి సమయంలో తాటిబెల్లం తింటే శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి పొత్తి కడుపు నొప్పి, కాళ్ల తిమ్మిర్లు, కడుపులో వికారం, నీరసం నుంచి ఉపశమనం కలిగిస్తాయి. తాటిబెల్లంలోని ఐరన్ రక్తహీనత రాకుండా కాపాడుతుంది. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది.

బరువు తగ్గడానికి

- తాటిబెల్లాన్ని తరచూ తింటూ ఉంటే శరీరంలో చేరే వ్యర్థ పదార్థాలన్నీ బయటికి వెళతాయి. శ్వాసకోశం, పేవులు, ఆహారనాళం, జీర్ణాశయం, కాలేయం, రక్తం పరిశుభ్రమవుతాయి. శరీరంలోని అదనపు నీటిని తొలగించి ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేస్తుంది. జీవక్రియలను వేగవంతం చేసి శరీర బరువును నియంత్రణలో ఉంచుతుంది.

జీర్ణక్రియకి

- తాటిబెల్లంలో పీచుపదార్థం అధికంగా ఉంటుంది. దీనివల్ల పేగు కదలికలు సజావుగా జరిగి మలబద్ధకం రాకుండా ఉంటుంది. భోజనం తరవాత చిన్న ముక్క తాటిబెల్లం తింటే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. తిన్న ఆహారపదార్థాలన్నీ తేలికగా జీర్ణమయ్యేలా చేస్తుంది. కడుపులో ఆమ్ల తత్వాన్ని నివారిస్తుంది.

చర్మానికి

- చలికాలంలో తాటిబెల్లం తినడం వల్ల చర్మం పొడిబారకుండా తేమతో నిండి ఆరోగ్యంగా కనిపిస్తుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచడంవల్ల ముఖంపై మొటిమలు, మచ్చలు, ముడతలు రావు. తాటిబెల్లంలోని గ్లైకోలిక్ యాసిడ్ చర్మానికి మంచి కాంతిని, నునుపుదనాన్ని అందిస్తుంది. దీనిలోని సి, బి విటమిన్లు చర్మానికి పోషణను అందిస్తాయి.

సంకల్పం



నాలుగు పదులు దాటిన వయసులో ఈత మొదలుపెట్టారు. కానీ నేడు గజ ఈతగాళ్లను మించిపోయారు. అలలకు ఎదురెళ్లి రికార్డులెన్నో బద్దలు కొట్టారు. యాభై ఒక్క ఏళ్ల వయసులో తాజాగా విశాఖ నుంచి కాకినాడకు బంగాళాఖాతంలో ఈత ప్రారంభించారు... **గోలి శ్యామల**. విరామ సమయంలో ఈ యాత్ర గురించి... ఒకప్పటి సాధారణ గృహిణి... ఇప్పుడు సాహసనారిగా మారిన ప్రస్థానం గురించి ఆమె 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

సప్తసాగరాలే లక్ష్యంగా..!

"ఈత కొలనులో నా ప్రయాణం చాలా విచిత్రంగా ప్రారంభమైంది. ఒకప్పుడు నాకు నీళ్లంటే చచ్చేంత భయం. అలాంటిది నేడు మహాసముద్రాల్లో ఈదేస్తున్నానంటే ఒక్కోసారి నాకే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. హార్మోన్ల అసమతుల్యత, వ్యాపారంలో నష్టంతో మానసిక ఒత్తిడుల నేపథ్యంలో తీవ్ర అనారోగ్యం పాలయ్యాను. కోమాలోకి వెళ్లాను. ఆసుపత్రి మంచం మీద గట్టి నిర్ణయం తీసుకున్నాను... తిరిగి హాస్పిటల్ గడప తొక్కకూడదని. అదే సమయంలో వేసవి శిబిరం జరుగుతుంటే వెళ్లాను. ఆరోగ్యకరమైన జీవన యానం కోసం ఈత ప్రారంభించాను. అలా అనూహ్యంగా మొదలైన ఈత నేడు నా జీవితంలో భాగమైపోయింది. ఎన్నో మైలు రాళ్లను దాటి... నాకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. మాది తూర్పుగోదావరి జిల్లా సామర్ల కోట అయినా రెండున్నర దశాబ్దాల కిందటే హైదరాబాద్‌లో స్థిరపడ్డాం.

అలా మొదలైంది...

మాకు ఒక యానిమేషన్ స్టూడియో ఉండేది. ఇంటి పనులతో పాటు స్టూడియో కూడా చూసుకొనేదాన్ని. ప్రొడ్యూసర్‌గా, క్రియేటివ్ డైరెక్టర్‌గా, రైటర్‌గా సొంతంగా చాలా యానిమేషన్ చిత్రాలు చేశాను. అందులో నష్టాలు రావడంతో స్టూడియో మూసేయాల్సివచ్చింది. అది నన్ను తీవ్ర మానసిక ఒత్తిడిలోకి నెట్టింది. దాంతోపాటు ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. వీటన్నిటి నుంచి బయటపడటానికి నేను ఎంచుకున్న మార్గమే స్విమ్మింగ్. ఈత కొలనులోకి దిగాక స్విమ్మింగ్‌పై ఇష్టం పెరిగింది. దీంతో పోటీల వైపు దృష్టి పెట్టి, సాధన మొదలుపెట్టాను. మూడు నెలలకే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. కాంస్య పతకం నెగ్గాను. అది నాలో ఆత్మవిశ్వాసం నింపింది. ఆ తరువాత నుంచి వెళ్లిన ప్రతి పోటీలో పతకాలు గెలుస్తూనే ఉన్నాను.

నిరుత్సాహపరిచినా...

ఈతలో మంచి నైపుణ్యం సాధించాక సాహస క్రీడలపై దృష్టి పెట్టాను. అందులో భాగంగానే 'ఓపెన్ వాటర్' ఈవెంట్‌లో పాల్గొన్నాను. ఇది జాతీయ స్థాయి పోటీ. 1.5 కిలోమీటర్లు. 2019లో విజయవాడ కృష్ణా నదిలో జరిగిన ఆ ఈవెంట్‌లో స్వర్ణ పతకం నెగ్గాను. ఆ తరువాత రెండేళ్లు కూడా తొలి స్థానం నాదే. ఓ ఆంగ్ల పత్రికలో ఇంగ్లిష్ చానల్ ఈదిన వ్యక్తి కథనం నాలో స్ఫూర్తి నింపింది. సప్త సముద్రాల్లో ఈత కొట్టాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. నా లక్ష్యం గురించి చెబితే సహచరులు తీవ్రంగా నిరుత్సాహపరిచారు. నా వయసుకు అంతటి సాహసం తగదని కొందరు సలహాలు ఇచ్చారు. అవేవీ పట్టించుకోలేదు. ఆత్మవిశ్వాసంతో అడుగులు వేశాను. అదే ఉత్సాహంతో అత్యంత క్లిష్టమైన బంగాళాఖాతంలోని పాక్ జలసంధిని ఈదాను. శ్రీలంకలోని తలైమన్నారు నుంచి తమిళనాడులోని ధనుష్కోటి వరకు 30 కిలోమీటర్ల దూరం ఇది. ఈ ఘనత సాధించిన తొలి తెలుగు మహిళను నేనే. అది నాలో ఎనలేని స్ఫూర్తి నింపింది. అదే ఏడాది అమెరికాలోని 36 కిలోమీటర్ల కాటలినా చానల్‌ను ఈదాను.



ఘనతలు ఎన్నో...

నా ఈ ప్రస్థానంలో ఎన్నో అవార్డులు అందుకున్నాను. రికార్డులు అధిగమించాను. 'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, అబ్దుల్ కలాం వరల్డ్ రికార్డ్స్, ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నా పేరు నమోదయింది. తెలంగాణా ప్రభుత్వం నుంచి 'అవుట్‌స్టాండింగ్ అచీవ్‌మెంట్' అవార్డు, 'వండర్ ఉమన్' అవార్డులు అందుకున్నాను. గత ఏడాది భారత్ ఒలింపిక్ సంఘం నుంచి కూడా పలు పురస్కారాలు నన్ను వరించాయి. ఇవన్నీ నాలో స్ఫూర్తి రగిలిస్తాయి.

ఆ స్ఫూర్తితో...

లక్షద్వీప్‌లో పర్యాటక అభివృద్ధికి ప్రధాని మోదీ ప్రచారం నాకు ప్రేరణనిచ్చాయి. దానికి నావంతు ప్రయత్నంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో లక్ష ద్వీప్‌లో కిల్తాన్ ద్వీపం నుంచి అరేబియా మహాసముద్రంలో 38 కిలోమీటర్ల దూరంలో ఉన్న కద్మత్ ద్వీపానికి ఈత కొట్టాను. ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిని నేనే. లక్షద్వీప్ పర్యాటక శాఖ, ఇతరుల మద్దతుతో దీన్ని పూర్తి చేశాను. అంతకుముందు కోల్‌కతా భగీరథ నదిలో 81 కిలోమీటర్లు, బిహార్‌లోని గంగా నదిలో 13 కిలోమీటర్లు ఈదాను.

విశాఖ నుంచి కాకినాడకు...

ప్రస్తుతం విశాఖ నుంచి కాకినాడకు బంగాళాఖాతంలో 150 కిలోమీటర్లు ఈదడానికి సిద్ధమయ్యాను. దానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు తీసుకున్నాను. గత నెల 28న విశాఖ రామకృష్ణా బీచ్ వద్ద ఈ సాహస యాత్ర ప్రారంభమైంది. బుధవారానికి వంద కిలోమీటర్లు పూర్తయింది. వాతావరణం అనుకూలిస్తే ఈ నెల 4న పూర్తికావచ్చని అనుకొంటున్నాను. సముద్రంలో ఈతకు ప్రతికూల పరిస్థితులు ఎదురవడంవల్ల కాస్త ఆలస్యమైంది. ప్రతిరోజూ సూర్యోదయానికి ఈత ప్రారంభిస్తాను. సూర్యాస్తమయానికి ఆపేసి, రాత్రి విశ్రాంతి తీసుకొంటాను. నాకు సహకారంగా నేవీ బోటు వెంట వస్తోంది. గతంలో ఈ దారిలో ఈదినవారు ఎవరూ లేరు. నదులు ఈదేవారు కనిపిస్తుంటారు కానీ... మహాసముద్రాల్లో ఈదేవారు చాలా అరుదు. అదీ మహిళలు ఎవరూ లేరనే చెప్పాలి."

• ఆర్వీ రమణమూర్తి, సామర్లకోట

నేస్తాల అక్షర యజ్ఞం



"ఒకసారి సంపాదిస్తే మనతోనే ఉండేది, ఎవరూ తీసుకోలేనిదీ, ఎంత పంచినా తరగనిది విద్య మాత్రమే. ఎన్నో కారణాలతో విద్యకు దూరమవుతున్న వారిలో భరోసా కల్పించాలనే చిన్న ప్రయత్నం మాది" అంటారు అదితి శ్రీవత్సన్, నేహా గోవిందరాజన్. ఈ చెన్నై అమ్మాయిలు ఏర్పాటు చేసిన 'బ్లూ లిలాక్ ఫౌండేషన్'... పుస్తక విరాళాలు, ఇతర కార్యక్రమాలతో సర్కారు బడుల్లో చదివే అట్టడుగు వర్గాల పిల్లల వికాసానికి దోహదం చేస్తోంది.

"పుస్తకాలను విరాళంగా సేకరించి, పేద పిల్లలకు పంచాలనే ఆలోచనను నా స్నేహితురాలు అదితి శ్రీవత్సన్ చెప్పినప్పుడు... నేను సంకోచించాను. ఇలాంటి స్వచ్ఛంద కార్యక్రమాలను చేపట్టడానికి తగినంత వయసు మాకు లేదనేది నా అభిప్రాయం. అప్పుడు అదితి "సమాజానికి ఏదైనా సేవ చెయ్యాలంటే ముప్పయ్యేళ్లో, నలభయ్యేళ్లో రానవసరం లేదు. మనస్ఫూర్తిగా చేసినప్పుడు ఎలాంటి అనుమానాలు అవసరం లేదు" అంది. 'నిజమే కదా!' అనిపించింది. ఆలస్యం చెయ్యకుండా మా 'బ్లూ లిలాక్ ఫౌండేషన్'కు శ్రీకారం చుట్టాం" అని గుర్తు చేసుకుంది నేహా గోవిందరాజన్. చెన్నైలో పుట్టి, పెరిగిన ఈ పదిహేడేళ్ల అమ్మాయిలిద్దరూ మంచి స్నేహితులు. ప్లస్ వన్ విద్యార్థులు. పుస్తకాలంటే ఇష్టం. కనీస చదువులకు నోచుకోని పేద పిల్లలను చూసి ఇద్దరూ బాధపడేవారు. ఎలాంటి సాయమైనా విద్యకు సంబంధించినదే చెయ్యాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. కిందటి ఏడాది వేసవి సెలవుల్లో... తమ ఆలోచనలకు ఒక రూపం ఇచ్చారు.

తాతయ్య స్ఫూర్తితో...

"చదువుకొనే స్తోమత లేనివారికి ఏదైనా సాయం చేయాలనేది ఒక్కరోజులో నాకు కలిగిన ఆలోచన కాదు. సామాజిక ఒత్తిడుల కారణంగా మా అమ్మమ్మ అయిదో తరగతితోనే చదువు ఆపేయాల్సి వచ్చింది. ఈ సంగతి నాతో ఎన్నోసార్లు చెప్పి బాధపడింది. బాగా చదువుకోవాలనే కోరిక ఉన్నా... కుటుంబ, ఆర్థిక పరిస్థితుల వల్ల, మౌలిక వనరులు లేకపోవడం వల్లా ఎందరో తమ కలను నెరవేర్చుకోలేకపోతున్నారనే వాస్తవం నన్ను కలవరపెట్టేది. అయితే నావంతుగా ఏదో చెయ్యాలనే స్ఫూర్తి... రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ అధికారి అయిన మా తాతయ్య ఎ.ఆర్.శ్రీధర్ నుంచి పొందాను. "మనకు ఉన్నదాన్ని పదిమందితో పంచుకోవడం మన బాధ్యత" అని ఆయన చెప్పిన మాటలు నాలో నాటుకుపోయాయి. ఒక రోజు మా ఇంట్లో పాత పుస్తకాలను సర్దుతున్నప్పుడు... దాదాపు వందకు పైగా నా పాత తరగతుల పుస్తకాలు కనిపించాయి. అవన్నీ దుమ్ము కొట్టుకుపోయాయి. వాటిని అవసరం ఉన్నవారికి ఇస్తే ప్రయోజనం ఉంటుందనిపించింది" అంటోంది అదితి. నేహాతో కలిసి ఆ పుస్తకాలను ఒక అనాథాశ్రమానికి తీసుకువెళ్లింది. అక్కడ అట్టడుగువర్గాల అమ్మాయిలు కూడా ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఈ పుస్తకాలను స్నేహితులిద్దరూ పంచిపెట్టారు. ఆ పిల్లల్లో ఉత్సాహాన్ని, ఆనందాన్ని చూసిన తరువాత... ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలనుకున్నారు.



మొదట్లో భయపడినా...

తొలి ప్రయత్నంగా.. షోలింగనల్లూర్‌లోని ఒక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌కు వెళ్లారు. పుస్తకాలు విరాళాలుగా ఇవ్వాలని కోరుతూ వాటి సేకరణ వెనుక ఉద్దేశాన్ని వివరించారు. ఎలాంటి స్పందన వస్తుందోనని మొదట భయపడ్డారు. కానీ అక్కడ నివసిస్తున్నవారు ఉత్సాహంగా స్పందించారు. తమ దగ్గర ఉన్న పాత పుస్తకాలు, తమకు అవసరం లేదనుకున్న పుస్తకాలు ఇచ్చారు. "కొద్ది రోజుల్లోనే 350 పుస్తకాలు వచ్చాయి. వాటిలో పాఠ్య పుస్తకాల నుంచి కాల్పనిక సాహిత్యం వరకూ ఉన్నాయి. వాటిని ఒక బాలికల పాఠశాలకు అందజేశాం. మా గురించి విన్న వారు పిలిచి మరీ పుస్తకాలు ఇవ్వడం ఆరంభించారు" అని చెప్పారు అదితి, నేహా.. క్రమంగా స్థానికంగా పనిచేసే సంస్థలు, ఇంటి యజమానుల సంఘాల్లో వారు భాగస్వాములయ్యారు. ఏడాది కాలంలో దాదాపు 4,700కు పైగా పుస్తకాలను పాఠశాలలకు అందజేశారు. వీటివల్ల 3,000 మందికి పైగా పిల్లలు ప్రయోజనం పొందుతున్నారు. అంతేకాదు, ఆరు లైబ్రరీల ఏర్పాటుకు కూడా ఈ స్నేహితులు దోహదం చేశారు.

ఆంగ్లం... ఆర్థికం

"ఇప్పుడు ఫౌండేషన్ కార్యకలాపాల పరిధిని విస్తరించాం. ప్రధానంగా రెండు అంశాల మీద దృష్టి పెట్టాం. అవి ఆంగ్ల భాషలో నైపుణ్యం, ఆర్థిక అక్షరాస్యత. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎంతోమంది పిల్లలు ఇంగ్లీష్ విషయంలో ఇబ్బంది పడుతున్నారు. తప్పులు మాట్లాడతామనే భయంతో మాట్లాడడానికి సందేహిస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచడం కోసం కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆంగ్ల సంభాషణా నైపుణ్యాలను పెంచడం కోసం విద్యావేత్తలతో కలిసి ఒక పాఠ్య ప్రణాళిక రూపొందించాం" అంటోంది అదితి. అలాగే "జీవితం సక్రమంగా సాగాలన్నా, సురక్షితమైన భవిష్యత్తు కావాలన్నా ఆర్థిక విషయాల్లో నైపుణ్యం ఎంతో ముఖ్యం. అందుకే ఇంటి బడ్జెట్, ఆదా చేసుకోవడం, ఆర్థిక మోసాల బారిన పడకుండా ఉండడం లాంటి అంశాలను బోధిస్తున్నాం" అని చెబుతోంది నేహా. 'బ్లూ లిలాక్ ఫౌండేషన్' చేపడుతున్న కార్యక్రమాలు పలువురు విద్యార్థులను ఆకర్షించాయి. వారు తమ పాఠశాలల్లో 'బుక్‌డ్రైవ్'లను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా మరింతమందికి పుస్తకాలు ఉచితంగా అందించడానికి వీలవుతోంది. "మా స్నేహితురాలు తనుశ్రీ... ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఫౌండేషన్ వ్యవహారాల్లో మాకు తోడుగా ఉంది. ఏడాది క్రితం ఫౌండేషన్‌ను ప్రారంభించినప్పుడు ఇంత స్పందన వస్తుందని మేమనుకోలేదు. ఇప్పుడు ఇదొక పూర్తిస్థాయి ఉద్యమంగా రూపుదిద్దుకుంది. అవసరం ఉన్న ప్రతి విద్యార్థికి సాయం అందించాలన్నది మా లక్ష్యం. దాని కోసం కృషి చేస్తాం" అని చెబుతున్నారు అదితి, నేహా.

కౌన్సెలింగ్

చలి కాలం పిల్లల రక్షణ

డాక్టర్! మా బాబుకు ఏడాది వయసు. చలి కాలంలో శ్వాసకోశ సమస్యలకు గురి కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఈ కాలంలో చల్లని వాతావరణం నుంచి ఎలా కాపాడుకోవాలి?

- ఓ సోదరి, హైదరాబాద్

చల్లని వాతావరణంలో వైరస్, బ్యాక్టీరియాలు విస్తృతంగా విస్తరించి ఉంటాయి. పైగా పసికందుల్లో వ్యాధినిరోధకశక్తి తక్కువ కాబట్టి తేలికగా ఇన్‌ఫెక్షన్లకు గురవుతూ ఉంటారు. శ్వాసకోశ సమస్యలతో పాటు, చెవికి సంబంధించిన ఇన్‌ఫెక్షన్లు, స్టమక్ ఫ్లూలు పసికందుల్లో సహజం.

ఆవిరి, సెలైన్ డ్రాప్స్ కీలకం

ఈ కాలంలో రాత్రుళ్లు గాలిలో తేమ పెరిగిపోతుంది కాబట్టి ముక్కులు మూసుకుపోయి, శ్వాస తీసుకోడానికి కష్టపడుతూ ఉంటారు. పాలు తాగడానికి కూడా ఇబ్బంది పడుతూ ఉంటారు. వేడి నీటి ఆవిరితో ఈ సమస్య సులభంగానే తగ్గిపోతుంది. కాబట్టి ఆవిరి పట్టే డబ్బాను ఉపయోగించి, చేత్తో ఆ ఆవిరి బిడ్డ ముక్కు వైపు వెళ్లేలా చేయాలి. అలాగే నాసికా రంధ్రాల్లో ఒకట్రెండు చుక్కల సెలైన్ డ్రాప్స్ వేసి, ముక్కును సున్నితంగా మర్దన చేయాలి. ఇలా చేస్తే, ద్రవాలు గొంతులోకి జారి, పసికందులు వాటిని మింగేస్తారు కాబట్టి ముక్కు దిబ్బెడ వదిలి సునాయాసంగా ఊపిరి పీల్చుకోగలుగుతారు. చాలా మంది తల్లితండ్రులు యాంటీ హిస్టమిన్ మందులు, యాంటీబయాటిక్స్ స్వయంగా కొనేసి, పిల్లలకు వాడడం మొదలుపెట్టేస్తూ ఉంటారు. ఇలా వైద్యులను సంప్రతించకుండా సొంతగా యాంటీబయాటిక్స్ వాడడం వల్ల సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లను పెంచిన వాళ్లవుతారు. అలర్జీ తత్వం కలిగిన పిల్లల్లో ఈ కాలంలో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు పదే పదే వేధిస్తూ ఉంటాయి. ఇలాంటి పిల్లలకు పీడియాట్రిషియన్లు సూచించిన మందులనే వాడుకుంటూ, అలర్జీలను పెంచే అంశాలను గుర్తించి వాటి నుంచి రక్షణ కల్పించాలి. ఉదయాన్నే సమస్యలు పెరుగుతూ ఉంటే, వెంటనే మందుల వాడకం మొదలుపెట్టి, ఇన్‌ఫెక్షన్ తీవ్రతరం కాకుండా నియంత్రించాలి.



హీటర్లు వాడకూడదు

చలికాలం పసికందులకు వెచ్చదనం కోసం మందపాటి స్వెటర్లు, దుప్పట్లు వాడుకోవాలి. చాలామంది పడగ్గదుల్లో హీటర్లను వాడుతూ ఉంటారు. కానీ విపరీతమైన చలితో కూడా ఢిల్లీ, కాశ్మీరు లాంటి ప్రాంతాల్లోనే వీటిని వాడుకోవాలి. చలి మధ్యస్థంగా ఉండే దక్షిణ భారతదేశంలో ప్రత్యేకించి పసికందుల కోసం హీటర్లను వాడుకోవలసిన అవసరం లేదు. వీటిని వాడడం వల్ల గాల్లోని తేమ మొత్తం మాయమైపోయి, పిల్లల ముక్కులోని స్రావాలు పొడిబారి, ముక్కు దిబ్బెడ మరింత పెరిగిపోతుంది. శ్వాస తీసుకోవడం కూడా మరింత సమస్యగా మారుతుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- ఐదేళ్ల కంటే చిన్న వయసు పిల్లలకు ఏడాదికోసారి ఇన్‌ఫ్లూయెంజా వ్యాక్సిన్ వేయించాలి
- తరచూ దగ్గు, జలుబుకు గురయ్యే పిల్లల్లో చెవి ఇన్‌ఫెక్షన్లు కూడా పెరుగుతాయి. ఆవిరి పట్టడం, యాంటీ హిస్టమిన్లతో ఈ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కాబట్టి యాంటీబయాటిక్స్ వాడకూడదు.
- చలికాలంలో పిల్లలకు ఫుడ్ పాయిజనింగ్ అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి బయటి పదార్థాలు తినకుండా పిల్లలను కట్టడి చేయాలి
- చర్మం తేమగా ఉండడం కోసం స్నానానికి ఒకటి రెండు గంటల ముందు స్వచ్ఛమైన కొబ్బరినూనెతో మర్దన చేయించాలి
- పసికందులకు రోజుకు ఒక్కసారి స్నానం చేయిస్తే సరిపోతుంది
- పసికందుల స్నానానికి ఆల్కలైన్ పిహెచ్‌కు బదులుగా న్యూట్రల్ పిహెచ్ కలిగిన సబ్బులు వాడుకోవాలి.

డాక్టర్ సి.వి.ఎస్ లక్ష్మీ,
సీనియర్ నియోనాటాలజిస్ట్ అండ్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్, క్లౌడ్ నైన్ హాస్పిటల్స్, కొంపల్లి, హైదరాబాద్

ద్విచక్ర వాహనాలే దొంగల టార్గెట్

» రద్దీ ప్రదేశాల్లో సెల్‌ఫోన్ల కోసం కొన్ని ముఠాల కాపు

» పోలీసులకు చాలెంజ్ విసురుతున్న దొంగలు

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పోలీసులెన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా దొంగలు మాత్రం అదను చూసి వారి చేతివాటం చూపిస్తున్నారు. అత్యంత చాకచక్యంగా దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు చాలెంజ్ విసురుతున్నారు. ఖరీదైన సెల్‌ఫోన్లు దొంగలకు వరంలా మారాయి. ఫోన్లు కొట్టేయడం అత్యంత సులభం కావడంతో రద్దీ ప్రదేశాల్లో సెల్‌ఫోన్ల దొంగతనాల కోసమే కొన్ని ముఠాలు కాపుకాస్తున్నాయి. గతంలో జేబు దొంగతనాలు ఎక్కువకాగా, మారుతున్న పరిస్థితుల్లో పర్సులు జేబుల్లో పెట్టుకునేవారే కరువై పోవడంతో సెల్‌ఫోన్ల చోరీనే దొంగలు అనుకూలంగా మార్చుకున్నారు. ఈ ఏడాది తెలంగాణ వ్యాప్తంగా 19,480 దొంగతనం కేసులు నమోదు కాగా, అందులో 10.06 శాతం సెల్‌ఫోన్ల దొంగతనాలే కావడం కీలకాంశమైంది. జేబుల్లోంచి సెల్‌ఫోన్లు కొట్టేయడం, నిర్మానుష్య ప్రాంతాల్లో వ్యక్తుల వద్ద నుంచి ఫోన్లు గుంజుకుని పారిపోవడం లాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసు అధికారులంటున్నారు. ఇక దొంగతనాల్లో సెల్‌ఫోన్ల కన్నా ప్రథమ స్థానాన్ని వాహనాల దొంగలు ఆక్రమిస్తున్నారు. మొత్తం దొంగతనాల్లో మోటారు వాహనాల దొంగల వాటా 39 శాతం ఉందని పోలీసు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మోటారు వాహనాల దొంగతనాల్లో ద్విచక్ర వాహనాలను కొట్టేస్తున్న కేసులే ఎక్కువగా ఉంటున్నాయి. ఈ ఏడాది 6,256 ద్విచక్ర వాహనాలు, 543 ఆటోలు, 168 కార్లు, 628 ఇతర వాహనాలు చోరీకి గురయ్యాయి. వాస్తవానికి తెలంగాణలో ప్రతి రోజు కొత్తగా 3,500 వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. రోజుకు 20 వాహనాలు చోరీ అవుతున్నాయి. దొంగలు ఎక్కువగా ద్విచక్ర వాహనాలనే టార్గెట్ చేస్తున్నారని పోలీసు అధికారులంటున్నారు.

'పుష్ప' నిర్మాతలను అరెస్టు చేయొద్దు

» హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటకు సంబంధించిన కేసులో సదరు చిత్ర నిర్మాతలను అరెస్టు చెయ్యవద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసుతో తమకు సంబంధం లేదని, చిక్కడపల్లి పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని ఆదేశించమని కోరుతూ పుష్ప నిర్మాణ సంస్థ.. మైత్రీ మూవీస్ యజమానులు యలమంచిలి రవిశంకర్, యెర్నేని నవీన్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ కే సుజన ధర్మాసనం ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టింది. తాము అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికీ సంధ్య థియేటర్ వద్ద దురదృష్టకర ఘటన జరుగుతుందని తాము ఊహించలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది న్యాయస్థానానికి విన్నవించారు. ప్రీమియర్ షో ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరగడానికి అన్ని చర్యలు తీసుకున్నామని, ప్రభుత్వ అనుమతి కూడా పొందామని తెలిపారు. జరిగిన ఘటనకు తమకు ఎలాంటి సంబంధం లేదని వివరించారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్లను అరెస్టు చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులు, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

డీజీపీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గతనెల 4న సంధ్య థియేటర్ వద్ద పుష్ప సినిమా ప్రివ్యూ సందర్భంగా అభిమానులను నియంత్రించడానికి పోలీసులు లాఠీచార్జీ చేయడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ)లో ఫిర్యాదు దాఖలైంది. ఒక న్యాయవాది ఇచ్చిన ఆ ఫిర్యాదును స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ.. తెలంగాణ డీజీపీకి నోటీసులు జారీ చేసింది. లాఠీచార్జీకు దారితీసిన పరిస్థితులు, సంబంధిత పోలీసులపై ఏం చర్యలు తీసుకున్నారు? వంటి అంశాలపై నాలుగు వారాల్లో నివేదికను అందచేయాలని డీజీపీని ఆదేశించింది.

900 కోట్లు తాగేశారు

మద్యం అమ్మకాల్లో కొత్త ఏడాది జోష్.. రెండు రోజుల్లో రికార్డు స్థాయి మద్యం అమ్మకాలు

» డిసెంబరులో 5వేలకోట్ల విక్రయాలు

» రాష్ట్ర తలసరి మద్యం వినియోగం రూ.1250



హైదరాబాద్/సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కొత్త ఏడాది సంబరాలకు మద్యం భారీగా కొనుగోలు చేసేశారు. మద్యం ప్రియులు రికార్డు స్థాయిలో కొనుగోళ్లు చేశారు. డిసెంబరు నెల చివరి 9 రోజుల్లో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. 9 రోజుల్లోనే రూ.2166 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. అంటే మందుబాబులు ఎంతలా 'స్తాగేశారో' అర్థం చేసుకోవచ్చు! వందలాది ఫాంహౌస్‌లు, హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, క్లబ్‌ల్లో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. యువత మద్యం మత్తులో ఉర్రూతలూగారు. మందు, విందుతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. రాష్ట్రవ్యాప్తంగా డిసెంబరు నెల చివరి 9 రోజుల్లో రూ.2166 కోట్ల మద్యం విక్రయాలు జరగ్గా.. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ లోనే రూ.757.2 కోట్ల విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఇక డిసెంబరులో రాష్ట్రంలో తలసరి మద్యం వినియోగం రూ.1250గా నమోదైంది. అంటే రాష్ట్ర జనాభా దాదాపు 4 కోట్లు ఉంటే.. ఒక్క నెలలో రూ.5 వేల కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. మద్యం విక్రయాల్లో ఇదో కొత్త రికార్డు అని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎక్సైజ్ అధికారవర్గాలు తెలిపిన అంచనా గణాంకాల ప్రకారం డిసెంబరు 31 వరకు ఎక్సైజ్ శాఖ రూ.3600 కోట్ల విలువైన మద్యాన్ని దుకాణాలకు విక్రయించింది. గరిష్ఠ విక్రయ ధర (ఎంఆర్‌పీ)పై ప్రభుత్వం 20 శాతం తక్కువకు లైసెన్స్ షాపులకు సరఫరా చేస్తుంది. వారి కమిషన్‌ను లెక్కిస్తే రూ.720 కోట్లు అవుతుంది. అంటే డిసెంబరులో మొత్తం మద్యం విక్రయాలు రూ.4320 కోట్లు జరిగాయి. కొత్త సంవత్సరం వేడుకల్లో సహజంగానే ఏటా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణా జరుగుతుంది. అలాగే రాష్ట్రంలోని మద్యం తయారీ కేంద్రాల నుంచి ప్రభుత్వ అనుమతుల్లేకుండా మద్యం బయటికి వస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ మద్యం, ఐదు జిల్లాల పరిధిలో గుడుంబా విక్రయాలు కలిపితే రూ.500 కోట్లకు పైనే ఉంటుంది. ఈ లెక్కన రాష్ట్ర ప్రజలు గత నెలలో మద్యపానం కోసం చేసిన ఖర్చు దాదాపు రూ.5 వేల కోట్లవుతుంది. ఇందులో డిసెంబరు 30, 31 తేదీల్లో మద్యం విక్రయాల వాటా దాదాపు రూ.900-1000 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

అడుగడుగునా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

కొత్త సంవత్సర వేడుకల్లో ఎలాంటి అపశృతులు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. మద్యం అనుమతులు ఉన్న ఈవెంట్ల నిర్వాహకులు మద్యం సేవించిన వారి కోసం ప్రత్యేకంగా డ్రైవర్లను ఏర్పాటు చేసుకోవాలని షరతులు విధించారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, హెచ్చరికలు చేసినా మందు బాబులు మాత్రం తగ్గేదే లేదంటూ రోడ్డెక్కారు. ఫుల్లుగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో బ్లడ్ అల్కహాల్ కౌంట్ (బీఏసీ) 51-100 వరకు వచ్చినవారు 554 మంది, 101-200 వరకు 474, 201-300 వరకు 85, 301-400 వరకు 22, 401-500 వరకు 8 మంది, కౌంట్ 500 దాటినవారు ఐదుగురు ఉన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 839 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వీరిలో బీఏసీ కౌంట్ 100-300 వరకు ఉన్నవారు 366 మంది, 300-500 వరకు వచ్చిన వారు 24 మంది, కౌంట్ 500 పైబడిన వారు నలుగురు ఉన్నారు. రాచకొండ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిలో అత్యధిక బీఏసీ కౌంట్ 339గా ఉంది. పంజాగుట్ట ద్వారకాపురిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో టీఎస్09ఈకే 3617 వాహనం నడుపుతున్న రియాజుద్దీన్‌ను ట్రాఫిక్ పోలీసులు పరీక్షించారు. బీఏసీ కౌంట్ 550 రావడంతో వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. ఇప్పటికే ఆ వాహనంపై హెల్మెట్ లేకుండా నడిపిన 10 చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి.

287 ఈవెంట్లకు ఎక్సైజ్‌శాఖ అనుమతి

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మద్యం పార్టీలకు రాష్ట్రవ్యాప్తంగా 287 ఈవెంట్లకు ఎక్సైజ్ శాఖ అనుమతిచ్చింది. వీటిలో అత్యధికంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 243 ఉండగా, ఇతర జిల్లాల్లో 44 ఉన్నాయి. ఈవెంట్‌లో పాల్గొనేవారి సంఖ్య, మద్యం వినియోగం ఆధారంగా ఈ అనుమతులను ఎక్సైజ్ శాఖ జారీచేస్తుంది. అనుమతి ధర రూ.5 వేల నుంచి రూ.2.50 లక్షల వరకు ఉంటుంది. మొత్తం ఈవెంట్లతో ఈసారి రూ.56.46 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. 2023లో 224 ఈవెంట్లకు అనుమతులివ్వగా రూ.44.76 లక్షల ఆదాయం వచ్చింది.

ఐదుగురికి డ్రగ్స్ పాజిటివ్!

డిసెంబరు 31 రాత్రి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో తెలంగాణ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. డ్రగ్ టెస్టింగ్ కిట్లతోపాటు మత్తుమందును పసిగట్టే పోలీసు జాగిలాలను రంగంలోకి దింపారు. పబ్బులు, రిసార్టులతో పాటు రోడ్ల మీద ఎన్‌సీబీ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వేర్వేరు ప్రాంతాల్లో మత్తుమందులు వాడిన ఐదుగురు యువకులు పట్టుబడ్డారని, డ్రగ్ టెస్టులో పాజిటివ్ రావడంతో వారిని అదుపులోకి తీసుకున్నామని ఎన్‌సీబీ డైరెక్టర్ సందీప్ శాండిల్య ఓ ప్రకటనలో తెలిపారు. మరోవైపు ఎక్సైజ్ పోలీసులు 30 నుంచి 40 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. మంగళవారం రాత్రి పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొందరు గంజాయితో పట్టుబడ్డారు. బంజారాహిల్స్ పరిధిలో రెండు చోట్ల 313 గ్రాముల గంజాయి దొరికింది. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఆర్ నగర్ పరిధిలో 3.37 కేజీల గంజాయిని పట్టుకున్నారు.

హైదరాబాదీల మనసు విశాలం!

హైదరాబాద్ ప్రజలు ఎంతో విశాల హృదయం కలిగిన వారు! మనోళ్లు చేసిన ఖర్చు, ఇచ్చిన టిప్పులతో ఈ విషయం వెల్లడైంది! కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి ఓ వ్యక్తి రూ.18 వేలు ఖర్చు చేశారని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వెల్లడించింది. అంతేనా ఓ ఆర్డర్ డెలివరీ చేసిన పార్ట్‌నర్‌కు రూ.1000 టిప్ ఇచ్చిన వ్యక్తి కూడా దేశం మొత్తం హైదరాబాద్‌లోనే ఉన్నారని తెలిపింది. బ్లింకిట్ అయితే దేశం మొత్తంమీద తమ ప్లాట్‌ఫామ్‌పై డెలివరీ పార్టనర్లకు టిప్‌ల రూపంలో డిసెంబరు 31న రూ.1.80 లక్షలు ఇచ్చారని.. హైదరాబాద్‌లో ఒక్కరే ఏకంగా రూ.2500 టిప్ ఇచ్చారని వెల్లడించింది.

బాలికల గురుకులాలను..

మహిళా ఐఏఎస్‌లు సందర్శించాలి

» ఇతర గురుకులాలు, కేజీబీవీలు, హాస్టళ్ల పర్యవేక్షణ అదనపు కలెక్టర్లకు

» ఒక్కసారైనా విద్యాలయాల్లో బస చేయాలి

» నివేదికలు సమర్పించాలి: ప్రభుత్వ ఉత్తర్వులు




హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాలు ప్రభావంతంగా నడవడానికి, నాణ్యమైన విద్యను అందించడానికి గాను ప్రభుత్వం మహిళా ఐఏఎస్ అధికారులు, అదనపు కలెక్టర్ల (స్థానిక సంస్థలు)కు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. బాలికల గురుకులాలను మహిళా ఐఏఎస్‌లు, ఇతర గురుకులాలు, కేజీబీవీలు, ప్రభుత్వ హస్టళ్లను అదనపు కలెక్టర్లు పర్యవేక్షించాలని నిర్దేశించింది. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్రంలోని మహిళా ఐఏఎస్ అధికారులు ఈ జనవరి నుంచి పదిహేను రోజులకొకసారైనా బాలికల గురుకుల విద్యాలయాలను సందర్శించాలని, ఈ సందర్శనల్లో ఒక్కసారైనా అక్కడే రాత్రి బస చేయాలని ఆదేశించింది. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి అక్కడి పరిస్థితులను పరిశీలించాలని సూచించింది. విద్యాలయాలు సరిగా పని చేయడంలో ఉన్న లోపాలను గుర్తించి, ఏడు రోజుల్లోగా గురుకుల విద్యాలయ సంబంధిత ఎస్సీ/బీసీ/మైనారిటీ/విద్యా శాఖలకు నివేదికను సమర్పించాలని ఆదేశించింది. విద్యాలయాల్లో మెరుగైన పరిస్థితులు కల్పించడానికి అవసరమైన సూచనలు చేయాలని తెలిపింది. ఈ సందర్శనలకు ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని వెల్లడించింది. అదనపు కలెక్టర్లు తమ జిల్లా పరిధిలోని గురుకులాలు, కేజీబీవీలు, ప్రభుత్వ హాస్టళ్లన్నింటినీ సందర్శించాలని ఆదేశించింది. మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, హాస్టళ్లలో భోజనశాలలు, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించాలని, నాణ్యమైన విద్య అందుతుందో లేదో చూడాలని పేర్కొంది. విద్యాలయాలు, హాస్టళ్ల సరుకుల కొనుగోలు కమిటీలకు అదనపు కలెక్టర్లే చైర్మన్లుగా వ్యవహరించాలని, విద్యార్థులకు ఆహార పదార్థాలు అందుతున్నాయో లేదో పరిశీలించాలని నిర్దేశించింది. పక్షం రోజులకొకసారైనా అదనపు కలెక్టర్లు విద్యాలయాల్లో రాత్రి నిద్ర చేయాలని ఆదేశించింది. ఆ సందర్భంగా విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకోవాలని తెలిపింది. ఆకస్మిక తనిఖీలు కూడా చేపట్టాలని ఆదేశించింది. మారుమూల ప్రాంతాల్లోని విద్యాలయాలపై ఎక్కువ ధ్యాస పెట్టాలని తెలిపింది. విద్యాలయాలను సందర్శించినప్పుడు పరిశీలించిన అంశాలపై నెలవారీ నివేదికలను రూపొందించాలని, వాటిని తమ కలెక్టర్లకు అందజేయాలని అదనపు కలెక్టర్లను ఆదేశించింది. కలెక్టర్లు కూడా ఈ నివేదికలపై నెలవారీగా సమీక్షించాలని తెలిపింది.

చిత్రజ్యోతి


SINCE 1965

నేడే షూటింగ్ ప్రారంభం




మహేశ్‌బాబు కథానాయకుడిగా దర్శక దిగ్గజం ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. వర్కింగ్ టైటిల్ 'ఎస్ఎస్ఎమ్‌బీ29'. దుర్గాఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్‌గా భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతుందా అని సినీ అభిమానులంతా ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు వారి నిరీక్షణకు తెరపడేలా ఉంది. నేడే ఈ సినిమాను హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభించనున్నట్లు తెలిసింది. కాగా, ఈ సినిమాకు 'గరుడ' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు టాక్. దాదాపు రూ.వెయ్యి కోట్లతో రెండు భాగాలుగా తెరకెక్కించే ఈ చిత్రంలో హీరోయిన్‌గా ప్రియాంక చోప్రాని ఎంపిక చేసినట్లు వార్తలొచ్చాయి. మొదటి భాగాన్ని 2027లో.. రెండవ భాగాన్ని 2029లో విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.


కేన్సర్ నుంచి కోలుకున్నా..



కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్ తన ఆరోగ్యం గురించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. ప్రస్తుతం అమెరికాలో చికిత్స తీసుకుంటున్న ఆయన.. కేన్సర్ నుంచి కోలుకున్నట్లు ఓ వీడియో విడుదల చేశారు. "కేన్సర్ సోకిందని తెలిస్తే ఎవరికైనా భయం సహజం. ఆ భయం నా నుంచి దూరం చేసేందుకు నా భార్య గీత, అభిమానులు అందించిన సహకారం మరువలేనిది. వారందరికీ రుణపడి ఉంటాను. చేతిలో ఉన్న సినిమాలు పూర్తిచేయడానికి చాలా కష్టపడ్డాను. ఓ వైపు కీమోథెరపీ చేయించుకుంటూనే '45' సినిమా షూటింగ్‌ను పూర్తి చేశాను. నా ఆరోగ్యం విషయంలో వైద్యులు అందించిన సహకారం మరువలేనిది. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. శివన్న భార్య గీత మాట్లాడుతూ "నా భర్త కేన్సర్‌ను జయించడం ఎంతో సంతోషాన్నిస్తోంది. ఆయన్ని అభిమానించే వారందరికీ ఇది తీపి కబురులాంటిది. త్వరలోనే కర్ణాటకకు తిరిగి వస్తాం" అని అన్నారు.

న్యూ ఇయర్.. న్యూ లుక్స్!







కొత్త సంవత్సరం ఆరంభమైంది. తెలుగు చిత్ర పరిశ్రమలో కొత్త ఆశలు, అంచనాలు కూడా మొదలయ్యాయి. ఇక సంవత్సరం తొలి రోజున కొత్త పోస్టర్లు, కొత్త లుక్స్ సందడి చేశాయి. చాలా రోజుల తర్వాత మళ్లీ పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు' చిత్రం కోసం 'మాట వినాలి' అంటూ ఓ పాట పాడారు. ఈ పాటను ఈ నెల 6న విడుదల చేస్తామంటూ చిత్ర నిర్మాణ సంస్థ ప్రత్యేక పోస్టర్ విడుదల చేసింది. అలాగే 'గేమ్ ఛేంజర్' సినిమాలో రామ్‌చరణ్, కియారా ఉన్న కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. రామ్ పోతినేని, భాగ్యశ్రీ కలసి నటిస్తున్న చిత్రంలోని హీరో హీరోయిన్ల ఫస్ట్ లుక్‌ను మైత్రీ మూవీస్ రిలీజ్ చేసింది. అలాగే నితిన్ నటిస్తున్న 'రాబిన్‌హుడ్', నాని నటిస్తున్న 'హిట్ 3', సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న 'జాక్' సినిమాల కొత్త స్టిల్స్ విడుదలయ్యాయి.







కీరవాణి గీతం.. ఇళయరాజా సంగీతం



రూపేష్ హీరోగా, రాజేంద్రప్రసాద్, అర్చన జంటగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'షష్టిపూర్తి'. ఇందులో ఆకాంక్ష సింగ్ కథానాయిక. ఈ సినిమా కోసం సంగీత దర్శకుడు కీరవాణి 'ఏదో ఏ జన్మలోదో ఈ పరిచయం' అంటూ ఓ పాటను రాయడం ఒక విశేషమైతే, ఇళయరాజా ఈ పాటకు స్వరపరచడం మరో విశేషం. ఇప్పటివరకూ 60కి పైగా పాటలను కీరవాణి రాసినా, ఇళయరాజా బాణీకి ఆయన పాట రాయడం ఇదే ప్రథమమని చిత్ర దర్శకుడు పవన్ ప్రభ చెప్పారు. చిత్రం షూటింగ్ పూర్తయి, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని, త్వరలో సినిమాను విడుదల చేస్తామనీ నిర్మాత రూపేశ్ చౌదరి చెప్పారు.

ఆసక్తి రేకెత్తించేలా...



రాజ్‌తరుణ్, రాశి సింగ్ నటిస్తున్న చిత్రం 'పాంచ్ వినార్'. బ్రహ్మాజీ, అజయ్ ఘోష్, శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రామ్ కడుముల దర్శకత్వంలో మాధవి, ఎమ్.ఎస్.ఎమ్.రెడ్డి నిర్మిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. కార్ టాప్‌పై రిలాక్స్ అవుతున్నట్లు ఉన్న రాజ్‌తరుణ్ ట్రెండీ లుక్.. సూట్ కేస్‌లోని డబ్బులు గాల్లోకి ఎగరడం సినిమాపై ఆసక్తిని రేకెత్తించేలా ఉన్నాయి.

గాంధీ బాటలో నడిచే బాలిక కథ



దర్శకుడు సుకుమార్ బండ్రెడ్డి తనయురాలు సుకృతి వేణి నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించారు. సుకుమార్ సతీమణి సబితా సమర్పకురాలిగా నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, శేష సింధూరావు నిర్మించారు. ఈ నెల 24న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకురాలు పద్మావతి మాట్లాడుతూ "గాంధీ సిద్ధాంతాల్ని ఆదర్శంగా తీసుకుని.. ఆయన బాటలో నడిచే ఓ పదమూడేళ్ల బాలిక కథ ఈ చిత్రం. తన పుట్టిన ఊరిని కాపాడుకోవడం కోసం ఈ బాలిక ఏం చేసిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సందేశాత్మక చిత్రం అందరి హృదయాలను కదిలిస్తుంది" అని చెప్పారు. కాగా, ఈ సినిమా ఇప్పటికే పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో పురస్కారాలు కైవసం చేసుకుంది. అలాగే, బాల నటిగా సుకృతి వేణి అవార్డు దక్కించుకోవడం విశేషం.

తెరపైకి ఒగ్గు కళ



తెలంగాణ జానపద కళా రూపం ఒగ్గు కళాకారుల జీవితాలు, వారి సంస్కృతి నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'బ్రహ్మాండ'. ఆమని, బలగం జయరాం, కొమరక్క, బన్నీ ప్రధాన తారాగణం. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేశ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తయిందని, ఈనెల చివరి వారంలో 'బ్రహ్మాండ' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని దర్శక నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి

పంత్‌పై వేటు.. గిల్‌కు చోటు?



సిడ్నీ: భారత్.. కొత్త ఏడాదిని విజయంతో ఆరంభించాలనుకొంటోంది. సిడ్నీలో జరిగే ఆఖరి టెస్ట్‌లో నెగ్గితే భారత్ 2-2తో సిరీస్‌ను సమం చేసే అవకాశం ఉంది. ఐదో మ్యాచ్ శుక్రవారం మొదలు కానుండగా.. చివరి రెండు రోజులు వర్షం కురవవచ్చని వాతావరణ శాఖ చెబుతోంది. ఇక నాలుగో టెస్ట్‌కు దూరమైన శుభ్‌మన్ గిల్‌కు అవకాశం కల్పించాలని మేనేజ్‌మెంట్ భావిస్తోందట. అదే జరిగితే రోహిత్ లేదా కోహ్లీలో ఒకరు బెంచ్‌కే పరిమితం కావాల్సిన పరిస్థితి. మరోవైపు నిర్లక్ష్యమైన షాట్లతో వికెట్ పారేసుకొంటున్న రిషభ్ పంత్, రాణించలేక పోతున్న పేసర్ సిరాజ్‌ను హెచ్చరించే విధంగా బెంచ్‌కే పరిమితం చేస్తారనే ఊహాగానాలు వెలువడుతున్నాయి.

వైశాలి..కాంస్య పతకధారి

వరల్డ్ బ్లిట్జ్ చెస్‌లో మూడోస్థానం

ఓపెన్ సంయుక్త విజేతలు కార్ల్‌సన్, నెపోమ్నియాచి



న్యూయార్క్ : ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షి‌ప్‌ను భారత్ ఘనంగా ముగించింది. బ్లిట్జ్ విభాగంలో మరో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.వైశాలి కాంస్య పతకంతో మురిసింది. తెలుగు తేజం కోనేరు హంపి ర్యాపిడ్ విభాగంలో స్వర్ణ పతకంతో అదరగొట్టిన విషయం విదితమే. ఇక పురుషుల విభాగంలో ప్రపంచ నెంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్, రష్యా గ్రాండ్‌మాస్టర్ ఇయాన్ నెపోమ్నియాచి సంయుక్త విజేతలుగా నిలిచారు. మహిళల కేటగిరీ..క్వార్టర్‌ఫైనల్లో చైనా క్రీడాకారిణి జూ జినెర్‌ను 2.5-1.5తో ఓడించిన వైశాలి సెమీస్‌లో అదే స్థాయిలో రాణించలేకపోయింది. చైనాకే చెందిన జు వెన్‌జున్ చేతిలో 0.5-2.5తో వైశాలి సెమీఫైనల్లో ఓటమి చవిచూసింది. ఆమె కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వెన్‌జున్ బ్లిట్జ్ టైటిల్ కైవసం చేసుకుంది. ఫైనల్లో సహచరి లీ టింగ్‌జీపై 3.-5-2.5తో నెగ్గిన జున్ స్వర్ణం దక్కించుకుంది. లీ టింగ్‌జీ రజతానికి పరిమితమైంది. కాగా వైశాలి తమ్ముడు ప్రజ్ఞానంద కూడా ఈ పోటీల్లో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. కాంస్య పతకం చేజిక్కించుకున్న తమిళనాడు అమ్మాయి వైశాలిని ఐదుసార్లు ప్రపంచ చాంపియన్, అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఉపాధ్యక్షుడు విశ్వనాథన్ ఆనంద్ అభినందించాడు.

మ్యాచ్‌ఫిక్సింగ్‌కు పాల్పడ్డారా ?

కార్ల్‌సన్, నెపోమ్నియాచి సంయుక్త విజేతలుగా నిలవడం దుమారం రేపుతోంది. వీరిద్దరూ మ్యాచ్‌ఫిక్సింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఫైనల్ సందర్భంగా వేదిక వెనుక.. మాగ్నస్-ఇయాన్ మాట్లాడుకున్న వీడియో ఒకటి ఆ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. 'ఇద్దరినీ సంయుక్త విజేతలుగా ఫిడే ప్రకటించేలా చిన్నపాటి డ్రాలతో గేమ్‌లను ముగిద్దాం' అని నెపోమ్నియాచితో కార్ల్‌సన్ అనడం ఆ వీడియోలో స్పష్టంగా వినిపించింది.



కార్ల్‌సన్-నెపోమ్నియాచికి స్వర్ణం..

బ్లిట్జ్ ఓపెన్ విభాగం స్వర్ణ పతకాన్ని కార్ల్‌సన్, ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ ఇయాన్ నెపోమ్నియాచి సంయుక్తంగా అందుకున్నారు. ఫైనల్లో తొలి రెండు గేమ్‌లను కార్ల్‌సన్ గెలిచాడు. దాంతో మరో గేమ్‌ను అతడు డ్రా చేసుకుంటే టైటిల్ సొంతమయ్యేది. కానీ పుంజుకున్న నెపోమ్నియాచి తదుపరి రెండు గేమ్‌లలో గెలుపొందాడు. దాంతో 2-2తో స్కోరు సమమైంది. ఈనేపథ్యంలో మూడు గేమ్‌ల సడన్ డెత్‌ను నిర్వహించారు. అవి కూడా డ్రా కావడంతో సంయుక్త టైటిల్‌కోసం కార్ల్‌సన్ ప్రతిపాదించాడు. దానికి నెపోమ్నియాచి కూడా అంగీకరించాడు. ఫలితంగా..వారిద్దరిని సంయుక్త విజేతలుగా ప్రకటించారు. బ్లిట్జ్ టైటిల్ ఇలా ఇద్దరికీ కలిపి ఇవ్వడం టోర్నీ చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. కార్ల్‌సన్ ఎనిమిదోసారి బ్లిట్జ్ చాంపియన్‌గా నిలవగా, నెపోమ్నియాచికి ఇదే మొదటి టైటిల్.

మాగ్నస్ మరో వివాదం..

కార్ల్‌సన్ మరోసారి వివాదానికి కేంద్ర బిందువయ్యాడు.



బ్లిట్జ్ విభాగం తొలి రౌండ్‌లో గ్రాండ్‌మాస్టర్ మైకేల్ బెజోల్డ్ (జర్మనీ)తో కార్ల్‌సన్ తలపడ్డాడు. మూడు నిమిషాల ఆ గేమ్‌కు మాగ్నస్ ఒక నిమిషం 11 సెకన్లు ఆలస్యంగా వచ్చి వివాదాస్పదుడయ్యాడు. కొత్త జీన్స్ కొనుక్కోవడంలో ఆలస్యమైందని మాగ్నస్ చెప్పాడు. కాగా టోర్నమెంట్ ర్యాపిడ్ విభాగం పోటీలకు డ్రెస్ కోడ్‌ను ఉల్లంఘించి జీన్స్ వేసుకొని రావడంతో కార్ల్‌సన్‌ను నిర్వాహకులు బహిష్కరించిన విషయం విదితమే.

గంభీర్‌కు గండం



కోచ్‌పై సన్నగిల్లుతున్న నమ్మకం?

కొందరు ఆటగాళ్ల అసంతృప్తి

నిశితంగా పరిశీలిస్తున్న భారత బోర్డు

సిడ్నీ: కొన్నేళ్లుగా భారత క్రికెట్‌కు మూలస్తంభాలుగా ఉన్న రోహిత్ శర్మ, కోహ్లీ త్వరలో రిటైర్మెంట్ ప్రకటిస్తారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. భారత జట్టు సంధి దశలో ఉన్న కీలక సమయంలో కోచ్ గౌతమ్ గంభీర్, సహాయ సిబ్బంది భవిష్యత్ సవాళ్లకు తగినట్టుగా టీమిండియాను ఎలా నడిపిస్తారనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గామారింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో సమతుల్యమైన జట్టును ఎంపిక చేయడం సంక్లిష్టంగా మారింది. సిరీస్ చేజారకుండా ఉండాలంటే సిడ్నీలో జరిగే ఐదో టెస్ట్‌లో భారత్ నెగ్గి తీరాల్సిందే. కాగా, వరుస వైఫల్యాల నేపథ్యంలో టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో అనిశ్చితి నెలకొందనే టాక్ రోజురోజుకూ పెరుగుతోంది. జట్టులోకి ఎక్కువ మంది ప్లేయర్లతో గంభీర్‌కు శ్రుతి కుదరడం లేదనే ప్రచారం సాగుతోంది. రవిశాస్త్రి, ద్రవిడ్ తరహాలో ఆటగాళ్లతో సమాచార మార్పిడి సజావుగా జరగడం లేదనేది ప్రముఖంగా వినిపిస్తున్న ఆరోపణ. సీనియర్లు కాకుండా.. ఈ మధ్య కాలంలో జట్టులో చోటును సుస్థిరం చేసుకొన్న కొందరు క్రికెటర్లు గౌతీ తీరుపై అసంతృప్తిగా ఉన్నారని సమాచారం.

అలా జరిగితే.. ఉద్వాసనే?

'మరో టెస్ట్ ఆడాల్సి ఉంది. ఆ తర్వాత చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్. టీమిండియా ప్రదర్శన మెరుగుపడకపోతే మాత్రం కోచ్‌గా గంభీర్ పోస్టు ప్రమాదంలో పడినట్టే'నని బోర్డు అధికారి ఒకరు చెప్పారు. మరోవైపు ప్రయోగాలు చేస్తుండడంతో జట్టులోని ఆటగాళ్లు కూడా అభద్రతా భావానికి లోనవుతున్నారని తెలుస్తోంది. బీసీసీఐలో ఖాళీ అయిన పదవులు భర్తీ అయిన తర్వాత.. భారత జట్టుపై కొన్ని నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉంది. చాంపియన్స్ ట్రోఫీలో జట్టు ప్రదర్శన మెరుగుపడకపోతే మాత్రం గంభీర్‌కు ఉద్వాసన తప్పదని అంటున్నారు. 'గౌతీ ఎప్పుడూ మా మొదటి ప్రాధాన్యం కాదు. ఆ లిస్ట్‌లో వీవీఎస్ లక్ష్మణ్ ముందున్నాడు. దీంతో కొంత రాజీపడి, తప్పని పరిస్థితుల్లో అతడి నియామకం చేయాల్సి వచ్చింద'ని ఆ అధికారి చెప్పారు. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైనప్పుడే గౌతీని నిలదీశారు. ఇక ఈ సిరీస్‌లో కోహ్లీ వరుస వైఫల్యాలకు గౌతీ ఏదైనా సమాధానం వెతకగలడా? అనే ప్రశ్న అన్ని వర్గాల నుంచి ఎదురవుతోంది. అంతేకాకుండా ఓ సహాయ కోచ్‌కు చెందిన సహాయకుడు ఫ్రాంచైజీ జెర్సీలో మ్యాచ్ ముగిసిన తర్వాత ప్లే ఏరియాలోకి రావడంతోపాటు బీసీసీఐకు కేటాయించిన బాక్స్‌లో కనిపించడంపై కూడా బోర్డు పెద్దలు ఆరాతీస్తున్నట్టు సమాచారం.

ప్రశ్నించనున్న బీసీసీఐ

సిరీస్ మధ్యలో అశ్విన్ హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించడంపై రోహిత్, గౌతీని బీసీసీఐ ప్రశ్నించే అవకాశం ఉన్నట్టు సమాచారం. అవమానాలు తట్టుకోలేకే అశ్విన్ వెళ్లిపోయాడన్న ఊహాగానాలు ఉన్నాయి.

చేసింది ఇక చాలు..

నాలుగో టెస్ట్ ఓడిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌కు వచ్చిన ఆటగాళ్లపై గంభీర్ ఫైర్ అయినట్టు వార్తలు వస్తున్నాయి. 'ఇక..చేసింది చాలు' అని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు ఓ చానెల్ తెలిపింది. పరిస్థితులకు తగ్గట్టుగా ఆడకుండా.. తమ సహజ శైలిలో ఆడితే ఎలా? అని కూడా ప్రశ్నించినట్టు తెలుస్తోంది. మొత్తంగా గౌతీ వ్యూహాలకు.. మైదానంలో వారు ఆడే తీరుకు పొంతన లేదని అంటున్నారు. ఒకరకంగా అందరినీ గౌతీ ఘాటుగానే హెచ్చరించాడని సమాచారం. చటేశ్వర్ పుజారను జట్టులోకి తీసుకోవాలని కూడా గంభీర్ ప్రతిపాదించినా.. సెలెక్టర్లు ఒప్పుకోలేదట.

నితీష్...ఓ జీనియస్

» ఆసీస్ మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్



మెల్‌బోర్న్: తెలుగు కుర్రాడు నితీష్ కుమార్‌ను ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ పొగడ్తలతో ముంచెత్తాడు. 'నితీష్ ఓ జీనియస్. 21 ఏళ్ల వయసులోనే ఈ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలవడాన్ని నమ్మలేకపోతున్నా. సిరీస్ మొత్తం ఏమ్రాతం అంచనాలు లేకున్నా అదరగొట్టి, అందరినీ ఆకట్టుకున్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో అతడికి ఎవరన్నా భయం లేదు. టెయిలెండర్లతో కలిసి అద్భుతంగా ఆడాడు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో తానేంటో నిరూపించుకున్నాడు. నితీష్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపించాలి. ఆరో స్థానం అతడికి సరిపోతుంది' అని క్లార్క్ అభిప్రాయపడ్డాడు.

బుమ్రాను నిరోధించేలా చట్టం

ఆసీస్ ప్రధాని అల్బనీస్ సరదా వ్యాఖ్య





సిడ్నీ : ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్..నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆసీస్, భారత జట్లకు ఇక్కడి తన అధికారిక నివాసంలో బుధవారం విందు ఇచ్చారు. సిరీస్ నాలుగు టెస్ట్‌ల్లో ఇప్పటికే 30 వికెట్లతో 'కంగారె'త్తిస్తున్న బుమ్రా ప్రదర్శనను ఆయన తెగ మెచ్చుకున్నారు. 'అతడు ఎడమ చేతితో బౌలింగ్ చేయాలని లేదా ఒక అడుగు వెనక్కు వేయాలని చట్టం చేస్తాం' అని ఆస్ట్రేలియా క్రికెటర్లతో అల్బనీస్ సరదాగా అన్నారు. భారత కోచ్ గంభీర్ మాట్లాడుతూ..'ఆస్ట్రేలియా అందమైన దేశం. అయితే ఆ దేశంతో ఆడడం కష్టం. చివరి టెస్ట్‌లో మెరుగైన ప్రదర్శన చేసి రంజింపజేస్తాం' అని అన్నాడు.

జస్‌ప్రీత్ కెరీర్ ఉత్తమ రేటింగ్

దుబాయ్: ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా కెరీర్ ఉత్తమ రేటింగ్ పాయింట్లను సొంతం చేసుకున్నాడు. బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లోని మెల్‌బోర్న్ టెస్టులో తొమ్మిది వికెట్లు తీసిన అనంతరం బుమ్రా 907 పాయింట్లతో బౌలర్ల ర్యాంకింగ్స్‌లో తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. భారత బౌలర్లలో ఇప్పటి వరకు అత్యుత్తమ రేటింగ్ జాబితాలో ముందు ఉన్న మాజీ స్పిన్నర్ అశ్విన్‌ను బుమ్రా తాజాగా అధిగమించాడు. ప్రస్తుత ర్యాంకింగ్స్‌లో బుమ్రా టాప్‌లో నిలవగా, ఆసీస్ బౌలర్లు హాజెల్‌వుడ్, పాట్ కమిన్స్ చెరో స్థానం మెరుగై వరసగా రెండు, మూడు ర్యాంక్‌లను దక్కించుకున్నారు. బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో యశస్వి జైస్వాల్ ఒక స్థానం ఎగబాకి నాలుగో ర్యాంక్‌కు చేరుకున్నాడు. నితీష్ 20 స్థానాలు మెరుగై 53వ ర్యాంక్‌లో నిలిచాడు.

చాలెంజర్ ట్రోఫీకి తెలుగమ్మాయిలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బీసీసీఐ సీనియర్ మహిళల వన్డే చాలెంజర్ ట్రోఫీకి ఆరుగురు తెలుగు క్రికెటర్లు ఎంపికయ్యారు. ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు ఈ టోర్నీ చెన్నై వేదికగా జరగనుంది. ఆంధ్ర నుంచి వికెట్‌కీపర్ ఎం.దుర్గ (ఇండియా-ఎ), జి.శరణ్య (ఇండియా-బి), హెన్రీటా (ఇండియా-సి), ఎ.వాసవీ పావని (ఇండియా-ఈ), తెలంగాణ నుంచి వికెట్‌కీపర్ మమత (ఇండియా-ఎ), యశశ్రీ (ఇండియా-సి)లకు చోటు లభించింది.

వినోద్ కాంబ్లీ డిశ్చార్జ



ముంబై: అనారోగ్య సమస్యలతో ఆస్పత్రి పాలైన భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ కోలుకుని ఇంటికి తిరిగొచ్చాడు. గత నెల 21వ తేదీన ఆస్పత్రిలో చేరిన కాంబ్లీ బుధవారం డిశ్చార్జ్ అయ్యాడు. మద్యానికి దూరంగా ఉండాలని యువతను కోరాడు.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.77 లక్షల కోట్లు

డిసెంబరులో 7.3% పెరుగుదల

» తెలంగాణలో రూ.5,224 కోట్లు..

» ఏపీలో రూ.3,315 కోట్ల రాబడి



న్యూఢిల్లీ: డిసెంబరు నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు రూ.1.77 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2023 డిసెంబరు నెలలో వసూలైన రూ.1.65 లక్షల కోట్లతో పోలిస్తే రాబడి 7.3 శాతం పెరిగింది. బుధవారం విడుదలైన ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. జీఎస్‌టీ వసూళ్లలో సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.32,836 కోట్లుండగా.. స్టేట్ జీఎస్‌టీ రూ.40,499 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.47,783 కోట్లు, సెస్సు రూ.11,471 కోట్లుగా ఉన్నాయి. గత నెలలో దేశీయ లావాదేవీల ద్వారా జీఎస్‌టీ ఆదాయం 8.4 శాతం పెరిగి రూ.1.32 లక్షల కోట్లకు చేరుకుంది. దిగుమతులపై విధించిన పన్ను ద్వారా సమకూరిన రాబడి దాదాపు 4 శాతం పెరిగి రూ.44,268 కోట్లకు చేరింది. ఇక నవంబరులో జీఎస్‌టీ వసూళ్లు 8.5 శాతం వార్షిక వృద్ధితో రూ.1.82 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2024 ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.2.10 లక్షల కోట్లకు పైగా ఆదాయం నమోదైంది. కాగా, గతనెలలో రూ.22,490 కోట్ల రిఫండ్స్‌ను జారీ చేశారు. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇందులో 31 శాతం వృద్ధి నమోదైంది. రిఫండ్స్‌ను సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 3.3 శాతం వృద్ధితో రూ.1.54 లక్షల కోట్లకు చేరాయి. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, గతనెల తెలంగాణలో జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపతికన 10 శాతం వృద్ధి చెంది రూ.5,224 కోట్లకు పెరగగా.. ఆంధ్రప్రదేశ్‌లో వసూళ్లు 6 శాతం తగ్గి రూ.3,315 కోట్లకు పరిమితమయ్యాయి.

అగ్రిటెక్‌లో 80,000 కొలువులు

టీమ్‌లీజ్ సర్వీసెస్

ముంబై: అగ్రిటెక్ రంగంలోనూ పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయి. వచ్చే ఐదేళ్లలో ఈ రంగం లో ఎంత లేదన్నా 60,000 నుంచి 80,000 కొత్త ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ అంచనా వేసింది. అధునాతన పద్ధతుల్లో పొలాలకు నీటిపారుదల సదుపాయాల కల్పన, ఎరువులు, పురుగు మందుల పిచికారీ, అధునాతన వ్యవసాయ యంత్రాలు, వ్యవసా య ఉత్పత్తుల అమ్మకం కోసం ఏర్పాటు చేసే మార్కెటింగ్ సదుపాయాలతో ఈ ఉద్యోగాల కల్పన ఉంటుందని టీమ్‌లీజ్ సర్వీసెస్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ సబ్బురత్నం తెలిపారు. దేశ వ్యవసాయ రంగం ఇప్పటికే దాదాపు లక్ష మంది నిపుణులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

ఇక దేశీయ యూజర్లందరికీ 'వాట్సాప్ పే' సేవలు!

10 కోట్ల యూజర్ల పరిమితి ఎత్తివేత

న్యూఢిల్లీ: ప్రముఖ సామాజిక మాధ్యమం వాట్సాప్‌కు చెందిన వాట్సాప్ పే కొత్త యూజర్ల చేరికపై పరిమితిని తక్షణమే ఎత్తివేస్తున్నట్లు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది. తద్వారా వాట్సాప్ తన భారత యూజర్లందరికీ యూపీఐ సేవలందించేందుకు వీలు కలుగనుంది. గతంలో ఎన్‌పీసీఐ వాట్సాప్ పే యూపీఐ సేవలను దశలవారీగా విస్తరించేందుకు, గరిష్ఠంగా 10 కోట్ల మందిని మాత్రమే చేర్చుకునేందుకు అనుమతిచ్చింది. తాజాగా ఆ పరిమితిని ఎత్తివేసింది. వాట్సాప్‌కు భారత్‌లో 50 కోట్లకు పైగా వినియోగదారులున్నారు. కాగా, డిజిటల్ చెల్లింపుల సేవల్లో గుత్తాధిపత్యాన్ని నిరోధించేందుకు థర్డ్ పార్టీ యూపీఐ యాప్స్‌కు 30 శాతం మార్కెట్ వాటా పరిమితి విధించాలని ఎన్‌పీసీఐ గతంలోనే నిర్ణయించింది. దీన్ని అమలు చేసేందుకు గడువును 2026 డిసెంబరు 31 వరకు పొడిగించింది.

టాప్‌గేర్‌లో ఆటో

2024లో 43 లక్షల కార్ల విక్రయం

ప్రయాణికుల వాహన రంగం కొత్త రికార్డు



న్యూఢిల్లీ: గత ఏడాది (2024) దేశంలో ప్రయాణికుల వాహనాల టోకు విక్రయాలు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 43 లక్షల యూనిట్లకు పెరిగాయి. మార్కెట్ దిగ్గజం మారుతి సుజుకీతో పాటు హ్యుండయ్, టాటా మోటార్స్, టయోటా కిర్లోస్కర్ మోటార్స్ (టీకేఎం), కియా అత్యుత్తమ వార్షిక అమ్మకాలను నమోదు చేశాయి. ఎస్‌యూవీలకు డిమాండ్ క్రమంగా పెరుగుతుండటంతో పాటు గ్రామీణ మార్కెట్లో పుంజుకుంటున్న గిరాకీ విక్రయాల జోరుకు దోహదపడ్డాయి. 2023లో వాహనాల టోకు అమ్మకాలు 41.1 లక్షల యూనిట్ల స్థాయిలో ఉన్నాయి. 2023తో పోలిస్తే 2024లో అమ్మకాలు 4.5-4.7 శాతం స్థాయిలో పెరిగాయని మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ తెలిపారు. మారుతి సుజుకీ సైతం 2024లో ఆల్‌టైం గరిష్ఠ టోకు, రిటైల్ విక్రయాలను నమోదు చేసిందన్నారు. వార్షిక టోకు విక్రయాల రికార్డును మారుతి ఆరేళ్ల తర్వాత బద్దలు కొట్టిందని ఆయన చెప్పారు. 2024లో కంపెనీ టోకు విక్రయాలు 17,90,977 యూనిట్లకు చేరుకున్నాయని, దాంతో 2018లో నమోదైన 17,51,919 యూనిట్ల గత రికార్డును అధిగమించామని ఆయన తెలిపారు. రిటైల్ అమ్మకాల విషయానికొస్తే, 2024లో 17,88,405 యూనిట్ల విక్రయాలతో కంపెనీ సరికొత్త రికార్డు సృష్టించిందని చెప్పారు. 2023లో నమోదైన 17,26,661 యూనిట్ల విక్రయాల గత రికార్డును తుడిచిపెట్టింది. కాగా, డిసెంబరులో మారుతి సుజుకీ దేశీయ విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 24.18 శాతం వృద్ధితో 1,30,117 యూనిట్లుగా నమోదయ్యాయి.

ఎస్‌యూవీల్లో హ్యుండయ్ హవా

దేశంలో రెండో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ విక్రయాలు సైతం 2024లో సరికొత్త జీవనకాల గరిష్ఠం 6,05,433 యూనిట్లకు పెరిగాయి. 2023లో కంపెనీ 6,02,111 కార్లు విక్రయించింది. గత ఏడాది వాహన మార్కెట్లో అమ్ముడైన మొత్తం ఎస్‌యూవీల్లో 67.6 శాతం తమ కంపెనీవేనని హ్యుండయ్ వెల్లడించింది. గతనెలలో మాత్రం హ్యుండయ్ అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన 1.3 శాతం తగ్గి 42,208 యూనిట్లకు పరిమితమయ్యాయి.

● 2024లో టాటా మోటార్స్ టోకు విక్రయాలు సరికొత్త రికార్డు స్థాయి 5.65 లక్షల యూనిట్లకు ఎగబాకాయి. టాటా మోటార్స్ రికార్డు వార్షిక విక్రయాలను నమోదు చేయడం వరుసగా ఇది నాలుగోసారి. గత నెలలో కంపెనీ సేల్స్ 1 శాతం వృద్ధితో 44,289 యూనిట్లుగా నమోదయ్యాయి.

● టయోటా సైతం గత ఏడాదిలో అత్యుత్తమ వార్షిక విక్రయాల రికార్డును నమోదు చేసింది. 2023లో నమోదైన 2,33,346 యూనిట్లతో పోలిస్తే, 2024లో 40 శాతం వృద్ధితో 3,26,329 యూనిట్ల అమ్మకాలు జరిపింది. ఎస్‌యూవీ, ఎంపీవీ విభాగాలు ఇందుకు ప్రధానంగా దోహదపడ్డాయని టయోటా సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ల విభాగ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు.

● గత ఏడాది కియా ఇండియా సేల్స్ 6 శాతం పెరిగి 2,55,038 యూనిట్లకు చేరాయి. 2023లో కంపెనీ 2,40,919 యూనిట్ల అమ్మకాలు జరిపింది.

● మహీంద్రా అండ్ మహీంద్రా టోకు అమ్మకాలు గతనెలలో 18 శాతం వృద్ధితో 41,424 యూనిట్లకు చేరగా.. జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా సేల్స్ 55 శాతం పెరిగి 7,516 యూనిట్లుగా నమోదయ్యాయి. గతనెలలో కంపెనీ రికార్డు ఈవీ విక్రయాలను నమోదు చేసిందని, మొత్తం సేల్స్‌లో 70 శాతం వాటా వీటిదేనని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ తెలిపింది. కాగా, గతనెలలో నిస్సాన్ మోటార్ హోల్ సేల్స్ 51.42 శాతం పెరిగి 11,676 యూనిట్లకు చేరాయి.

● గత ఏడాది దేశీయ విక్రయాలు 18.55 శాతం వృద్ధితో 68,650 యూనిట్లకు పెరిగాయని హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ తెలిపింది. ఎగుమతులు మాత్రం రెండింతలకు పైగా పెరిగి 63,221 యూనిట్లకు చేరాయంది.

● లగ్జరీ కార్ల కంపెనీ ఆడీ గత ఏడాదిలో 5,816 యూనిట్లను విక్రయించింది. 2023లో నమోదైన 7,931 యూనిట్లతో పోలిస్తే, 2024లో సేల్స్ 26.6 శాతం తగ్గాయి. సరఫరా సమస్యలు ఇందుకు కారణమని కంపెనీ పేర్కొంది.

బిజినెస్

సోలార్ మాడ్యూల్స్ తయారీలోకి పెన్నార్

హైదరాబాద్: స్థానిక పెన్నార్ ఇండస్ట్రీస్ సోలార్ మాడ్యూల్స్ తయారీలోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం బెంగళూరుకు చెందిన జెట్‌వర్క్ మాన్యుఫాక్చరింగ్ బిజినెస్ ప్రైవేట్ లిమిటెడ్ (జడ్ఎంబీపీఎల్) కంపెనీతో కలిసి ఒక జాయింట్ వెంచర్ (జేవీ) ఏర్పాటు చేస్తోంది. దీనికి సంబంధించి జడ్ఎంబీపీఎల్ కంపెనీతో బుధవారం ఒక ఒప్పందం కుదుర్చుకున్నట్టు పెన్నార్ ఇండస్ట్రీస్ తెలిపింది. ఈ జేవీ ఈక్విటీలో జడ్ఎంబీపీఎల్ కంపెనీకి 50.1 శాతం, పెన్నార్ ఇండస్ట్రీస్‌కు 45 శాతం, ఇతరులకు 4.9 శాతం వాటా ఉంటుంది. తన 45 శాతం వాటా కోసం కంపెనీ ఈ జేవీకి రూ.18.75 కోట్లు సమకూర్చనుంది. ఈ జేవీ ద్వారా దేశ, అంతర్జాతీయ మార్కెట్లకు అవసరమైన సోలార్ మాడ్యూల్స్ తయారీ, అమ్మకం కోసం ప్రత్యేక ప్లాంటు ఏర్పాటు చేస్తారు. అయితే ఈ జేవీ ప్లాంటును ఎక్కడ ఏర్పాటు చేసేదీ పెన్నార్ ఇండస్ట్రీస్ వెల్లడించలేదు. ఈ వార్తలతో బుధవారం కంపెనీ షేర్లు బీఎస్ఈలో 5.09 శాతం లాభంతో రూ.203.40 వద్ద ముగిశాయి.

పవర్ మెక్‌కు రూ.294 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే పవర్ మెక్ ప్రాజెక్ట్స్ కంపెనీకి అదానీ పవర్ నుంచి రూ.294 కోట్ల భారీ ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ ద్వారా చత్తీస్‌గఢ్‌లోని అదానీ పవర్ కంపెనీకి చెందిన 1,320 మెగావాట్ల కోర్బా థర్మల్ పవర్ ప్రాజెక్టుకు వివిధ సేవలు అందజేయనున్నట్టు పవర్ మెక్ ప్రాజెక్ట్స్ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

జనవరి 2			
హైదరాబాద్	525	విజయవాడ	550
వరంగల్	527	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	101	విజయవాడ	108
వరంగల్	101	గుంటూరు	108
కరీంనగర్	101	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	85
కర్నూలు	101	నెల్లూరు	90
విశాఖపట్నం	105	అనంతపురం	90
గోదావరి	108		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,000 ▲	71,500 ▲	98,000 ▼
విజయవాడ	79,000 ▲	74,000 ▲	90,000 ▲
విశాఖపట్నం	77,100 ▲	70,680 ▲	87,580 ▲
రాజమండ్రి	78,000 ▲	71,500 ▲	88,400 ▼
ప్రొద్దుటూరు	78,600 ▲	72,780 ▲	88,400 ▲
ముంబై	76,580	70,150	86,055

కొత్త ఏడాదికి శుభారంభం

సెన్సెక్స్ 368 పాయింట్లు అప్

ముంబై: స్టాక్ మార్కెట్ కొత్త ఏడాది తొలి రోజే లాభాల బాట పట్టింది. బుధవారం ఉదయం నష్టాలతో ప్రారంభమైన సూచీలు కొద్ది సేపటికే లాభాల బాట పట్టాయి. సెన్సెక్స్ 368.40 పాయింట్ల లాభంతో 78,507.41 వద్ద, నిఫ్టీ 98.10 పాయింట్ల లాభంతో 23,742.90 వద్ద ముగిశాయి. దీంతో రెండు రోజుల వరుస నష్టాలకు బుధవారం బ్రేక్ పడింది. ఇంట్రా డేలో సెన్సెక్స్ 617.48 పాయింట్ల లాభంతో 78,756.49 గరిష్ఠ స్థాయిని తాకింది. డిసెంబరు నెల కార్ల అమ్మకాలు బాగుండడంతో బుధవారం ఆటోమొబైల్ కంపెనీల షేర్లు మంచి లాభాలతో క్లోజయ్యాయి. ఆటో ప్యాక్‌లో మారుతీ సుజుకీ కంపెనీ షేర్లు అత్యధికంగా 3.26 శాతం, ఎం అండ్ ఎం కంపెనీ షేర్లు 2.45 శాతం లాభాలతో ముగిశాయి. ఎల్ అండ్ టీ, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఏసియన్ పెయింట్స్, పవర్‌గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యాక్సిస్ బ్యాంక్ షేర్లూ లాభాల బాట పట్టాయి. టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, జొమాటో, హెచ్‌సీఎల్ టెక్, ఎస్‌బీఐ, హెచ్‌యూఎల్, టెక్ మహీంద్ర కంపెనీల షేర్లు మాత్రం నష్టాలతో ముగిశాయి. జనవరి నుంచి మార్చి మధ్య ప్రభుత్వ పెట్టుబడులు ఊపందుకుంటాయన్న వార్తలు కూడా బుధవారం మార్కెట్‌ను లాభాల బాట పట్టించాయి. నిఫ్టీకి 24,000 వద్ద గట్టి రెసిస్టెన్స్ ఎదురయ్యే అవకాశం ఉందని టెక్నికల్ విశ్లేషకుల అంచనా.

ఇండో ఫార్మ్ ఎక్విప్‌మెంట్ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ అదుర్స్: మంగళవారం ప్రారంభమైన ఇండో ఫార్మ్ ఎక్విప్‌మెంట్ ఐపీఓకు మదుపరుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. రెండో రోజు 54.50 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.

రూ.440 పెరిగిన పసిడి ధర: బులియన్ మార్కెట్ కూడా కొత్త ఏడాది లాభాల్లో ప్రారంభమైంది. ఢిల్లీలో 10 గ్రాముల 24 కేరట్ల (మేలిమి) బంగారం రూ.440 లాభంతో రూ.79,390 వద్ద, కిలో వెండి రూ.800 లాభంతో రూ.90,500 వద్ద ముగిశాయి. ఎంసీఎక్స్‌లో మాత్రం ఫిబ్రవరిలో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి బంగారం ఎదుగూ బొదుగూ లేకుండా రూ.76,893 వద్ద ముగిసింది.

టై హైదరాబాద్ కొత్త అధ్యక్షుడు రాజేశ్ పగడాల

ఉపాధ్యక్షుడుగా మురళి కాకర్ల ఎన్నిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంత్రపెన్యూర్ల నెట్‌వర్క్ 'ది ఇండస్ ఆంత్రప్రెన్యూర్స్' (టై) హైదరాబాద్ చాప్టర్ కొత్త అధ్యక్షుడుగా పగడాల కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాజేశ్ పగడాల, ఉపాధ్యక్షుడుగా ఇన్నోబాక్స్ వ్యవస్థాపకులు, సీఈఓ మురళి కాకర్ల ఎన్నికయ్యారు.

రిలయన్స్ అధీనంలోకి 'వయాకామ్18 మీడియా'

న్యూఢిల్లీ: వయాకామ్ 18 మీడియా, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ప్రత్యక్ష అనుబంధ కంపెనీగా మారింది. ఈ కంపెనీ ఈక్విటీలో తనకు కేటాయించిన 24.61 కోట్ల కంపల్సరీ కన్వర్టబుల్ కన్వర్టిబుల్ ప్రిఫరెన్స్ షేర్లను ఆర్ఐఎల్ పూర్తి ఈక్విటీ షేర్లుగా మార్చుకోవడంతో ఇది సాధ్యమైంది. వయాకామ్ 18 ఇప్పటి వరకు ఆర్ఐఎల్ అనుబంధ సంస్థ అయిన నెట్‌వర్క్ 18 మీడియా అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థగా ఉండేది.

కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టుపై అధ్యయనానికి ఫీజు చెల్లించండి

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు లేఖ
- ఏఏఐకు 41 లక్షలు డిపాజిట్ చేయాలని వెల్లడి
- ఫీజు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలంటూ కోమటిరెడ్డికి తుమ్మల లేఖ.. 2 రోజుల్లో నిర్ణయం!



హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు నిర్మించ తలపెట్టిన నేపథ్యంలో అక్కడ అధ్యయనం జరిపేందుకు కేంద్రం నిర్ణయించింది. సర్కారు కేటాయించిన 950 ఎకరాల భూముల్లో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రీ-ఫీజిబిలిటీ స్టడీ (ప్రాజెక్టుపై అధ్యయనం) నిర్వహించేందుకు రూ.41 లక్షల ఫీజును చెల్లించాల్సి ఉంటుందని కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు లేఖ రాశారు. రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సహకరించాలని మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు గతంలో రాసిన లేఖలకు తాజాగా ఆయన బదులిచ్చారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు (జీఎఫ్ఏ) లను నిర్మించేందుకు పాలసీని తెచ్చిందని, అందులో భాగంగా కొత్తగూడెంలోనూ విమానాశ్రయ ఏర్పాటుకు సహకరిస్తామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటులో కీలకమైన సాంకేతిక, ఆర్థిక, పర్యావరణ అంశాలపై అధ్యయనం చేయాల్సి ఉందని.. ఇందుకు (ఏఏఐ) తన బృందంతో అధ్యయనాన్ని చేపట్టేందుకు రూ.41 లక్షలు డిపాజిట్ చేయాలని లేఖలో సూచించారు. ఈ లేఖపై స్పందించిన మంత్రి తుమ్మల.. ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత స్థలంలో అధ్యయనానికి ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే ఫీజు చెల్లించే వ్యవహారంపై ఒకటి, రెండు రోజుల్లో ఒక నిర్ణయాన్ని తీసుకోనున్నట్టు సమాచారం.

బీసీలకిచ్చిన హామీల అమలేది సీఎం?

- తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రేపు బీసీ మహాసభ
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత


హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కామారెడ్డి సభలో ఆర్భాటంగా బీసీ డిక్లరేషన్ ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి వాటిని ఎందుకు అమలు చేయడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. బీసీ వర్గాలకు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. శుక్రవారం ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న బీసీ మహాసభ పోస్టర్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బీసీలకిచ్చిన హామీలను అమలు చేయాలన్న డిమాండ్‌తో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బీసీ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని, ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పెంపుపై కాలయాపన చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా.. హామీల అమలుపై రేవంత్ సర్కార్ దృష్టి పెట్టడంలేదని ఆరోపించారు. బీసీ కుల సంఘాలతోపాటు విద్యార్థి, ఇతర సంఘాల మద్దతుతో సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఈ నెల 3న మహాసభ నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సభకు భారీఎత్తున హాజరై విజయవంతం చేయాలని కార్యకర్తలకు కవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో రిజిస్ట్రేషన్ల గుట్టు!

వారి కనుసన్నల్లోనే డాక్యుమెంట్ల స్కానింగ్.. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో చక్రం తిప్పుతున్న వైనం

హైదరాబాద్ సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయల విలువైన స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ల గుట్టు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళుతోందా? అంటే.. అవుననే అంటున్నారు రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగులు. స్థిరాస్తుల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను స్కానింగ్ చేసేందుకు దాదాపు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తులే అనధికారికంగా పని చేస్తున్నారు. ఒక్కో కార్యాలయంలో నలుగురు లేదా ఐదుగురితో ఇలా పని చేయిస్తున్నట్లు తెలుస్తోంది. కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (కార్డ్) అమల్లోకి వచ్చిన 1998నుంచి అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను స్కానింగ్ చేస్తున్నారు. అయితే, డాక్యుమెంట్లను స్కానింగ్ చేసేందుకు యంత్రాలను కొనుగోలు చేసిన ఉన్నతాధికారులు సిబ్బందిని మాత్రం నియమించలేదు. మరోవైపు.. ఔట్‌సోర్సింగ్ నియామకాలపైనా ప్రభుత్వం నిషేధం విధించడంతో స్కానింగ్ ఆపరేటర్లను తీసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో డాక్యుమెంట్ల స్కానింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు బయటి (జిరాక్సు షాపుల యజమానుల) వ్యక్తులపైనే సబ్ రిజిస్ట్రార్లు ఆధారపడుతున్నారు. ఇటీవలి కాలంలో హైదరాబాద్‌తోపాటు పరిసర జిల్లాల్లోనూ ఆస్తుల క్రయవిక్రయాలు పెరగడంతో గ్రేటర్ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు కిటకిటలాడుతున్నాయి. పటాన్‌చెరు, గండిపేట, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, ఉప్పల్ వంటి ఎస్సార్వోలలో రోజుకు 100 నుంచి 250వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరుగుతోంది. ఆ డాక్యుమెంట్లను స్కానింగ్ చేసేందుకు రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో బయటి వ్యక్తులతో చేయించేందుకు వారం నుంచి 10రోజుల సమయం పడుతోంది. ఫలితంగా కొనుగోలుదారులు తమ ఆస్తిపత్రాల కోసం ఎస్సార్వోల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని పత్రాలను స్కాన్ చేసి ఇచ్చేందుకు కూడా ప్రైవేటు వ్యక్తులు దందా సాగిస్తున్నారు. ఎలాంటి వేతనం లేకుండానే వీరు పని చేస్తున్నారంటే.. ఈ దందా ఏ రీతిన సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని చోట్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు(ఎస్సార్వో)ల్లో సబ్ రిజిస్ట్రార్ల కన్నా బయటి వ్యక్తుల ఆజమాయిషీనే ఎక్కువగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సమాచారం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుండడంపై వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయమై దృష్టి సారించి వెంటనే రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేను మారాను.. మీరూ మారండి!



రేవంత్‌ను కలిసి సీఎంఆర్ఎఫ్‌కు రూ.20 లక్షల చెక్కును అందజేస్తున్న సీవీఆర్ కాలేజీ ప్రతినిధులు

(మొదటిపేజీ తరువాయి)

చామల కిరణ్ కుమార్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు బాలూ నాయక్, మధుసూధన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, మఖన్‌సింగ్ ఠాకూర్, రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, పర్ణికా రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మత్స్య కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో తెలిసి తప్పుచేయలేదు

రానున్న వంద రోజుల్లో పురపాలికలు సహా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తికానున్నాయని భేటీ సందర్భంగా నేతలతో రేవంత్ చెప్పారు. "వచ్చే వంద రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయబోతోంది. ఎలాగూ గెలుస్తున్నం కదా అని ఆటను లైట్‌గా తీసుకోవొద్దు. భారం మొత్తం కెప్టెన్‌పైనే వదిలేయొద్దు. ఫీల్డింగ్, కీపింగ్, బౌలింగ్.. ఇలా ఎవరి నైపుణ్యాన్ని వారు సమష్టిగా ప్రదర్శిస్తేనే ఆటను గెలుస్తం. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు నాలుగు స్తంభాల్లా నిలబడి అభ్యర్థుల్ని గెలిపించాలి" అని వ్యాఖ్యానించారు. రుణమాఫీ సహా రైతులకు అమలు చేసిన పథకాల పట్ల గ్రామీణ ప్రాంతాల్లో సానుకూలత ఉందని, సంక్రాంతి తర్వాత రైతు భరోసా కూడా అమలు చేయనున్నామని చెప్పారు. వీటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కలిసికట్టుగా పనిచేసి.. కార్యకర్తలనూ కలుపుకొని వెళ్లాలని సూచించారు. ఎలాంటి గ్రూపు తగాదాలూ లేకుండా చూసుకోవాలని, ఉన్నచోట్ల సర్దుకుపోయి ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. "ఏడాది పాలనలో మనకు తెలిసి తప్పు చేయలేదు. తెలియకుండా జరిగిన తప్పులపై చర్యలు తీసుకున్నాం" అని వ్యాఖ్యానించారు. ఏడాది పాలన అనుభవాలు వచ్చే నాలుగేళ్లకు ఉపయోగపడతాయన్నారు. అంగన్‌వాడీలు, డీలర్ల నియామకాల్లో పార్టీ నాయకులకు అవకాశం ఇవ్వాలంటూ ఓ మంత్రి కోరగా.. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుని పారదర్శకంగా నియామకాలు చేపట్టకుంటే తప్పుడు సంకేతాలు వెళతాయని చెప్పారు.

పార్టీ కోసం కష్టపడ్డోళ్లకే టికెట్లు!

పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డ నేతలకే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలంటూ పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కనీసంగా 80 శాతం టికెట్లు మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న నేతలకే ఇవ్వాలన్నారు. స్థానిక పరిస్థితుల కారణంగా ఇవ్వలేకపోయిన చోట్ల.. జిల్లా స్థాయిల్లో ఉండే నామినేటెడ్ పోస్టుల్లో వారిని సర్దుబాటు చేయాలని సూచించారు. అన్ని మునిసిపాలిటీలు, జెడ్పీల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్టీ అభ్యర్థులను గెలిపించే విషయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. మండలాల వారీగా బాధ్యతలు తీసుకుని పని చేయాలన్నారు. కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆషామాషీగా గెలిచిన వారు కాదని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అభ్యర్థులను గెలిపించి వారి సమర్థత నిరూపించుకోవాలని సూచించారు.

నవ వసంతంలో విజయ గీతికగా..

ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. "నవ వసంతంలో విశ్వవేదికపై.. విజయ గీతికగా తెలంగాణ స్థానం.. ప్రస్థానం ఉండాలి. ప్రతి ఒక్కరి జీవితంలో ఈ నూతన సంవత్సరం సుఖ సంతోషాలను నింపాలని మనసారా కోరుకుంటూ.. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు" అంటూ బుధవారం తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. కాగా ముఖ్యమంత్రి సహాయనిధికి సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యం రూ.20లక్షలను అందజేసింది. ఈ మేరకు బుధవారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబంధిత చెక్కును సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కలిసి అందజేశారు.

గ్యారేజీలోనే పర్యాటక బస్సులు!

- 'శ్రీవారి ప్రత్యేక దర్శనం' నిలిచిపోయాక ఒక్క నెలలోనే రూ.2కోట్లకుపైగా నష్టం
- ఇతర ప్యాకేజీలపై పర్యాటక సంస్థ నిర్లక్ష్యం

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పర్యాటక సంస్థ అధికారుల నిర్వాకం కారణంగా రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన బస్సులు గ్యారేజీకే పరిమితమవుతున్నాయి. పర్యాటక సంస్థలకు శ్రీవారి ప్రత్యేక దర్శనం టికెట్లను కేటాయించరాదన్న టీటీడీ బోర్డు నిర్ణయం.. తెలంగాణ పర్యాటక సంస్థకు శాపంగా మారింది. కొన్నేళ్లుగా హైదరాబాద్-తిరుమల ప్యాకేజీలకు మంచి ఆదరణ ఉండేది. శ్రీవారి ప్రత్యేక దర్శనం (రూ.300) టికెట్లతో కలిపి ప్యాకేజీ టూర్ ఉండడంతో తిరుమల వెళ్లే యాత్రికులు ఆసక్తి చూపేవారు. దీంతో పర్యాటక సంస్థ సైతం కోట్లాది రూపాయలు వెచ్చించి అధునాతన సౌకర్యాలతో కూడిన ఏసీ బస్సులను కొనుగోలు చేసింది. కానీ, అనూహ్యంగా నెల రోజుల క్రితం పర్యాటక సంస్థలకు టికెట్ల కేటాయింపును టీటీడీ రద్దు చేసింది. దీంతో తెలంగాణ పర్యాటక సంస్థ పరిధిలోనూ తిరుమల దర్శనం ప్యాకేజీ అటకెక్కగా, ఒక్క నెలలోనే రూ.2కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. అయితే, ప్రత్యామ్నాయ ప్యాకేజీలను తీసుకురావడంలో పర్యాటక సంస్థ అధికారులు విఫలమయ్యారన్న వాదన వినిపిస్తోంది. ఒక వైపు క్రిస్మస్ సెలవుల నేపథ్యంలో టూర్లు వెళ్లడానికి, మరో వైపు అయ్యప్ప స్వాములు శబరిమలై వెళ్లి రావడానికి ప్రత్యేక బస్సుల కోసం తీవ్రస్థాయిలో ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. గత్యంతరం లేక ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. అలాంటి వారికి బస్సులు కేటాయించే అవకాశం ఉన్నా.. పర్యాటక సంస్థ నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోంది. సాగర్, శ్రీశైలం, షిర్డీ ప్యాకేజీలు తప్ప ఇతర ప్యాకేజీలపై పర్యాటక సంస్థ అధికారులు దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. యాదగిరిగుట్ట, వరంగల్, రామప్ప, కాళేశ్వరం, వేములవాడ, బాసర, కొండగట్టు, మైసూర్ తదితర ప్యాకేజీలపై ప్రచారం చేయకపోవడంతో పర్యాటకులు ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తుండగా.. రాష్ట్ర పర్యాటక సంస్థ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు దారి తీస్తోంది.

నేడు ఈడీ ముందుకు బీఎల్ఎన్ రెడ్డి

- ఫార్ములా-ఈ కారు రేసు కేసులో రేపు అర్వింద్‌కుమార్ విచారణ

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో ఏ3 నిందితుడిగా ఉన్న హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి గురువారం ఈడీ విచారణకు హాజరు కానున్నారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన ఈడీ అధికారులు.. బీఆర్ఎస్ నేత కేటీఆర్‌తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డికి సమన్లు జారీ చేశారు. 7న విచారణకు రావాలని కేటీఆర్‌ను కోరారు. 3న అర్వింద్‌కుమార్‌ను విచారించనున్నారు. ఈడీ అధికారులు ఈ కేసులో కీలకమైన నిధుల బదిలీపై బీఎల్ఎన్ రెడ్డిని ప్రశ్నించనున్నారు. తొలి ఒప్పందం పురపాలక శాఖ, ఎస్ నెక్ట్స్‌జెన్ కంపెనీ, ఎఫ్ఈవో మధ్య జరగ్గా, హెచ్ఎండీఏ నుంచి నిధులు ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది? మొదటి ఇన్వాయిస్ ప్రకారం రూ.22,69,63,125, రెండో ఇన్వాయిస్ ప్రకారం రూ.23,01,97,500 చెల్లించాలని మీకు రాతపూర్వక ఆదేశాలు ఇచ్చారా? మౌఖిక ఆదేశాలు అందాయా? అనే అంశాలపై ఈడీ ఆరా తీయనుంది. బీఎల్ఎన్ రెడ్డి చెప్పే విషయాల ఆధారంగా మర్నాడు అర్వింద్‌కుమార్‌ను ఈడీ విచారించనుంది.

నాదీ తప్పయితే.. రేవంత్ చేసిందీ తప్పే

- ఫార్ములా-ఈ రేస్ రద్దు చేసినందుకు ఆయనపై కూడా కేసు పెట్టాలి
- ఏసీబీ, ఈడీ కేసులు దీటుగా ఎదుర్కొంటా
- సీఎం, మంత్రులంతా అవినీతి దుకాణం తెరిచారు : కేటీఆర్



తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న తలసాని

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : "నాడు పురపాలక శాఖ మంత్రిగా ఫార్ములా -ఈ రేసు ఈవెంట్‌కు నేను అనుమతిస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి దాన్ని రద్దు చేశారు. ఈ విషయంలో నేను చేసింది తప్పయితే.. ఇప్పుడు రేవంత్ చేసింది కూడా తప్పే. ఇద్దరి నిర్ణయాలపై క్యాబినెట్‌లో చర్చ జరగలేదు. ఈ మేరకు రేవంత్‌పైనా కేసు పెట్టాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియా ప్రతినిధులతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తనపై ఏదో ఓ కేసు నమోదు చేసి, జైలుకు పంపాలని ఆరు సార్లు ప్రయత్నించారని పేర్కొన్నారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ తప్పుల తడకగా ఉందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధంలేని అంశాలను అందులో ఇరికించారన్నారు. తాను ఇలాంటి వాటికి భయపడనని, ఏసీబీ కేసు, ఈడీ నోటీసును న్యాయపరంగా ఎదుర్కొంటానన్నారు. రైతు భరోసాను కుదించే ప్రయత్నంలో భాగంగా సెల్ఫ్ డిక్లరేషన్ అంశాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. సుప్రీం కోర్టుతో తిట్లు తిన్న ఏకైక సీఎం రేవంత్‌రెడ్డి మాత్రమేనని.. చివరకు ఆయన కోర్టుకు క్షమాపణ చెప్పాల్సి వచ్చిందన్నారు. అప్పు చేయకపోవడమే అభివృద్ధి అన్న రేవంత్... ఇప్పుడు రూ.1.35లక్షల కోట్లు ఎందుకు అప్పు చేశారని ప్రశ్నించారు. అందులో ఆర్ఆర్‌ట్యాక్స్ రూపంలో ఢిల్లీ పెద్దలకు ఎన్ని ముడుపులు వెళ్తున్నాయో చెప్పాలన్నారు. కాంగ్రెస్ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలంతా దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే పనిలో ఉన్నారని, ఒక్కొక్క మంత్రి ఒక్కొక్క అవినీతి దుకాణం తెరిచారని ఆరోపించారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై ప్రజల తరఫున తమ పార్టీ ఇచ్చేది మైనస్ మార్కులేనని చెప్పారు. సమాజంలో ఏ ఒక్కరిని అడిగినా.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బండ బూతులు తిడుతున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న ఆలోచన రేవంత్‌రెడ్డి సర్కార్‌కు లేదని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల స్థానాల్లో ఈ ఏడాది ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఏడాదంతా పార్టీ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామన్నారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్, డైరీని కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు(ఫైల్)

గ్రామ పంచాయతీ కార్మికుల పోరుబాట

4వ తేదీ తరువాత నిరవధిక సమ్మెకు నిర్ణయం

- మల్టీపర్పస్ విధానం రద్దు, పెండింగ్ వేతనాలే ప్రధాన డిమాండ్లు
- కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వినతి

ఆసిఫాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టనున్నారు. తమ జేఏసీతో చర్చలు జరపాలని డిసెంబరు 6న విన్నవించినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో శుక్ర, శనివారాల్లో టోకెన్ సమ్మె నిర్వహించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే జనవరి 4 తర్వాత నిరవధిక సమ్మెకు దిగనున్నారు. రాష్ట్రంలో 12,790 పంచాయతీల్లో సుమారు 50 వేల మంది గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, డంపింగ్ యార్డు, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు, కార్యాలయాల్లో క్యాటగిరీల వారీగా, డ్రైవర్లుగా పని చేస్తున్నారు. గత ప్రభుత్వం 2018లో జీవో నెం.51 జారీ చేసి సిబ్బంది వేతనాలను రూ.8,500కు పెంచుతూనే ఎవరైనా ఏ పనైనా చేయాలనే మల్టీపర్పస్ వర్కర్ల విధానం ప్రవేశపెట్టింది. దీంతో కార్మికులపై పని భారం పెరిగింది. 2011 లెక్కల ప్రకారం ప్రతి 500 మంది జనాభాకు ఒక కార్మికుడు చొప్పున 36,500 మందిని ఖరారు చేసి ఆన్‌లైన్‌లో పేర్లు పొందుపర్చారు. అయితే 13 సంవత్సరాల్లో గ్రామ పంచాయతీల విస్తీర్ణంతోపాటు పారిశుధ్య అవసరాలు పెరగడంతో మరో 13,500 మంది కార్మికులను అదనంగా నియమించారు. అయితే వీరి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో వేతనాలు నిర్ణయించిన దాని కంటే తక్కువ చెల్లిస్తున్నారు. అవీ ఐదారు నెలలుగా ఇవ్వకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు గత ఏడాది జూలైలో 30 రోజులకు పైగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఏడాది గడుస్తున్నా స్పందించకపోవడంతో జనవరి 4 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నారు.

డిమాండ్లు ఇవే..

- గ్రామ పంచాయతీ సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలి. వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి.
- సిబ్బందిని రెండో పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలి. జీవో నెం.60 ప్రకారం క్యాటగిరీల వారీగా వేతనాలివ్వాలి.
- జీవో నెం.51ను సవరించాలి. మల్టీపర్పస్ వర్కర్ల విధానాన్ని రద్దుచేయాలి. పాత క్యాటగిరీలను కొనసాగించాలి.
- సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలి. వేతనాలు పెంచాలి. అర్హులకు పదోన్నతులు ఇవ్వాలి.
- బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. రిటైర్మెంట్ సమయంలో రూ.5 లక్షలు చెల్లించాలి.
- కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి.
- ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికులకు కూడా వేతనాలు చెల్లించాలి. కార్మికుల సంఖ్య పెంచాలి.
- కార్మికులు అందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి. మృతిచెందిన, అనారోగ్యానికి గురైన కార్మిక కుటుంబాల సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలి.

చివరి త్రైమాసికంలో 30 వేల కోట్ల అప్పు?

ఎఫ్ఆర్‌బీఎం కింద సమీకరించే అవకాశం.. ఇప్పటికే టీజీఐఐసీ నుంచి 10 వేల కోట్ల జమ

- ఈ నెలలో మరో 10 వేల కోట్ల రుణం
- వీటితో 'రైతు భరోసా', 'రైతు కూలీలకు భృతి'!
- ఫిబ్రవరి, మార్చిల్లో 10వేల కోట్ల చొప్పున రుణం

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చివరి త్రైమాసికంలో సర్కారు రూ.30 వేల కోట్ల రుణానికి సన్నద్ధమైంది. ఇప్పటికే సర్కారు ఖజానాలో రూ.10వేల కోట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ మొత్తాన్ని తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీజీఐఐసీ) 400 ఎకరాలను తనఖా పెట్టి, సెక్యూరిటీ బాండ్ల ద్వారా తెచ్చిన రుణం ద్వారా సమకూర్చింది. ఎఫ్ఆర్‌బీఎంకు లోబడి ఈ నెలలో మరో రూ.10వేల కోట్ల రుణాన్ని ప్రభుత్వం తీసుకోనుంది. ఇదే కోవలో.. ఫిబ్రవరి, మార్చి నెలల్లో రూ.10వేల కోట్ల చొప్పున.. మొత్తం ఈ త్రైమాసికంలో రూ.30వేల కోట్ల మేర రుణాలు సేకరించనుంది. ఎఫ్ఆర్‌బీఎం కింద చివరి త్రైమాసికంలో ఈ రుణాలను సేకరించాలని నిర్ణయించిన సర్కారు.. ఆ మేరకు ఆర్‌బీఐకి నెలవారీ ఇండెంట్లు పెట్టింది. ఇలా ఖజానాలో చేరనున్న నిధులతో పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఈ నెలలో రైతు భరోసా, రైతు కూలీలకు రూ.12వేల భృతి, సర్పంచులకు రూ.10లక్షల్లోపు బిల్లుల మంజూరుకు సిద్ధమవుతోంది. దీంతోపాటు ఈ నెలలో యసమీకృత గురుకుల విద్యాలయాల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు కేటాయింపులు చేసే అవకాశాలున్నాయి.



రైతులకు శుభవార్త

కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలైన రైతు భరోసా, రైతుల కూలీలకు భృతిని అమలు చేయాలని నిర్ణయించిన సర్కారు.. ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించిన విషయం తెలిసిందే. మంత్రుల బృందం విధివిధానాలను రూపొందించగా.. ఈ నెల 4న జరగనున్న క్యాబినెట్ భేటీలో వీటికి ఆమోద ముద్ర పడే అవకాశాలున్నాయి. సంక్రాతి సందర్భంగా రైతు భరోసాను అమలు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఎకరానికి రూ.15 వేల కోట్ల చొప్పున.. రెండు సీజన్లకు కలిపి రైతులకు రూ.20 వేల కోట్లకు పైగా కేటాయింపులు చేయాల్సి ఉంటుందని అంచనా. అంటే.. ప్రస్తుత సీజన్‌కు రూ.10 వేల కోట్లు అవసరం. అయితే.. ప్రభుత్వం విధివిధానాల్లో భాగంగా విధించే షరతుల మేరకు.. ఈ మొత్తం రూ.4,800 కోట్లకు తగ్గవచ్చని భావిస్తున్నారు. రైతు కూలీలకు భృతి విషయంలోనూ సర్కారు నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

సర్పంచులకూ ఊరట

సర్పంచులకు సంబంధించిన అభివృద్ధి పనుల బిల్లులను కూడా రేవంత్ సర్కారు మంజూరు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. 2023 సంవత్సరం డిసెంబరు 7 నాటికి ఈ కోవలో రూ.1,300 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిల్లో రూ.10 లక్షల్లోపు ఉన్న బిల్లులను క్లియర్ చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇప్పటికే వెల్లడించారు. ఈ కోవలోని బిల్లులకు రూ. 400 కోట్ల వరకు అవసరమని అంచనా. ఈనెల, వచ్చేనెలల్లో ప్రభుత్వం ఈ క్యాటగిరీలోని బిల్లులను క్లియర్ చేసే అవకాశాలున్నాయి. వీటితోపాటు.. అత్యవసర పనులు, పథకాల కోసం ప్రభుత్వం నిధులను సమీకరించేందుకు కసరత్తు చేస్తోంది.

డీఏలపై నిర్ణయానికి చాన్స్

ప్రభుత్వం ఈ నెలలో ఉద్యోగులు, పెన్షనర్లకు విడుదల చేయాల్సిన నాలుగు కరువు భత్యాల(డీఏ) విషయంపైనా ఏదైనా నిర్ణయం తీసుకోవచ్చన్న చర్చ జరుగుతోంది. ఈ జనవరి 1 నుంచి ఉద్యోగులకు మరో డీఏ కూడా కలవనుంది. దీంతో.. పెండింగ్‌లో ఉండే డీఏల సంఖ్య ఐదుకు చేరుతుంది. ఈ నేపథ్యంలో ఉద్యోగులను శాంతపర్చడానికి ఒకట్రెండు డీఏలను సర్కారు ప్రకటించవచ్చని తెలుస్తోంది.



రుణాలు ఎప్పుడెప్పుడొస్తాయంటే?

తేదీ	అందనున్న రుణం (రూ. కోట్లలో)
జనవరి 7	3000
జనవరి 14	2000
జనవరి 21	2,500
జనవరి 28	2,500
ఫిబ్రవరి 4	3000
ఫిబ్రవరి 11	2000
ఫిబ్రవరి 18	2,500
ఫిబ్రవరి 25	2,500
మార్చి 4	3000
మార్చి 11	2,500
మార్చి 18	2000
మార్చి 25	2,500

మరో 9 జతల రైళ్లకు అదనపు జనరల్ బోగీలు

» ఇప్పటికే 31 రైళ్లలో అందుబాటులోకి: ద.మ.రైల్వే

హైదరాబాద్ సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే తీపి కబురు చెప్పింది. జోన్ పరిధిలో నడుస్తున్న మరో 9 జతల రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు జనరల్ బోగీలను జత చేయనున్నట్లు ప్రకటించింది. త్వరలోనే రెండేసి చొప్పున బోగీలను జత చేయడం ద్వారా జనరల్ కోచ్‌ల సంఖ్యను 4కు పెంచనున్నట్లు పేర్కొంది. రైల్వే ఉన్నతాధికారులు తెలిపిన సమాచారం మేరకు గోదావరి ఎక్స్‌ప్రెస్, చార్మినార్ ఎక్స్‌ప్రెస్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్- ముంబై సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హుస్సేన్ సాగర్ ఎక్స్‌ప్రెస్, ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్, సచ్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్(నాందేడ్-అమృత్‌సర్), జైపూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హిస్సార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సంక్రాంతిలోగా అదనపు కోచ్‌లను జత చేయనున్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని కలిగించడమే లక్ష్యంగా ఇప్పటికే రెండు విడతల్లో 31 జతల రైళ్లకు రెండేసి చొప్పున అదనపు జనరల్ కోచ్‌లను అందుబాటులోకి తెచ్చినట్లు సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

సంక్రాంతి నేపథ్యంలో కాకినాడకు 6 ప్రత్యేక రైళ్లు

» నేటి నుంచి రిజర్వేషన్ బుకింగ్ ప్రారంభం



హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ రైల్వే స్టేషన్ల నుంచి కాకినాడకు 6 ప్రత్యేకరైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెల 9 నుంచి 12వ తేదీవరకు ప్రత్యేక రైళ్లు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ నెల 9, 11 తేదీల్లో కాచిగూడ - కాకినాడ టౌన్(07653), 10, 12 తేదీల్లో కాకినాడటౌన్- కాచిగూడ(07654), 10న నాంపల్లి-కాకినాడ టౌన్(07023), 11న కాకినాడ-నాంపల్లి(07024) ప్రత్యేక రైళ్లు నడుస్తాయని వెల్లడించారు. ఈ రైళ్లకు గురువారం ఉదయం 8గంటల నుంచి అడ్వాన్స్ రిజర్వేషన్ బుకింగ్ ప్రారంభమవుతుందని వెల్లడించారు.

రేపటి నుంచి గోల్కొండ కోటలో 'నో యువర్ ఆర్మీ' మేళా

అల్వాల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): భారత సైన్యం 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో 'నో యువర్ ఆర్మీ' మేళా నిర్వహిస్తుంది. తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా ప్రధాన కార్యాలయం(టాసా) ఆధ్వర్యంలో ఆర్టిలరీ సెంటర్ సమన్వయంతో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా ఆర్మీడే పరేడ్ 2025కు భారత సైన్యం నాందికి పలుకుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పౌరులందరికీ అవకాశం కల్పిస్తుంది. సాయుధ దళాల్లో చేరడానికి యువతను ప్రేరేపించడమే ఈ మేళా లక్ష్యం. ఇందులో ఆర్టిలరీ గన్‌లు, చిన్న ఆయుధాలు, అధునాతన ఆపరేషనల్ టూల్స్, కమ్యూనికేషన్ సిస్టమ్స్, ఇంజనీరింగ్ సాధనాలు, న్యూక్లియర్ బయోలాజికల్ కెమికల్, వార్‌ఫేర్ సూట్‌లతో కూడిన చిన్న పరికరాల(మైనర్ ఎక్విప్‌మెంట్) స్టాల్‌ల పదర్శన ఏర్పాటు చేస్తారు. సైనిక దళాల ప్రత్యేక పదర్శనలు, గ్యాలంటరీ(శౌర్య) పతకాల ప్రదర్శనలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మిలటరీ పరికరాలతో ఫొటోలు దిగేందుకు, సాయుధ దళాలలో కెరీర్ అవకాశాల గురించి తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయాలను వివరించడానికి ప్రతీ స్టాల్ వద్ద ఆర్మీ సిబ్బంది ఉంటారని రక్షణశాఖ పౌరసంబంధాల అధికారి శివ హరినాయక్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

దుందుభి నదిపై రబ్బర్‌డ్యామ్!

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా పోతిరెడ్డిపల్లి వద్ద దుందుభి నదిపై రబ్బర్‌డ్యామ్ కట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటిదాకా పోతిరెడ్డిపల్లి వద్ద చెక్‌డ్యామ్ కట్టాలని నిర్ణయించగా తాజాగా రబ్బర్‌డ్యామ్‌కు ప్రభుత్వం మొగ్గు చూపింది. డిండి పథకంలో భాగంగా ఏదుల నుంచి శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటిని తరలించాలని నిర్ణయించిన విషయం విదితమే. ఏదుల నుంచి 2.525 కి.మీల ఓపెన్ కెనాల్‌తో పాటు 16 కి.మీల టన్నెల్, ఆ తర్వాత మరో 3.050 కి.మీల ఓపెన్‌కెనాల్ ద్వారా నీటిని దుందుభి నదిలోకి తరలించనున్నారు. ఈ నీటిని మళ్లించేందుకు పోతిరెడ్డిపల్లి గ్రామం వద్ద రబ్బర్ డ్యామ్ నిర్మించనున్నారు. డిండి పథకం ప్రతిపాదన సమయంలో ముందు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ద్వారా నీటిని తరలించాలని ప్రతిపాదించారు. ఆ తర్వాత ఏదుల నుంచి తరలించాలనే ప్రతిపాదన రాగా గతేడాది మార్చి 13వ తేదీన ఏదుల నుంచి పోతిరెడ్డిపల్లి దాకా లింక్‌కు ఆమోదముద్ర లభించింది. రూ.1788.89 కోట్లతో చేపట్టనున్న ఈ లింక్ పనులపై ఈనెల 4వ తేదీన జరుగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. ఈ అలైన్‌మెంట్‌కు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) కూడా ఆమోదం తెలిపింది. మంత్రివర్గం ఆమోదం లభించి, ప్రభుత్వం పరిపాలన పరమైన అనుమతినిస్తే ఈ పనులకు టెండర్లు పిలవనున్నారు. ఈ పథకంలో పోతిరెడ్డిపల్లి వద్ద రబ్బర్ డ్యామ్‌తో పాటు సింగరాజు పల్లి, గొట్టిముక్కల, ఇర్విన్, ఎర్రవల్లి-గోకారం, చింతపల్లి, కిష్టారంపల్లి, శివన్నగూడెంలో రిజర్వాయర్లు కట్టనున్నారు. ఈ ప్రాజెక్టుకు 16030 ఎకరాలకు గాను 12052 ఎకరాలను సేకరించారు. కాగా, ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోని 7 నియోజకవర్గాల పరిధిలో 228 గ్రామాలకు తాగునీటితో పాటు 3.61 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడానికి వీలుగా డిండి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టిన విషయం విదితమే.

గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు వేగవంతం

» విమర్శలకు తావు లేకుండా నిర్మాణం..
ఇప్పటికే రెండో విడత నోటిఫికేషన్

» 60 రోజుల వరకు అభ్యంతరాల స్వీకరణ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఫోర్త్ సిటీని కలుపుతూ నిర్మించ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులను సర్కారు వేగవంతం చేసింది. విమర్శలకు తావు లేకుండా, ఎక్కడా వంకరలు లేకుండా ఈ రహదారి నిర్మాణం చేపడుతోంది. తొలి విడత 20 కి.మీ. కోసం 449 ఎకరాల భూసేకరణ కోసం నోటిఫికేషన్ విడుదల చేసి హద్దులు కూడా నిర్ణయించింది. ఇక రెండో విడత 21.5 కి.మీ. కోసం 554.35 ఎకరాల భూసేకరణకు మంగళవారమే నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ గ్రీన్ ఫీల్డ్ రహదారి రావిర్యాలలోని ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ 13 నుంచి ఆమనగల్‌లోని ఆకుతోటపల్లి వద్ద రీజనల్ రింగురోడ్డుకు అనుసంధానం కానుంది. రెండో విడత కింద ఆమనగల్ మండలం ఆమనగల్‌లో 68.80 ఎకరాలు, ఆకుతోటపల్లిలో 83.35, యాచారం మండలంలోని కుర్మిద్ద 144.75, కడ్తాల్ మండలం కడ్తాల్‌లో 72.67, ముద్విన్‌లో 184.76 ఎకరాలు సేకరిస్తున్నారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న భూయజమానులు భూమిలో ఎలాంటి లావాదేవీలు నిర్వహించరాదని సర్కారు ఆదేశించింది. భూములు కోల్పోతున్న వారికి భూసేకరణ చట్టం ప్రకారం పారదర్శకంగా హేతుబద్ధమైన పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేసింది. భూసేకరణపై అభ్యంతరాలుంటే 60 రోజుల్లోగా జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాలని సూచించింది.

వాణిజ్య పన్నులశాఖలో 35 మందికి పదోన్నతులు

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో 35 మంది అధికారులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ ఉత్తర్వులను జారీ చేశారు. డిప్యూటీ కమిషనర్లు ఐ.ఆనంద్‌కుమార్, వాసవి జగన్నాథం, జి.లావణ్య, ఐ.సంయుక్తరాణిలకు జాయింట్ కమిషనర్లుగా, అసిస్టెంట్ కమిషనర్లు కె.రూపసౌమ్య, పి.శ్రీలత, కె.వేణుగోపాల్‌రావులకు డిప్యూటీ కమిషనర్లుగా, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్లు(సీటీఓ) కె.వెంకటేశ్వర్లు, ఎస్.నాగేంద్రరావు, టి.రాజేంద్రకుమార్, పి.రాజేంద్రప్రసాద్, పి.భీమ్లా..లకు అసిస్టెంట్ కమిషనర్లుగా పదోన్నతులు కల్పించారు. సాధారణంగా పదోన్నతులు పొందిన అధికారులను ఇతర ప్రదేశాలకు బదిలీ చేయాలి. కానీ పదోన్నతులు పొందిన ఈ అధికారులను ప్రస్తుత ప్రదేశాల్లోనే కొనసాగాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే మరో 23 మంది సీనియర్ అసిస్టెంట్లకు అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్లు(ఏసీటీఓ)గా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది.

మేడ్చల్.. శామీర్‌పేటకు మెట్రో!

(మొదటిపేజీ తరువాయి)


కారిడార్లను చేపట్టాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. తాజాగా నార్త్ సిటీకి సంబంధించి రెండు కారిడార్లను పార్ట్-బి కింద చేపట్టనుంది. వీటికి సంబంధించిన డీపీఆర్‌లను రూపొందించి కేంద్ర ప్రభుత్వ అనుమతికి పంపించాలని సీఎం సూచించారు. కాగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా ప్రాజెక్టును రూపొందించాలని సీఎం సూచించడంతో స్థానికులు సంతోషపడుతున్నారు. వాస్తవానికి నగరంలో ప్రజా రవాణాలో అతి కీలకమైన మెట్రో రైలుకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోంది. రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి తప్పించుకుని నిమిషాల వ్యవధిలో గమ్యస్థానాలకు చేరుకునే విధంగా దోహదపడుతున్న మెట్రో కోసం కొంతకాలంగా వివిధ ప్రాంతాల ప్రజలు పోటీ పడుతున్నారు. అధునాతన రవాణా వ్యవస్థ ద్వారా తమ పరిసరాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నారు. ఈ క్రమంలో మహానగరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నార్త్‌సిటీకి మెట్రోను నడిపించాలని స్థానికులు కొన్ని నెలలుగా గట్టిగా కోరుతున్నారు. ఈ మేరకు 2024 జనవరి 29న మేడ్చల్ మెట్రో సాధన సమితి పేరుతో ప్రత్యేక ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.

నార్త్‌సిటీలో ఈ కారిడార్లకు డిమాండ్..

హైదరాబాద్‌కు ఉత్తర ప్రాంతంలో ఉన్న ప్యారడైజ్ నుంచి తాడ్‌బండ్-బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్-మిలిటరీ డెయిరీఫామ్ రోడ్డు-కొంపల్లి-మేడ్చల్ వరకు (22 కిలోమీటర్లు), జేబీఎస్ నుంచి శామీర్‌పేట్-తూముకుంట వరకు (19 కిలోమీటర్లు), తార్నాక నుంచి ఈసీఐఎల్-నాగారం-కీసర వరకు (20 కిలోమీటర్లు), బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ నుంచి మూసాపేట్ వై జంక్షన్-బాలానగర్-సూరారం-గండిమైసమ్మ వరకు (21 కిలోమీటర్లు) మెట్రో కారిడార్లను నిర్మించాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు కోరుతూ వస్తున్నారు. రెండో దశలోనే ఈ పనులను చేపట్టాలని, తద్వారా స్థానికులకు మెట్రో రైలు రవాణా సౌకర్యం లభించడంతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని పేర్కొంటున్నారు. ఈ మేరకు మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో ఏడాది కాలంగా వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసనల ద్వారా ప్రభుత్వానికి తమ డిమాండ్లను చెప్పారు. ఇదే సమయంలో స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వ పెద్దలను, మెట్రో రైలు అధికారులను తరచూ కలుస్తూ విజ్ఞాపన పత్రాలను అందజేస్తున్నారు. కాగా, నార్త్‌సిటీలో ఆయా ప్రాంతాలకు చెందిన 25 వేల మందితో ఆన్‌లైన్ ద్వారా సంతకాల సేకరణ చేపట్టి ప్రధాని నరేంద్రమోదీకి, సీఎం రేవంత్‌రెడ్డికి పంపించారు. ఉత్తర ప్రాంతానికి మెట్రో రైలు వస్తే లక్షలాది మందికి ప్రతిరోజూ మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో సంతోషం..

మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా పార్ట్-ఎ లోని ఐదు కారిడార్లకు సంబంధించిన డీపీఆర్‌ను 2024 నవంబరు 4న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదంతో హెచ్ఏఎంఎల్ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి పంపించిన విషయం తెలిసిందే. ఈ డీపీఆర్‌కు మరో మూడు నెలల్లో గ్రీన్‌సిగ్నల్ లభించనున్నట్లు తెలుస్తోంది. అయితే నార్త్‌సిటీలో గతంలో ప్రతిపాదించిన కారిడార్లను కూడా రెండో దశలోనే చేర్చి పనులను పూర్తి చేయాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు మూడు నాలుగు నెలలుగా తమ పోరాటాన్ని ఉధృతం చేశారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. కాగా, ఆన్‌లైన్ ద్వారా సేకరించిన సంతకాలకు స్పందించిన ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) కొన్ని రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపించినట్లు తెలిసింది. అలాగే కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ కార్యాలయం నుంచి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి, హైదరాబాద్ మెట్రో రైలు కార్యాలయానికి లేఖలు రావడంతో ప్రభుత్వ పెద్దలు ప్రత్యేక దృష్టి సారించారు.



హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు స్వరూపం (కి.మీ.లలో)	
మొదటి దశ	
కారిడార్-1 (ఎల్‌బీనగర్-మియాపూర్)	29
కారిడార్-2 (జేబీఎస్-ఎంజీబీఎస్)	11
కారిడార్-3 (నాగోల్ - రాయదుర్గం)	29
రెండో దశ- పార్ట్-ఎ	
ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట	7.5
నాగోల్-ఎల్‌బీనగర్-చాంద్రాయణగుట్ట -ఆరాంఘర్-శంషాబాద్	36.4
రాయదుర్గం - కోకాపేట నియోపోలిస్	11.6
మియాపూర్ - బీహెచ్ఈఎల్- పటాన్‌చెరు	13.4
ఎల్‌బీనగర్ - వనస్థలిపురం- హయత్‌నగర్	7.1
శంషాబాద్ ఎయిర్‌పోర్టు-ఓఆర్ఆర్ మీదుగా కొంగరకలాన్- ఫోర్త్ సిటీ	40
రెండో దశ- పార్ట్-బి	
ప్యారడైజ్- మేడ్చల్	23
జేబీఎస్ - శామీర్‌పేట	22

రెండో దశలో పార్ట్-బి కింద రెండు కారిడార్లను చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి.. హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆదేశించారు. ప్యారడైజ్-మేడ్చల్ కారిడార్‌లో భాగంగా ప్యారడైజ్ మెట్రోస్టేషన్, తాడ్‌బండ్, బోయినపల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్ వరకు, జేబీఎస్-శామీర్‌పేట్ కారిడార్ కింద జేబీఎస్, విక్రమ్‌పురి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, అల్వాల్, బొల్లారం,

కారిడార్ల నిర్మాణం ఇలా..

హకీంపేట్, తూముకుంట, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్‌పేట్ వరకు కారిడార్ విస్తరించి ఉంటుందని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. కాగా, గతంలో మల్కాజిగిరి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన తనకు నార్త్‌సిటీ ప్రాంత ట్రాఫిక్ సమస్యలపై, ఆయా కారిడార్ల రూట్ మ్యాప్‌లపై అవగాహన ఉందని, అయినప్పటికీ రూట్ మ్యాప్ విషయంలో ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా వివరించి ఆయన సూచనలు, సలహాలను కూడా తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఎండీ తెలిపారు. డీపీఆర్ తయారీని మూడు నెలల్లోగా పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. సీఎం ఆదేశాలతో డీపీఆర్, ఇతర అనుబంధ డాక్యుమెంట్ల తయారీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

మిగతా రెండు కారిడార్లను చేర్చండి



నార్త్‌సిటీ మెట్రోకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలపడం చాలా సంతోషంగా ఉంది. మా ప్రాంతానికి మెట్రో రైలు కావాలని కొన్ని నెలలుగా పోరాటం చేస్తున్నాం. మా ఆకాంక్షను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని కొత్త సంవత్సరం రోజున గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ఆనందంగా ఉంది. ప్యారడైజ్- మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట మాదిరిగానే తార్నాక-ఈసీఐఎల్-కీసరవరకు, బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్-గండిమైసమ్మ కారిడార్లను కూడా రెండో దశలోనే చేర్చాలి. ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపరిస్తేనే నగరం మరింత అభివృద్ధి చెందుతుంది.

- మామిడి సంపత్‌రెడ్డి, మేడ్చల్ మెట్రోసాధన సమితి వ్యవస్థాపక సభ్యుడు



జూబ్లీ బస్‌స్టేషన్లో దుకాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపాలనలో బీసీ సంక్షేమానికి పెద్దపీట

» మంత్రి పొన్నం ప్రభాకర్

» గురుకులాలపై అధికారులతో సమీక్ష

» జూబ్లీ బస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

హైదరాబాద్, మారేడుపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలనలో ప్రభుత్వం బీసీ సంక్షేమానికి పెద్దపీట వేసిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2024-25 బడ్జెట్లో ప్రభుత్వం బీసీ సంక్షేమానికి రూ.9,200.32 కోట్లు కేటాయించినట్లు వివరించారు. గత ఆర్థిక సంవత్సరం కన్నా 2,971.32 కోట్లు అధికంగా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. కాగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి గురుకులాల్లో ప్రవేశాలు ప్రారంభించేనాటికి విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్, ట్రంకుపెట్టె, బెడ్డింగ్ మెటీరియల్ అన్నీ సిద్ధంగా ఉంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బీసీ సంక్షేమశాఖ సెక్రటరీ, కమిషనర్, ఎంజేపీ గురుకుల సొసైటీ కార్యదర్శి తదితరులతో మంత్రి బుధవారం జూమ్ మీటింగ్ నిర్వహించి గురుకుల పాఠశాలల కార్యకలాపాలను సమీక్షించారు. మార్చిన మెనూ ప్రకారం భోజనం తప్పనిసరిగా అందించాలన్నారు. ఆర్‌సీవోలు, జిల్లా అధికారులు తరచుగా తనిఖీలు చేయాలని సూచించారు. ఆహార పదార్థాల కొనుగోలు, నిల్వ, నాణ్యత, విద్యార్థుల ఆరోగ్యం, చదువు తదితర అంశాలపై ప్రతినెలా నివేదిక ఇవ్వాలన్నారు. విశ్వకర్మ పథకం లబ్ధిదారులను గుర్తించాలని, ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించేవారికి ఒక ఇంక్రిమెంట్ కట్ చేస్తామని హెచ్చరించారు. కాగా సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్(జేబీఎస్)ను మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్డు భద్రత మాసంలో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లతో మంత్రి మాట్లాడారు. బస్‌స్టేషన్‌లో సదుపాయాలు, సమస్యలపై ప్రయాణికుల్ని అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ క్యాంటీన్‌లో ఆహార నాణ్యత పరిశీలించారు. బస్‌స్టేషన్‌లో ఉన్న స్టాళ్లను పరిశీలించి నాణ్యమైన సరుకులు విక్రయించాలని, కాలం చెల్లినవి విక్రయించినా... అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సికింద్రాబాద్ లాలాపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలనూ మంత్రి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు.

సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీఎంని ఆయన నివాసంలో కలిసిన మంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్ఆర్ఆర్‌పై డంబెల్ ఆకృతిలో..

చౌటుప్పల్, సంగారెడ్డి వద్ద రెండు భారీ ఇంటర్‌చేంజ్‌ల నిర్మాణం

» ఇతర మార్గాల నుంచి ఆర్ఆర్ఆర్‌పైకి వెళ్లేందుకు, కిందకు దిగేందుకు వీలుగా..

» ఒక్కో డంబెల్ 37 హెక్టార్లలో నిర్మాణం

» హైదరాబాద్-మంచిర్యాల రహదారిలో క్లోవర్ లీఫ్ ఆకృతిలో మరో ఇంటర్‌చేంజ్

» 107 మైనర్, మేజర్ బ్రిడ్జిలు, 4 ఆర్వోబీలు

» 11 టోల్ ప్లాజాలు, 6 విశ్రాంతి ప్రదేశాలు

» అన్ని రకాలు కలిపి 187 అండర్‌పాస్‌లు

» ఇదీ ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం స్వరూపం

» టోల్‌తో 15,768 కోట్ల రాబడి అంచనా



ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో చౌటుప్పల్, సంగారెడ్డి వద్ద ఇలా డంబెల్ ఆకృతిలో రెండు భారీ ఇంటర్‌చేంజ్‌లు నిర్మిస్తారు

టోల్ ఆదాయం రూ.15 వేల కోట్లు!

161 కిలోమీటర్ల ఉత్తరభాగం ఆర్ఆర్ఆర్‌ను 5 ప్యాకేజీల్లో రూ.7,104.06 కోట్లతో 'ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్' (ఈపీసీ) పద్ధతిలో నిర్మించనున్నారు. నిర్మాణం పూర్తయిన తరువాత నుంచి 17 ఏళ్లలో టోల్ రూపంలో రూ.15,768 కోట్లు రాబడి వస్తుందని ఎన్‌హెచ్ఏఐ నియమించుకున్న కన్సల్టెన్సీ సంస్థ ఇటీవల ఇచ్చిన నివేదికలో పొందుపర్చింది.

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. టోల్‌ప్లాజాలు మొదలు ఆర్వోబీల వరకు ఎక్కడెక్కడ ఏయే నిర్మాణాలు ఎన్ని చేపట్టాల్సి ఉంటుందో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) తెలంగాణ విభాగం ఖరారు చేసింది. ఎక్స్‌టెండెడ్ డంబెల్స్ ఆకృతిలో రెండు కూడళ్లు, క్లోవర్ లీఫ్ ఆకారంలో మరో కూడలి రానుంది. ఎన్‌హెచ్ఏఐ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం ప్రారంభమయ్యే సంగారెడ్డి దగ్గర్లోని గిర్మాపూర్ వద్ద, విజయవాడ హైవేపై చౌటుప్పల్ వద్ద రెండు భారీ 'ఎక్స్‌టెండెడ్ డంబెల్స్' రానున్నాయి. వీటిని వేర్వేరు మార్గాల నుంచి ఆర్ఆర్ఆర్‌పైకి వెళ్లేందుకు, ఆర్ఆర్ఆర్ నుంచి కిందకు దిగి వివిధ మార్గాల్లోకి మళ్లేందుకు వీలుగా నిర్మిస్తారు. గిర్మాపూర్ వద్ద హైదరాబాద్-పుణె, చౌటుప్పల్ దగ్గర హైదరాబాద్-విజయవాడ హైవేలను క్రాస్ చేయాల్సి ఉంది. చౌటుప్పల్ వద్దే ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం మొదలవుతుంది. ఎక్స్‌టెండెడ్ డంబెల్స్‌కు చౌటుప్పల్ దగ్గర 37.46 హెక్టార్ల భూమి (ఒక హెక్టారుకు రెండున్న ఎకరాలు), సంగారెడ్డి దగ్గర 37.69 హెక్టార్ల భూమి అవసరమవుతోంది. ఈ కూడళ్లకు కలిపే లూప్ రోడ్లు సుమారు రెండు కిలో మీటర్ల దూరం నుంచే ప్రారంభమవుతాయి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని మొత్తం 8 వరుసలతో నిర్మించేందుకు వీలుగా భూ సేకరణ చేయగా మొదట 4 వరుసల్లోనే నిర్మించనున్నారు. డంబెల్స్‌ను మాత్రం 8 వరుసల రోడ్డుకు అనుగుణంగానే నిర్మిస్తారు. ఇక హైదరాబాద్-మంచిర్యాల రహదారిలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మధ్య క్లోవర్ లీఫ్ ఆకృతిలో మరో ఇంటర్‌ఛేంజ్ నిర్మించనున్నారు. ఈ కూడలిలోనూ డంబెల్స్ విధానంలో మాదిరిగానే లూప్ రోడ్లు ఉంటాయి. ఈ మూడింటితో పాటు మరో 8 చోట్ల వివిధ రకాల ఇంటర్‌ఛేంజ్‌లు నిర్మించనున్నారు.

ఇదీ రహదారి స్వరూపం!

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం 161 కిలోమీటర్లను 5 ప్యాకేజీల్లో నిర్మిస్తారు. ఈ మార్గంలో పలు జాతీయ, రాష్ట్ర రహదారులను క్రాస్ చేయాల్సి వస్తోంది. కొన్ని చోట్ల మైనర్, మేజర్, బాక్స్ కల్వర్టులు కూడా నిర్మించాల్సి ఉంది. ఎన్‌హెచ్ఏఐ నివేదిక ప్రకారం 11 ఇంటర్‌ఛేంజ్‌లతో పాటు 11 టోల్‌ప్లాజాలు, 6 చోట్ల విశ్రాంతి ప్రాంతాలు ఏర్పాటు కానున్నాయి. దాదాపు 187 చిన్న, మధ్య, భారీ తరహా అండర్ పాస్‌లు నిర్మించాల్సి ఉంది. వీటితోపాటు రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)లను ప్యాకేజీ-2, ప్యాకేజీ-3లో ఒక్కొక్కటి, ప్యాకేజీ-5లో రెండు నిర్మించాల్సి వస్తోంది. ఇవి కాకుండా 27 మేజర్ బ్రిడ్జిలు, 80 మైనర్ బ్రిడ్జిలు, 404 బాక్స్ కల్వర్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. రెండేళ్లలోనే పనులు పూర్తిచేయాలని కేంద్రం ఇటీవల ఆహ్వానించిన టెండర్ల నోటిఫికేషన్‌లో తెలిపింది. ఆ తరువాత 5 ఏళ్లు రహదారి నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్లదేనని కూడా పేర్కొంది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం సంగారెడ్డిలో మొదలై నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వరకు నిర్మాణం కానుంది.

ఎల్ఆర్ఎస్‌పై అనిశ్చితి?

» దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం

» పెండింగ్‌లో 25 లక్షలపైనే దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం) దరఖాస్తుల పరిష్కారంపై దరఖాస్తుదారుల్లో అనిశ్చితి కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పలు సమస్యల వల్ల దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. ఎల్ఆర్ఎస్ అంశంపై కొందరు కలెక్టర్లు దృష్టి పెట్టడం లేదు.. చాలా జిల్లాల్లో పురోగతి కనిపించడం లేదని కలెక్టర్లతో ఇటీవల నిర్వహించిన సమీక్షలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎల్ఆర్ఎస్ కింద 2020లో వచ్చిన దర ఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరులో మార్గదర్శకాలు విడుదల చేసినా ఈ ప్రక్రియలో పురోగతి లేదు. కులగణన పేరుతో దాదాపు నెల రోజుల పాటు అధికార యంత్రాంగం ఎల్ఆర్ఎస్‌ను పక్కన పెట్టేసింది. మళ్లీ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన మొదలైనా ఆ ప్రక్రియ నత్తనడకనే సాగుతోంది.

ఇప్పటి వరకు లక్ష లోపే

గత ప్రభుత్వం 2020 ఆగస్టు 31 నుంచి అక్టోబరు 31 మధ్య ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తులు స్వీకరించింది. దాదాపు 25.70 లక్షల దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి. వీటిల్లో హెచ్ఎండీఏ పరిధిలో 3.58 లక్షలు దరఖాస్తులు, జీహెచ్ఎంసీ పరిధిలో 1.06 లక్షలు, కార్పొరేషన్లు, మునిసిపాలిటీల నుంచి 13.75 లక్షలు ఉన్నాయి. 25.70 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే లక్ష లోపు దరఖాస్తుల పరిశీలన మాత్రమే పూర్తయింది. దరఖాస్తుల పరిశీలన మొదలైన కొత్తల్లో లాగిన్స్ తక్కువగా ఉండేవి. నాలుగు దశల్లో జరిగే దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ దీని వల్ల జాప్యం అవుతుందని గుర్తించిన అధికారులు లాగిన్స్ సంఖ్యను వెయ్యికి పైగా పెంచారు. కానీ, క్షేత్రస్థాయిల్లో ఎదురవుతున్న సమన్వయ లోపాల వల్ల ఆశించిన పురోగతి కనిపించడం లేదు. పట్టణ ప్రాంతాల్లో 13,75,666 పెండింగ్ దరఖాస్తులు ఉండగా వాటిల్లో 70 వేల దరఖాస్తుల పరిశీలన కూడా పూర్తి కాలేదని సమాచారం.

రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ద్వారా ఖజానాకు సుమారు రూ.8 వేల కోట్లు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటిదాకా 99,450 దరఖాస్తులు ఆమోదం పొందాయి. ఆరు నెలల్లో ప్రభుత్వానికి రూ.86 కోట్లు మాత్రమే సమకూరాయి. అయితే దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం, గతంలో దరఖాస్తు పెట్టుకున్న వారు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 548 గ్రామ పంచాయతీ లేఅవుట్లను ఇటీవల నిషేధిత జాబితాలో పెట్టారు. ఇది కూడా ఎల్ఆర్ఎస్‌పై ప్రభావం చూపిందనే చర్చ జరుగుతోంది.

రోజూ స్టేషన్‌కొచ్చి మర్యాదలు చేయండి

» 2 గంటలపాటు రిసెప్షన్‌లో కూర్చుని ఫిర్యాదుదారులకు స్వాగతం పలకండి

» ఇద్దరు యువతీయువకులకు కోర్టు కండిషనింగ్ బెయిల్

» రోడ్డు ప్రమాదానికి కారణమై, పోలీసులను తిట్టినందుకు

బంజారాహిల్స్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కారు నడిపి డివైడర్‌కు ఢీకొట్టడమే కాకుండా పోలీసులను దుర్భాషలాడిన ఇద్దరు యువతీయువకులకు కోర్టు బెయిలిస్తూనే విచిత్రమైన షరతులు విధించింది. 15 రోజుల పాటు రోజూ ఠాణాకు వెళ్లి రెండు గంటలపాటు రిసెప్షన్‌లో కూర్చోవాలని, అక్కడికి వచ్చే ఫిర్యాదుదారులకు స్వాగతం పలకాలని సూచించింది. మారెడ్‌పల్లికి చెందిన దయా సాయిరాజ్ ప్రముఖ వ్యాపారి. తన గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి ఈ నెల 28న జూబ్లీహిల్స్ జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఓ పార్టీకి వచ్చాడు. అక్కడ ఇద్దరు మద్యం తాగారు. అనంతరం ఇంటికి వెళ్లేందుకు అర్ధరాత్రి తర్వాత బెంజ్ కారులో బయలు దేరారు. రోడ్డు నెంబరు 45లో సినీనటుడు బాలకృష్ణ ఇంటికి సమీపంలోకి రాగానే మితిమీరిన వేగంతో ఉన్న వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి గాల్లో లేచి రోడ్డుకు ఆవలివైపు పడింది. బెలూన్లు తెరుచుకోవడంతో ఇద్దరికి సురక్షితంగా బయటపడ్డారు. జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇద్దరిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అక్కడ ఆ ఇద్దరు పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడారు. వారిపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసుకొని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. న్యాయమూర్తి వారికి బెయిల్ మంజూరు చేస్తూ 15 రోజుల పాటు రిసెప్షన్‌లో ఉండి, అక్కడికొచ్చే వారిని మర్యాద పూర్వకంగా పలకరలించాలని కండిషనల్ బెయిల్ ఇచ్చింది. కాగా బుధవారం ఈ కండిషన్‌ను సరిగ్గా పాటించకపోవడంతో యువకుడు, యువతిని పోలీసు అధికారులు మందలించారు. మరోసారి కోర్టుకు పంపిస్తామంటూ హెచ్చరించారు.



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న నందమూరి బాలకృష్ణ

త్వరలో బసవ తారకం ఆస్పత్రి విస్తరణ

» ఏపీలోని తుళ్లూరు వద్ద క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం

» ఆస్పత్రి చైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

హైదరాబాద్ సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిని త్వరలో విస్తరిస్తామని, అలాగే ఏపీలోని తుళ్లూరు ప్రాంతంలోనూ ఆస్పత్రి నిర్మాణాన్ని చేపడతామని ఆస్పత్రి చైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రకటించారు. బుధవారం ఉదయం ఆస్పత్రిలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులతో కలసి బాలకృష్ణ కేక్‌ను కట్ చేశారు. క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులతో పాటూ ఆస్పత్రి వైద్యులకు స్వయంగా కేక్‌ను తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు వైద్యం చేయాలి, సేవ చేయాలన్న ఆశయంతోనే ఆస్పత్రి నడుస్తోందని చెప్పారు. సినిమాల్లో, అన్ స్టాపబుల్ కార్యక్రమాల్లో వినోదాన్ని పంచుతూ ఆస్పత్రి వ్యవహారాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లే విషయంలో తనను ఏదో శక్తి నడిపిస్తోందని అన్నారు. ఆస్పత్రి వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని, ఈ సందర్భంగా ఆస్పత్రి పనితీరును పునశ్చరణ చేసుకొని మరింత ముందుకు వెళ్లడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఆస్పత్రి పురోగతికి దోహదపడిన దాతలు, గత పాలక మండలి సభ్యులు, పని చేసిన వైద్యులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు.



డిఫెన్స్ కాలనీ పార్కులోని నిర్మాణాలను తొలగిస్తున్న హైడ్రా

డిఫెన్స్‌కాలనీ పార్క్ స్థలంలో.. అక్రమ నిర్మాణాల కూల్చివేత

» కాలనీ సంఘం ఫిర్యాదుతో హైడ్రా చర్యలు

» అది పార్క్‌స్థలం కాదు: సొసైటీ మాజీ కార్యదర్శి

నేరేడ్‌మెట్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నేరేడ్‌మెట్ డివిజన్ డిఫెన్స్‌కాలనీ పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. మంగళవారం హైడ్రా, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టి.. నిర్మాణాలతోపాటు.. రేకుల షీట్లను తొలగించారు. కొందరు వ్యక్తులు సర్వేనంబర్ 218/1లోని ఈ స్థలాన్ని ఆక్రమించి, అక్రమంగా నిర్మాణాలు జరిపినట్లు డిఫెన్స్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా రంగంలోకి దిగి, పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు జరిపింది. రూ.కోట్లు విలువ చేసే స్థలాన్ని కాపాడడంపై హైడ్రాను కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు అభినందించారు. అయితే.. హైడ్రా కూల్చివేతలు అక్రమమని డిఫెన్స్ కాలనీ సొసైటీ మాజీ కార్యదర్శి శివయ్య ఆరోపించారు. హైడ్రా కూల్చివేతలు జరిపిన నిర్మాణాలు సర్వే నంబరు 205లో ఉన్నాయని, 218/1లో కాదని, ఆ స్థలాన్ని రక్షణ శాఖ నుంచి సొసైటీ తీసుకుందని పేర్కొన్నారు. ఆ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి గతంలోనే సొసైటీ నిర్ణయించిందని, ఆ మేరకు డెవలప్‌మెంట్ కోసం బిల్డర్‌కు అప్పగించిందని వివరించారు.

అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల పరిధిలో నేరాలపై ఫిర్యాదుకు ప్రత్యేక యాప్

» సైబరాబాద్ పోలీసులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ల లోపల జరిగే నేరాలపై ఫిర్యాదుల స్వీకరించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ లేదా యాప్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు చేయాలని సైబరాబాద్ పోలీసులను హైకోర్టు బుధవారం ఆదేశించింది. కమ్యూనిటీల లోపల జరిగే నేరాలపై ఫిర్యాదు చేసే ఫిర్యాదుదారుల గుర్తింపు బయటపడకుండా చర్యలు తీసుకుంటూనే సదరు ఫిర్యాదు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు చేరేలా ఏర్పాటు చేయాలని పేర్కొంది. అంతేకాక, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ల లోపల ఏం చేయవచ్చు? ఏం చేయకూడదు ? అనే పూర్తి వివరాలు, చట్టాల్లోని నిబంధనలను క్రోడీకరించి సూచనలు జారీ చేయాలని పేర్కొంది. హైదరాబాద్, కేపీహెచ్‌బీ 13వ ఫేజ్‌లోని ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్స్ విల్లాస్ చెందిన క్లబ్ హౌస్‌లో మద్యపానం, డ్రగ్స్ వినియోగం, గ్యాంబ్లింగ్ జరుగుతోందని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొంటూ ఓ విల్లా యజమాని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్స్ ఓనర్స్ అసోసియేషన్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఇలాంటి చర్యలు జరగకుండా సబ్ కమిటీలు వేయాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అలాగే, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ల లోపల జరిగే నేరాలపై పోలీసులు దృష్టిపెట్టాలని పేర్కొంటూ తుది తీర్పు జారీ చేసింది.

సాగర్ స్పిల్‌వేలో మళ్లీ గుంతలు!

మరమ్మతులు చేసి రెండేళ్లు కూడా గడవలే..

ప్రమాదంలో నాగార్జునసాగర్ జలాశయం

హైదరాబాద్/నాగార్జునసాగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల వరదాయిని అయిన నాగార్జునసాగర్ జలాశయం ప్రమాదంలో పడింది. సాగర్‌కు ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నా.. డ్యామ్‌కు రక్షణ కల్పించే శాశ్వత చర్యలు చేపట్టడం లేదు. సాగర్ స్పిల్‌వే ఓగీ(క్రెస్ట్ గేట్ల నుంచి విడుదలయ్యే నీరు వెళ్లే ప్రదేశం)లో గుంతలు బయటపడ్డాయి. స్పిల్‌వే ఓగీకి రూ.16.54 కోట్లతో మరమ్మతులు చేసి రెండేళ్లు కూడా కాలేదు. సాగర్ డ్యామ్ 26 బ్లాకులుగా ఉండగా ఆయా బ్లాకుల్లో 1-6 మీటర్ల లోతు వరకు గుంతలు ఏర్పడ్డాయి. సుదీర్ఘ విజ్ఞప్తుల అనంతరం గత ప్రభుత్వం మరమ్మతులకు ఉపక్రమించింది. కీలకమైన స్పిల్‌వే ఓగీతో పాటు బకెట్ పోర్షన్ (నీళ్లు డ్యామ్ నుంచి కిందికి దిగి.. సుడులు తిరుగుతూ వెళ్లే ప్రదేశం)లో మరమ్మతులకు రూ.16.54 కోట్లు అవుతాయని అంచనా వేసి, టెండర్లు పిలిచారు. అయితే కీలక ప్రాజెక్టుల పనులు చేసే ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థలేవీ ముందుకు రాలేదు. ప్రభుత్వం నిధులు ఇచ్చినప్పుడే తీసుకోవడానికి సిద్ధపడిన ఓ సంస్థ టెండర్లు వేసి.. పనులు దక్కించుకుంది. కానీ, స్పిల్‌వే ఓగీతో పాటు బకెట్ పోర్షన్ మరమ్మతులకు అవసరమైన సామగ్రి తరలించాలంటే ఏపీవైపు ఉన్న మార్గమే కీలకం. కమీషన్ల కక్కుర్తితో ఆ ప్రాంత ప్రజాప్రతినిధి నెలరోజుల పాటు సామగ్రిని తరలించకుండా అడ్డుకున్నారు. ఆ ప్రజాప్రతినిధులతో ఎలాగోలా సంప్రదింపులు జరిపి పనులు ప్రారంభించారు. గుంతలు పడిన ప్రదేశాన్ని ఎయిర్ వాటర్ జెట్‌తో శుభ్రం చేసి, ఆ తర్వాత గ్రౌటింగ్, డ్రిల్ చేసి, రాడ్లు బిగించి, పాత, కొత్త కాంక్రీట్‌కు కెమికల్ ట్రీట్‌మెంట్.. ఇలా క్రమక్రమంగా పనులు చేయాల్సి ఉండగా అలాంటివేమీ జరగలేదని నిపుణులు గుర్తించారు. పనులన్నీ డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్‌తో పాటు కేంద్ర జలవనరుల సంఘం పర్యవేక్షణలో చేస్తే ఫలితాలు వస్తాయని, అలా కాకుండా గుడ్డిగా చేయడం వల్ల ఓగీ మరమ్మతులు ఎక్కువ కాలం ఉండవని తేల్చారు. అనుకున్నట్లుగానే స్పిల్‌వే ఓగీలో మళ్లీ గుంతలు బయటపడ్డాయి. నాగార్జునసాగర్ ఆపరేషన్, మెయింటెనెన్స్ విషయంలో అంతర్జాతీయ ఖ్యాతి కలిగిన రాష్ట్ర నిర్మాణ సంస్థలను ఒప్పించే ప్రక్రియను గత ప్రభుత్వం చేయలేదు. ఇక ఈ ప్రాజెక్టు ఓఅండ్ఎం నిధులను గ్రీన్ చానల్ జాబితాలో పెట్టి ఉంటే కీలక సంస్థలు పనులు చేసేందుకు ముందుకు వచ్చేవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా మరమ్మతులను జాగ్రత్తగా చేయించాలని కోరుతున్నారు.



త్రిశంకు స్వర్గంలో సాగర్ నిర్వహణ

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ అనంతరం శ్రీశైలం నిర్వహణను ఏపీ చూస్తుండగా.. సాగర్ నిర్వహణ తెలంగాణ చూసేది. 2023 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయంలో నాటి ఏపీ సీఎం జగన్ ఆదేశాలతో పోలీసు యంత్రాంగమంతా సాగర్‌పైకి దండెత్తి, ఏపీ వైపు ఉన్న 13 గేట్లను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత ప్రాజెక్టు నిర్వహణ ద్వైవాధీనంగా మారింది. గత ఏడాది నిర్వహణ పనులన్నీ తెలంగాణే చూసుకున్నా.. ప్రాజెక్టు కృష్ణాబోర్డు పాక్షిక నియంత్రణలో ఉంది. ప్రాజెక్టు నిర్వహణను పూర్తిగా తెలంగాణకు అప్పగిస్తే.. మరమ్మతులు చేసే అవకాశాలున్నాయి.

నర్సింగ్ రిజిస్ట్రేషన్లలో దోపిడీ?

జిరాక్స్ సెంటర్లకు ఆన్‌లైన్ ప్రక్రియ అప్పగింత.. గత కొన్నేళ్లుగా దోచుకుంటున్న వైనం

» కౌన్సిల్ చేయాల్సిన పనిని బయటవారికి అప్పగింత

» అభ్యర్థులకు చుక్కలు చూపిస్తున్న కౌన్సిల్

» తిప్పించుకుంటున్న వైనం

» అడిగితే కనీస మర్యాదలేకుండా మాట్లాడుతున్న సిబ్బంది



హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవడం సమస్యగా మారుతోంది. రిజిస్ట్రేషన్ల రెన్యువల్స్ కోసం అభ్యర్థులు కౌన్సిల్ చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. వివరాలు అడిగితే కౌన్సిల్ సిబ్బంది కనీస మర్యాద లేకుండా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని అభ్యర్థులు వాపోతున్నారు. ఇదంతా ఒకెత్తు అయితే రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పైకి కనబడని దోపిడీ పర్వం అక్కడ కొనసాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీఎన్ఎమ్ (జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ), బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్ కోర్సులు పూర్తి చేసుకున్నవారు విధిగా నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ ప్రక్రియకు అంతకంటే ముందు ఎన్‌యూఐడీ (నర్స్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబరు) కార్డు ఉండాలి. అందుకోసం అభ్యర్థులంతా విధిగా నర్స్ రిజిస్ట్రేషన్ అండ్ ట్రాకింగ్ సిస్టమ్ (ఎన్ఆర్‌టీఎస్) వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, ఎన్‌యూఐడీ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఎన్‌యూఐడీ కార్డును ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ అమల్లోకి తీసుకొచ్చింది. నర్స్ కోర్సులు చేసిన ప్రతి ఒక్కరూ విధిగా ఈ నర్స్ ప్రత్యేక గుర్తింపు సంఖ్య కార్డును పొందాలి. అప్పుడే వారు చేసిన కోర్సులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ కానీ రెన్యువల్స్ కానీ అవుతాయి. నర్సింగ్ కౌన్సిల్‌కు వచ్చే ప్రతి ఒక్కరి వివరాలు విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆ తర్వాతే ఎన్‌యూఐడీ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయాలి. ప్రస్తుతం నర్సింగ్ కౌన్సిల్‌కు పక్కనే ఉన్న మెడికల్ కౌన్సిల్ తమ దగ్గరకు వచ్చే వైద్యుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆన్‌లైన్ చేస్తుంది. వారి దగ్గర ఫీజు ఆన్‌లైన్ ద్వారా తీసుకుంటూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తుంది. సరిగ్గా నర్సింగ్ కౌన్సిల్ కూడా అలాగే చేయాలి. కానీ కౌన్సిల్ పక్కనే ఒక జిరాక్స్ సెంటర్ ఉంటుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ముందుచేయాల్సిన ఆన్‌లైన్ ప్రాసెస్ అంతా జిరాక్స్ సెంటర్ వద్దనే చేస్తారని, అక్కడకు వెళ్లాలని ప్రతి ఒక్కరికి నర్సింగ్ కౌన్సిల్ సిబ్బంది చెప్పి పంపుతున్నారు. అక్కడకు వెళ్లిన తర్వాత ఆన్‌లైన్ ప్రాసెస్ పూర్తి చేశాక, క్యూఆర్ కోడ్ ద్వారా పేమెంట్ చెల్లించాలని జిరాక్స్ సెంటర్ వాళ్లు చెబుతున్నారు. తీరా పేమెంట్ చేశాక కొన్నిసార్లు అది నర్సింగ్ కౌన్సిల్‌కు చేరడం లేదు. ఆ డబ్బులు ఎక్కడికి పోతున్నాయో తెలియడం లేదు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని నర్స్‌లు డిమాండ్ చేస్తున్నారు. అలాగే నర్సింగ్ కౌన్సిల్‌లో దశాబ్ద కాలంగా పాతుకుపోయిన ఉన్నతాధికారుల నుంచి సిబ్బంది వరకు అందర్నీ బదిలీ చేయాలని నర్స్‌లు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్‌యూఐడీ కార్డు కోసం 3నెలలుగా తిరుగుతున్నా

నేను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిజేస్తున్నా. ఎన్‌యూఐడీ కార్డు కోసం మూడు నెలలుగా తిరుగుతున్నా. ఇక్కడి సిబ్బంది, ఉన్నతాధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వివరాలడిగితే విసుక్కుంటున్నారు. మళ్లీమళ్లీ అడిగితే చాలా నిర్లక్ష్యంగా, మర్యాద లేకుండా మాట్లాడుతున్నారు. కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదు.

-ఓ నర్స్ అభ్యర్థిని, ప్రైవేటు ఆస్పత్రి, హైదరాబాద్

రిజిస్ట్రేషన్ కోసం ఇంకెన్నిసార్లు రావాలో..

నా నర్సింగ్ రిజిస్ట్రేషన్ కోసం ఇప్పటికి ఐదుసార్లు వచ్చాను. ఇంకెన్నిసార్లు రావాలో అర్థంకావడం లేదు. ఇక్కడ కనీస సమాచారం ఇవ్వడం లేదు. రిజిస్ట్రేషన్ కోసం ఇప్పటికే రూ.వెయ్యి చెల్లించాను. సర్వర్ సమస్య వల్ల కౌన్సిల్‌కు రాలేదని చెబుతున్నారు. మళ్లీ డబ్బులు కట్టాలంటున్నారు. ఆ డబ్బులు తిరిగి నా బ్యాంకు ఖాతాకు జమకాలేదు.

- మరో నర్స్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

నేడు సుప్రీంలో విచారణకు ఒవైసీ పిటిషన్!

» ప్రార్థనా స్థలాల చట్టం అమలు కోరుతూ వ్యాజ్యం

న్యూఢిల్లీ : ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనల) చట్టం, 1991 అమలు కోరుతూ మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ.. సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ గురువారం విచారణకు రానుంది. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించాలని ఒవైసీ తన పిటిషన్‌లో కోరారు. హిందూ పక్షం వ్యాజ్యాలపై పలు మసీదుల సర్వేకు కోర్టులు ఆదేశించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ అంశంలో విచారణ పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో ఒవైసీ వ్యాజ్యాన్ని కూడా కలిపే అవకాశం ఉంది. 1947 ఆగస్టు 15 నాటికి దేశవ్యాప్తంగా ఉన్న ప్రార్థనా స్థలాల మత స్వభావాన్ని మార్చడానికి వీల్లేకుండా 1991లో అప్పటి కాంగ్రెస్ సర్కారు ఈ చట్టాన్ని రూపొందించింది. ఒవైసీ గత నెల 17న తన న్యాయవాది ద్వారా ఈ పిటిషన్ దాఖలు చేశారు. అయితే దానికి కాస్త ముందు గత నెల 12న.. తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకూ దేశంలోని ఏ కోర్టూ.. ప్రార్థనా స్థలాలకు సంబంధించి కొత్త వ్యాజ్యాలను విచారణకు స్వీకరించరాదని, ఇప్పటికే ఉన్న కేసుల్లో సర్వే నిర్వహణ సహా ఎలాంటి మధ్యంతర ఆదేశాలు, తుది ఉత్తర్వులు జారీ చేయరాదని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ చట్టంలోని పలు నిబంధనలను సవాల్ చేస్తూ ప్రముఖ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ తదితరులు దాఖలు చేసిన పిటిషన్ల విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. దీంతో కాశీలో జ్ఞానవాపి, మథురలో షాహీ ఈద్గాహ్ మసీదు సహా దేశవ్యాప్తంగా 10 మసీదులు/ముస్లిం ప్రార్థనా మందిరాల్లో సర్వే నిర్వహించాలని కోరుతూ దాఖలైన 18 వ్యాజ్యాల్లో తదుపరి విచారణలు నిలిచిపోయాయి. ఒకప్పుడు ఈ మసీదుల స్థానంలో దేవాలయాలు ఉండేవని, దురాక్రమణదారులు వాటిని కూల్చేశారన్నది హిందూ పక్షానికి చెందిన కక్షిదారుల వాదన.

ఏడీజీ పదవిపై ఐజీ కన్ను!

» జైళ్ల శాఖలో పదోన్నతికి తీవ్ర ప్రయత్నాలు..

» హోం శాఖకు దస్త్రం.. ఓ మంత్రి సహకారం

» ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్న ఐపీఎస్‌లు

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ఉన్న జైళ్ల శాఖలో రోజుకో కొత్త పరిణామం చోటుచేసుకుంటోంది. గతానికి భిన్నంగా, ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో ఇప్పుడు ఓ కొత్త పద్ధతికి శ్రీకారం చుడుతుండడం చర్చకు దారితీసింది. జైళ్ల శాఖలో ఉన్నత స్థాయిలో ఏడీజీపీ, ఐజీ, డీఐజీ ఉంటారు. ఇప్పటివరకు అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీ) హోదాలో ఐపీఎస్‌లు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వారు ఇక్కడే డీజీగా పదోన్నతి పొంది కొనసాగారు. ఇకపై అలాకాకుండా జైళ్ల శాఖకే చెందిన సీనియర్ ఐజీకి ఏడీజీ పదోన్నతి కల్పించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దస్త్రం ఇప్పటికే హోం శాఖకు చేరింది. అయితే, ఈ ప్రతిపాదనను ఐపీఎస్‌లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గ్రూప్-1 అధికారిగా డీఎస్పీ హోదాలో జైళ్ల శాఖలో చేరేవారు పదోన్నతులు పొందుతూ ఎస్పీ, డీఐజీ, ఐజీ స్థాయికి చేరుకుంటారు. ఉమ్మడి ఏపీలో జైళ్ల శాఖకు ఒక ఐజీ పోస్టు ఉండగా రాష్ట్ర విభజనలో అది ఏపీకి కేటాయించారు. తెలంగాణకు కొత్తగా ఐజీ పోస్టు మంజూరు చేశారు. కాగా, ఇద్దరు అధికారుల సీనియారిటీ తెరపైకి రావడంతో అదనంగా మరో ఐజీ పోస్టు ఏర్పాటు చేశారు. ఇద్దరు ఐజీల్లో ఒకరు సీనియర్ కావడంతో ఏడీజీ పదోన్నతి అంశాన్ని తెరపైకి తెచ్చారు. చకచకా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఓ మంత్రి సహకారంతో ముందుకెళ్తున్నట్లు తెలిసింది. హోం శాఖ న్యాయపరమైన అంశాలను పరిశీలించి త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్తగా తెరపైకి వచ్చిన అంశం జైళ్ల శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. ఐజీకి ఏడీజీగా పదోన్నతి కల్పిస్తే.. తమ అవసరం లేకుండా పోతుందని ఐపీఎస్‌లు వ్యతిరేకిస్తున్నారు. కీలక విభాగంపై అజమాయిషీ లోపిస్తుందనే అభిప్రాయాలు వస్తున్నాయి. హోం శాఖ సీఎం వద్ద ఉండడంతో విషయం ఆయన వరకు కూడా వెళ్లిందని విశ్వసనీయ సమాచారం.

డీజీ పరిశీలనలో సంగారెడ్డి ఘటన నివేదిక

సంగారెడ్డి జైల్లో విచారణ ఖైదీగా ఉన్న లగచర్ల రైతు హీర్యానాయక్‌ను సంకెళ్లు వేసి ఆస్పత్రికి తరలించడంపై జైళ్ల శాఖ విచారణ ముగిసింది. సంచలనంగా మారిన ఈ ఘటనపై సమగ్ర విచారణకు జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా సీనియర్ ఐజీని విచారణాధికారిగా నియమించారు. పూర్తి విచారణ అనంతరం అందజేసిన నివేదికను సౌమ్యా మిశ్రా పరిశీలిస్తున్నారు. అనంతరం సీఎంకు అందించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి జైలర్‌పై చర్యలు తీసుకున్నారు.

మాజీ బ్యాంక్ మేనేజర్ @ లేడీ రౌడీషీటర్

హడలెత్తిస్తున్న ప్రభావతి క్రైమ్ హిస్టరీ.. బ్యాంకులో పనిచేస్తుండగా బంగారం చోరీ

» దీంతో ఉద్యోగం నుంచి ఉద్వాసన

» స్వగ్రామం చేరుకుని అరాచకాలు

» ఆమెపై రౌడీషీట్ తెరిచిన పోలీసులు



గాయపడిన వెంకట్రావును ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

ఏలూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో బ్యాంకు మేనేజరు నుంచి లేడీ రౌడీ షీటరుగా అవతరించిన ఈమె హిస్టరీ అంతా ఆగడాలు.. అరాచకాలే! పని చేస్తున్న బ్యాంకులో బంగారం చోరీచేసిన వ్యవహారంలో ఉద్యోగం పోయింది. సొంత గ్రామం మర్రిబంధం చేరుకుని స్థానికంగా అడ్డూఅదుపు లేకుండా దౌర్జన్యాలకు పాల్పడటం మొదలుపెట్టారు. ఆమె ఆగడాలు భరించలేక నూజివీడు పోలీసులు రౌడీ షీట్ తెరిచారు. అప్పటినుంచి ఆమె అరాచకాలు మరింతగా ముదిరాయి. ఈ క్రమంలో మర్రిబంధంలో మరో ఆగడానికి దావులూరి ప్రభావతి తెర లేపారు. కర్రలు, రాడ్లు తీసుకుని స్థానిక జనసేన నేతపై ఆమె దాడి చేశారు. ఆ నేత చేతులు కట్టేసి తీవ్ర వేధింపులకు గురిచేసింది. కుటుంబంతో కలిసి క్రూరంగా దాడి చేయడంతో ఆయన స్పృహ తప్పి పడిపోయాడు. ఆ వివరాల్లోకి వెళితే.. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గంగూరులో బ్యాంక్ మేనేజర్‌గా ప్రభావతి కొంతకాలం పనిచేశారు. నూజివీడు మండలం సీతారామపురానికి చెందిన వైసీపీ నాయకుడు కవులూరి యోగేశ్వరరావు ఈ బ్యాంకులో 380 గ్రాముల బంగారం తాకట్టు పెట్టారు. ఫోర్జరీ సంతకంతో ఆ బంగారం కొట్టేసిన కేసులు ప్రభావతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీనిపై ఆమె ఉద్యోగం పోయింది. అప్పటి నుంచి కవులూరి యోగికి ప్రభావతికి మధ్య అనేక వివాదాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రులను, తాజాగా రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనితను సైతం ఆమె కలిసి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. అయితే ఆమె వ్యవహార శైలిని తెలుసుకున్న వారు ఈమె విషయంలో ముఖం చాటేశారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ప్రభావతి కలిశారు. ప్రభావతి వ్యవహారంపై మర్రిబంధంలో స్థానిక జనసేన నాయకులను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమగ్ర వివరాలు కోరారు. ఈ వ్యవహారాలను దోనవల్లి వెంకట్రావు మరిబంధంలో చూస్తున్నారు. అయితే, వెంకట్రావు.. పవన్‌కు తనపై వ్యతిరేకంగా సమాచారం ఇచ్చాడని ఆమె కక్ష పెంచుకున్నారు. ఈ క్రమంలో బుధవారం వెంకట్రావుపై ప్రభావతి.. తన తండ్రి రంగారావు, సోదరుడు ప్రభుకుమార్‌లతో కలిసి దాడి చేశారు. చేతులు కట్టేసి విచక్షణారహితంగా కొట్టారు. దీనిని గమనించిన గ్రామస్థులు, ఘటనను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి, సామాజిక మాధ్యమాలలో పోస్టు చేశారు. సమాచారం అందుకున్న నూజివీడు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఆది నుంచి వివాదాలే..

ప్రభావతి ఆది నుంచీ వివాదాస్పదురాలే. సొంత కుటుంబ సభ్యుల ఆస్తులను కైంకర్యం చేశారు. మర్రిబంధం పక్కనే గల పల్లెర్లమూడిలో బంగారం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని బెదిరింపులకు దిగారనే ఆరోపణలు ఆమెపై ఉన్నాయి. గ్రామంలో ప్రతి రోజూ గిల్లికజ్జాలు పెట్టుకుంటూ ఉండటంతో నూజివీడు రూరల్ పోలీసులు ఆమెపై రౌడీషీటర్ సైతం నమోదు చేశారు. అయితే, ప్రభావతిపై పోలీసులు చర్యలు చేపట్టడంలో తీవ్ర జాప్యం చేటు చేసుకోవడం వల్లే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభావతి ఒక పథకం ప్రకారం గతంలోనూ, ఇప్పుడూ అధికార పార్టీ నాయకుల పేర్లను వాడుతుండటంతో పోలీసులు ఆమెపై చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ఆమె బాధితులు నానాటికి పెరిగిపోతున్నారు. ఇప్పటికైన పోలీసులు తక్షణం స్పందించి దావులూరి ప్రభావతిని అదుపులోకి తీసుకుని తమకు రక్షణ కల్పించాలని మర్రిబంధం గ్రామస్థులు కోరుతున్నారు. కాగా, గాయపడిన వెంకట్రావును కృష్ణా జిల్లా జనసేన నేతలు నూజివీడు ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు.


తెలంగాణ హైకోర్టు జడ్జిలకు 'ఏపీ అతిథులు'గా గుర్తింపు

» వారి పర్యటనల్లో ప్రోటోకాల్ పాటించాలంటూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు జడ్జీలకు ఇచ్చే ప్రాధాన్యం, గుర్తింపును తెలంగాణ నుంచి వచ్చే హైకోర్టు జడ్జీలకు కూడా ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ విన్నపం మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ నుంచి ఏపీకి వచ్చే హైకోర్టు జడ్జీలను ముఖ్యఅతిథులుగా పరిగణించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జడ్జీల అధికారిక లేదా అనధికారిక పర్యటనలోనూ ప్రోటోకాల్ పాటించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా హైకోర్టు రిజిస్ట్రార్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

సోషల్ మీడియాను సక్రమంగా వాడదాం

అసభ్యకరమైన పోస్టులకు స్వస్తి చెబుదాం: చాగంటి



అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): 'మనం ఎవరినైనా ఏదైనా మాట అనే ముందు, వాళ్లు కూడా మనల్ని అలాగే అంటే మనకి బాధగా ఉంటుందా... సంతోషం కలుగుతుందా? అన్నది ఆలోచించుకోవాలి' అని ప్రవచన కర్త, ఆంధ్రప్రదేశ్ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచించారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులపై స్పందించిన ఆయన రాష్ట్ర ప్రజలకు వీడియో ద్వారా తన సందేశాన్ని తెలియజేశారు. 'మనం ఇతరులను ఒక మాట అంటే వాళ్లు బాధపడతారని తెలిసినప్పుడు అలాంటివి మాట్లాడకూడదు. ఏ పని చేస్తే ఇతరులు బాధపడతారో అటువంటి పనులు అసలు చేయకూడదు. ధర్మాలలోకెల్లా పెద్ద ధర్మం ఇదే. కాబట్టి ప్రతి ఒక్కరూ సమన్వయం పాటించాలి' అని చాగంటి సూచించారు. '84 లక్షల జీవరాసుల్లో వాక్కు ఉన్నది ఒక్క మనుషుడికే. ఆ మనిషి తన వాక్కును పది మంది శాంతి... సంతోషాల కోసం వాడాలి. అంతేగాని ఇతరుల మనసులను గాయపర్చడానికి మాటల్ని వాడకూడదు. ఈ విషయాలు దృష్టిలో పెట్టుకుని సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుందాం. ఇతరుల మనసులు బాధపడేటట్టుగా, ప్రత్యేకించి కుటుంబ సభ్యుల్ని, మహిళల్ని ఉద్దేశించి అసభ్యకరమైన పోస్టులు పెట్టకుండా మనల్ని మనం నియంత్రించుకుని సభ్యత, సంస్కారాలను చాటుకుందాం' అని చాగంటి పిలుపునిచ్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.